
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

20-1-84

150 పైసలు





మీ దినచర్య

టాన్‌టెక్స్®

తోనే ప్రారంభించండి


పగలు మొదలు రాత్రి వఱకు టాన్‌టెక్స్‌నే ధరించండి. దాని అమరిక, పొందిక మీ దినచర్య లందు ఎంతో తోడ్పడును.

IS : 4964

ISI

మీకు ఖచ్చితంగా
సరిపోతుంది
టాన్‌టెక్స్

బ్రీఫ్‌లు • వెస్ట్‌లు • క్యాజుయల్స్ • స్పోర్ట్స్
పిల్లల దుస్తులు



TTK తంపహారి

Imageads-M- TT.1568 Tel





ముఖచిత్రం

అందాలొలికించే ముద్దుగుమ్మలు రాధ, జయసుధల ముఖచిత్రారవిందంతో ఈ వారం పత్రిక చూడముచ్చటగా ఉంది

ఎమ్ జగన్మోహనరావు పట్నాయక్, విశాఖపట్నం—4

* * *

ఇద్దరు దొంగలులోని రాధ, జయసుధగార్ల ముఖచిత్రంతో వచ్చిన పత్రిక కన్నుల పండుగులా మా ఇంటిల్లిపాదిని ఆకర్షించి మమ్మలను ఆనందింపజేసింది అలాగే ముఖచిత్రముగా శ్రీ యన్ టి ఆర్, శ్రీదేవిగార్లతో త్వరలో పబ్లిష్ చేస్తారని ఆశిస్తున్నాను

గోలి అప్పలరాజు, తగరపువలస

సీరియల్స్

''అనురాగతరంగాలు'' సీరియల్ ఈ వారం కొత్త మలుపు తిరిగింది లీల అనారోగ్యానికి గురి అయిందని చదువుతున్న కళ్ళ నుండి ఒక్కసారిగా కన్నీటి బిందువులు జారిపడ్డాయి లీల లాంటి ప్రాణస్నేహితురాలు తమని వదిలిపెట్టి వెళుతున్నపుడు రేణుక సంభాషణలు నా మనస్సును కలచివేశాయి నిజంగా స్నేహంలో ఇంతటి మాధుర్యం ఉందా! అని అనిపించింది ఈ సీరియల్ నవల్లో లీలకు ఏదైనా జరగరానిదే జరిగితే రేణుక, రఘుల కంటే పాఠకుడిగా నేనే ఎక్కువగా బాధ పడతానేమో అనిపిస్తుంది ఈ నవల్లో లీల పాత్ర ఎందుకో నా మనసుని విపరీతంగా ఆకర్షించింది లీల లాంటి స్నేహితురాలు నాకు కూడా ఉంటే ఎంత బాగుణ్ను అనిపిస్తుంది ఇంత మంచి నవలను అందించినందుకు రచయిత్రి భవానీ కృష్ణమూర్తిగారికి అభినందనలు

పి ఉమామోహన్, కాశీబుగ్గ

* * *

మాదిరెడ్డి సులోచనగారి ''యక్షగానం'' సీరియల్ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది యడవల్లి నాగేశ్వరరావుగారి ''మనిషి, మతం, మనుగడ'' నేటి వ్యవస్థకు అద్దంపట్టేలా చిత్రీకరించారు ''అందరూ ఇలాగ వుంటే'' విన్నకోట సుశీలాదేవిగారి కథ కూడా మాకెంత గానో నచ్చింది

వి శ్రీనివాసరావు, తుమ్మికోట

సరాగమాల

''సరాగమాల'' శీర్షికలో రచయిత శ్రీ రంగారావు ''లేశమైనా బూతూ యే కోశానా అల్లరీ అరుపూ లేని యీ పాటలు ఆంధ్రదేశంలో కొంటారా, వింటారా'' అన్నారు అల్లరీ, అరుపూ బూతు వున్న పాటలను ఇష్టపడే శ్రోతలు బహుకొద్దిమంది మాత్రమే

యండమూరి శ్రీరామ్మూర్తి, రాజమండ్రి

న్యూఢిల్లీ లేఖ

జయదుబాషీగారి న్యూఢిల్లీలేఖ చాలా బాగున్నది

పి ఎస్ వి సత్యనారాయణ, టెలికమ్‌కాలనీ, గొల్లపూడి – 521225

వ్యక్తిగతం

''వ్యక్తిగతం'' అనే శీర్షికవలన మాకు తెలియని విషయాలను తెలుసుకోగలుగుతున్నాము అట్లాగే ''పాఠకుని డైరీ'' మాకు దేశంలో జరుగుతున్న విశేషాలను తెలుపుతుంది ఈనాడు ప్రతి ఒక్క పత్రిక సినిమా నటి, నటుల బొమ్మలను ముఖచిత్రంగా ప్రచురిస్తున్నాయి మన పత్రిక అన్నిటికన్నా ప్రత్యేకంగా ఉండటానికి మన పత్రిక ముఖచిత్రంమీద అందమైన సీనరీ వేయగలరని ఆశిస్తున్నాను

రెడ్డి నాగేశ్వరరావు, మాచర్ల

మనిషి - మతం—మనుగడ

శ్రీ యడవల్లి నాగేశ్వరరావ్‌గారి ''మనిషి—మతం—మనుగడ'' అను కథ చాలా బాగున్నది నేటి సమాజమందు జరుగుచున్న కుల మత ద్వేషములు, వాటివలన తక్కువ కులమనెడివారికి జరుగు అవమానములు, బాధలు భరింపరానివి తత్ఫలితము వలన జరుగు మతాంతీకరణ తెలియజేయుచు, యిలాగే జరిగినచో, హిందూ మతమునకి దుర్దశ పట్టునని హెచ్చరిస్తూ, రచయిత ఎంతో గొప్ప భావమును యిమిడ్చి తెలియజేసినందులకు ధన్యవాదాలు

బి నారాయణస్వామి, హిందూపురం

దిగ్భ్రాంతి

23–12–83 సంచికలో 'హవిస్' అకాల మరణ వార్త నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది ('60–'70) దశాబ్దపు పాఠకులందరికీ ప్రఖ్యాత రచయితగా అతి దగ్గరివాడైన 'హవిస్' ఈ మధ్య కాలంలో రాయటం తగ్గించినా పాఠకుల మనసులకి దూరం కాలేదు ఈనాడు అనంతలోకాల్ని వెదుకుతూ వెళ్ళిపోయి మాత్రం పాఠకుల్నీ, రచయితల్నీ కూడా విచారసాగరంలో పడద్రోశాడు! 'హవిస్' ఆత్మశాంతికి దేవుణ్ణి ప్రార్థిస్తూ, ఆయన కుటుంబానికి నా సంతాపాన్నీ, సానుభూతినీ వెల్లడిస్తున్నాను—


పి వి ఆర్ శివకుమార్, ఔరంగాబాదు ★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]
శుక్రవారం 20–1–84'
రుధిరోద్గారి నామ సం పుష్య బ విదియ
సంపుటము 76 సంచిక 19
సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ
విడి ప్రతి వెల రు 1-50
ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం. విజయవాడ-520 003

విషయానుక్రమణిక

లోకం పోకడ - ఊసెమెన్



మనలో మాట

మా పాఠకులు, రచయిత(త్రు)లు, ఏజంట్లు, ప్రకటన కర్తలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

1983 దీపావళి కథల పోటీలో రు 600 లు బహుమతి పొందిన ఆరు కథలపై మేము నిర్వహించిన పాఠకుల బాలట్, వ్యాస రచన పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని వాటిని జయప్రదం చేసిన వారందరికి మా కృతజ్ఞతలు.

బాలట్‌లో మొట్టమొదటి కథగా 'మమతల వంతెన'ని పాఠకులు ఎన్నుకున్నారు 'దొడ్డమనసు' రెండవ కథగా ఎన్నికైతే, 'వారసత్వం' కథ మూడవ స్థానాన్ని అందుకున్నది

ఇక మిగిలిన నాలుగు, అయిదు, ఆరు స్థానాలలో వరుసగా 'రేపటి తండ్రి', 'గోరంత దీపం', 'మనుషులు' కథలు వచ్చాయి.



శ్రీ పాలగిరి వేణు



శ్రీ బెహరా వెంకట సుబ్బారావు



శ్రీ వి వి రమణారావు, శ్రీ పి ఎల్ నరసింహారావు

పాఠకుల బాలట్‌లో మొట్టమొదటి కథగా ఎన్నికై మరో రు 650/– లు అదనపు బహుమతిని అందుకున్న 'మమతల వంతెన రచయిత శ్రీ పాలగిరి వేణు పాఠకులకి సుపరిచితులే ఈయన కాలేజి విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన మొదటి కథ 'విధి రాకాసి ఆంధ్ర సచిత్ర వార పత్రికలో పడింది ఇంత వరకూ 65 కథలకి పైగా వివిధ మాస, వార పత్రికలలో వచ్చాయి ప్రస్తుతం ఈయన ఫెర్టిలైజర్ సిటీలోని ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఎకౌంట్స్ ఆఫీసరుగా పని చేస్తున్నారు, భార్య శ్రీమతి ఊర్మిళాదేవి తమ రచనలకి ఊపిరి అంటున్నారు శ్రీకాంత్‌ప్రియ, వంశీప్రియ, శరత్‌ప్రియ వీరి చిరంజీవుల పేర్లు వీలున్నప్పుడల్లా మంచి కథలు రాయాలనే ఉబలాటం, తపన తమకి ఉన్నాయని అన్నారు

బాలట్‌లో రెండవ కథగా ఎన్నికై మరో రు 550/– లు అదనపు బహుమతి పొందిన 'దొడ్డ మనసు' కథా రచయిత శ్రీ బెహరా వెంకట సుబ్బారావు స్వస్థలం జననం తూర్పు గోదావరి జిల్లా ప్రస్తుతం విజయనగరం జిల్లా కొత్తవలసలో సబ్ పోస్టు మాస్టరుగా ఉద్యోగం 1957–58 సంవత్స రాలలో సుమారు 8 కథలు రాసినట్లుగా చెప్తున్నారు ఆ తర్వాత మళ్ళీ 1976 నించి కథలు రాయడం మొదలుపెట్టారు ఇప్పటికి సుమారు 70 కథలు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమైనాయి 1977లో 'వన్ మినిట్', 1981లో మానవత్వం' కథలకి ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతులు పొందారు 1982 జాగృతి దీపావళి కథల పోటీలో 'మానవత్వం మరోసారి మరణించింది కి మొదటి బహుమతి వచ్చింది 1983లో బాలజ్యోతి పిల్లల నవలల పోటీలో వీరి 'దారి తప్పకు' ద్వితీయ బహుమతి పొందింది మూడు ప్రముఖ మాస పత్రికలలో కన్సొలేషన్ బహుమతులు లభించాయి ఆకాశవాణి ద్వారా మూడు కథలు ప్రసారం అయినాయి ఇద్దరబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు సంతానం 'కథ చదివిన తర్వాత పాఠకుని హృదయం ఒక్క క్షణం అయినా స్పందించాలి మరో కథకోసం పేజీ తిప్పనీయ కూడదు, కొంతసేపు ఆలోచించేలా చేయాలి. పాఠకులలో నూటికి ఒకరినైనా కథ ప్రభావితం చేయగలిగితే రచయిత ధ్యేయం నెరవేరినట్లే అన్నది వీరి అభిప్రాయం

మూడవ కథగా ఎన్నికై మరో రు 450 అదనపు బహుమతిని అందుకున్న 'వారసత్వం' ఇద్దరు రచయితల స్వంతం శ్రీ వి వి రమణారావు, శ్రీ ప ఎల్ నరసింహారావు జంటగా ఈ కథ రాశారు శ్రీ వఠెం వెంకట రమణారావు 1952 నవంబరు 14న హైదరాబాదులో జన్మించారు వివాహం అయింది భార్య శ్రీమతి విజయ సంతానం సుచరిత, సుమన్‌లు హైదరాబాదు లోని రీజినల్ రీసెర్చి లేబొరేటరీలో స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగం 1971 నుంచి కథలు రాస్తున్నారు

గత రెండేళ్లుగా 'ర.చ.న' పేరుతో కథలు రాస్తున్న ముగ్గురు రచయితలలో వీరి పేరు మొదటిది. జంట రచయితలుగా వీరు, శ్రీ పి. ఎల్. నరసింహారావు కథలు రాస్తున్నారు.

శ్రీ చింతపల్లి లక్ష్మీనరసింహారావు 1935 ఆగష్టు 15 న జన్మించారు. శ్రీమతి—లీలావతి. ఇద్దరు కుమార్తెలు—శ్రీదేవి, శారద, కుమారుడు —శ్రీనివాస్ సంతానం. ప్రస్తుతం హైదరాబాద్ లోని ఆజంపుర నెం. I ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉన్నారు. 1957 ఆగష్టులో వీరి మొదటి కథ 'సారథీ నవ్వు' ఆంధ్రపత్రిక సారస్వతాను బంధంలో పడింది. 'అభిమన్యు' కలం పేరుతో 200 కథల దాకా రాశారు. కొంత కాలంగా 'ర. చ. న'లో 'న' గా, శ్రీ వి. వి. రమణారావుతో జంటగా కథలు రాస్తున్నారు. 'ర. చ. న'లో 'చ' గా వీరితో సహకరిస్తున్న శ్రీ అంపేరాయని చంద్రశేఖరరావు కూడా 'శ్రీ సింధు' పేరుతో సుపరిచితులు.

ఇక కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కటీ రు. 250/— అదనపు బహుమతులందుకున్న మిగతా మూడు కథలలో 'రేపటి తండ్రి' కథా రచయిత శ్రీ గంగుల నరసింహారెడ్డి మహబూబ్ నగర్ జిల్లా తిమ్మాజీ పేట దగ్గరగల వెదిరేపల్లిలో పుట్టారు. విద్యాభ్యాసం హైదరాబాదు. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు ఉద్యోగిగా కరీంనగర్ జిల్లా కోరుట్లలో ఉంటున్నారు. వయసు పాతికేళ్లు. రచయితగా రాసినవి తక్కువే అయినా వాటిలో బహుమతులందుకున్నవి ఎక్కువ అని అన్నారు. ఇక ఇష్టాయిష్టాల మాటకివస్తే తమని గురించి 'ఇంతకన్నా ఎక్కువ చెప్పకోడం అయిష్టం' అని అంటున్నారు.

'గోరంత దీపం' కథా రచయిత 'విహారి'గా ఆంధ్ర సచిత్ర వార పత్రిక పాఠకులకి సుపరిచితులైన శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి. జన్మ స్థలం తెనాలి— స్వస్థలం మచిలీపట్టణం — ప్రస్తుతం కడపలో జీవిత భీమా సంస్థలో ఉద్యోగం. గత 20 ఏళ్లుగా రచనలు చేస్తున్నారు. గతంలో మూడుసార్లు ఆంధ్ర సచిత్ర వార పత్రిక దీపావళి కథల పోటీలలో బహుమతులు పొందారు. 1978 లో వీరికి సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది.

బాలట్‌లో చివరికథగా వచ్చిన 'మనుషులు' కథా రచయిత శ్రీ పి. వి. ఆర్. శివకుమార్. మొదటి రచన 1965 లో అచ్చు అయినా 1970 తర్వాత విరివిగా రాయడం మొదలు పెట్టి ఇంత వరకు 150 కథలూ, ఆరు నవలలూ రాశారు. దాదాపు అన్ని తెలుగు వార, మాస పత్రికలలో వీరి రచనలు పడినట్లు పేర్కొన్నారు. కొన్నికథలు, 15 నాటికలు రేడియోలో ప్రసారం అయినాయి. అనేక కథలతోపాటు వీరి 'శమంత హేమంత', 'జీవన పోరాటంలో ఆశల ఆరాటం' సీరియల్స్‌గా ఆంధ్ర సచిత్ర వారపత్రిక ప్రచురించింది. ఎంతోకాలంగా వీరికి ఆంధ్ర సచిత్ర వారపత్రికలో బహుమతి అందుకోవాలనే ఆశ ఉందని, అదిప్పుడు నెరవేరటం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలియచేశారు. వృత్తిరీత్యా ఇంజనీరుగా హిందుస్తాన్ మెషీన్ టూల్స్, ఔరంగాబాదులో ఉంటున్నారు. ఉద్యోగరీత్యా గత ఏడాది జర్మనీలో ఆరునెలలు శిక్షణ పొంది వచ్చారు. స్వంత ఊరు విజయవాడ. ఆరేళ్ల క్రిందట వివాహం అయింది. ఓ పాప, బాబు సంతానం.


ఈ ఆరుగురు రచయితలకీ మా ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నాము.

దీపావళి కథలపై మేము నిర్వహించిన వ్యాస రచన పోటీలో ఏలూరుకి చెందిన శ్రీమతి జి. కుసుమకుమారి మొదటి బహుమతి రు. 250/—లు, నెల్లూరుకి చెందిన కుమారి ఎ.సి. నీరజ రెండవబహుమతి రు. 150/—లు, కాకినాడలో ఉంటున్న కుమారి 'అరుణ' మూడవ బహుమతి రు. 100/—లు గెలుపొందారు. ఈ ముగ్గురు వ్యాస రచయిత్రులకీ మా అభినందనలు. బహుమతి పొందిన మూడు వ్యాసాలనీ ఈ సంచికలోనే వేశాము.

ఎప్పటివలెనే ఈ ఏడాదికూడా సినిమా బాలట్ నిర్వహిస్తున్నాము. ఈ సంచికలో వేసిన బాలట్ పత్రాన్ని పూర్తిచేసి పంపవలసిందిగా కోరుతున్నాము. పాఠకుల సౌకర్యం కోసం 1983లో విడుదలైన తెలుగు చిత్రాల జాబితా ప్రచురించాము. పాఠకులంతా సినిమా బాలట్‌లో ఉత్సాహంగా పాల్గొని దానిని జయప్రదం చేయగలరని ఆశిస్తున్నాము. ★


శ్రీ గంగుల నరసింహారెడ్డి


శ్రీ 'విహారి'


శ్రీ పి. వి. ఆర్. శివకుమార్

నేను సంజయ్ గాంధీని కలుసుకున్నప్పుడు

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

సంజయ్ గాంధీ మారుతి ఒక మోసం ఆయన తల్లి సృష్టించిన 'గరీబీ హటావ్' నినాదంకన్నా చిన్న మోసమే కావచ్చు ఆయన తాత చెప్పిన సోషలిస్టు పద్ధతిమీద సమాజ నిర్మాణంకన్నా చిన్న మోసమే కావచ్చు— అది వేరే సంగతి కాని, రాజకీయ కుటుంబాలలో వారికి మోసాలు సహజంగానే అబ్బుతాయని పిస్తుంది

మారుతి సంస్థ ప్రయోజనం కారుల తయారీ కాదు డబ్బు చెయ్యటమే దాని లక్ష్యం అన్ని వ్యాపారాలనీ లాభం కోసమే నడుపుతారు కాని వాటికీ మారుతికీ ఒక తేడా ఉంది తక్కిన కంపెనీలు ముందు సిమెంటునో, ట్రాక్టరులనో చేసి వాటిద్వారా లాభాలు చేసుకోవటానికి ప్రయత్నిస్తాయి సంజయ్ గాంధీ ఈ పద్ధతిని తలకిందులు చెయ్యబోయాడు ముందు డబ్బులు తీసుకుని, తర్వాత కారులు తయారుచేద్దామను కున్నాడు ఇంతలో ఇతర ఆకర్షణలు తటస్థ పడ్డాయి

ఇదంతా నాకెలాగ తెలుసునంటారా ? పది సంవత్సరాల కింద నేనొక చిన్న కంపెనీని నడుపుతూ ఉండేవాడిని ప్రయివేటు కంపెనీలని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలుగా మార్చటానికి సహాయ పడటం మా కంపెనీ చేసే పనులలో ఒకటి ఇదేమీ అంత పెద్ద పనికాదు కాని చెయ్యటానికి సరదాగా ఉండేది అదీ కాకుండా, ఈ పనిచేస్తే ఏవేవో రకాల వారిని కలుసుకో టానికి వీలు ఉండేది వీళ్లలో వ్యాపారులూ, షేరులు లేదా కంపెనీలలో వాటాల బ్రోకరులూ ముఖ్యమయిన వాళ్లు ఒక కంపెనీ పబ్లిక్ లిమిటెడ్గా మారితే దేశంలోని వివిధ ప్రాంతాల వారి వద్ద డబ్బులు తీసుకుని, వాళ్లకి షేరులు ఇచ్చి, వచ్చిన ధనంతో పెట్టుబడి చేసుకోవచ్చునన్నమాట మా కంపెనీ దీనికి తోడు పడేది

అప్పటిలో మారుతి సంస్థ పబ్లిక్ లిమిటెడ్ అవుతుందన్న వదంతులు వచ్చేవి మా కంపెనీ లాంటి వాటి సహాయం తీసుకోవాలని ఆయన అనుకునేవారని చెప్పుకునేవాళ్లు సంజయ్గాంధీ, ఆయన కుటుంబ సభ్యులూ కలిసి ఒక చిన్న కంపెనీని పెట్టుకున్నారు అయితే, ఈ కంపె నీలో వాటాలు ఎక్కువ భాగం మిత్రుల పేరులతో ఉండేవి అందరూ కే కే లలిత్ నారాయణ్ మిశ్రా ఊరు బల్లవా బజార్కి చెందిన ఎవరెవరో మిత్రుల పేరులతో ఉండేవి ఈ షేరుల మొత్తం విలువ కొన్ని లక్షలకి మించి ఉండి ఉండదు సంజయ్గాంధీ పేకొద్దీ చిన్న మారుతి కారులని తయారు చెయ్యపోతున్నా రంటూ వార్తా పత్రికలలో వార్తలు పడేవి ఇలాంటి వార్తాంశాల్ని గురించి ఖుష్వంత్ సింగ్ కూడా ఒక చిన్న వ్యాసం రాశారు రాసి కారుని గురించీ, రాజకీయాలని గురించీ తమకి ఏమీ తెలీదని నిరూపించుకున్నారు సంజయ్ గాంధీ చేతిలో తగినంత ధనం ఉంటే చాలట— అయిదుకోట్లు అనుకోండి — ఆయన మారుతి సంస్థ జోరుగా పని చేస్తుందని అనే వాళ్ళు చాలా మంది

ఒక రోజు పొద్దున నా ఫోన్ మోగింది మారుతి సంస్థ డయిరెక్టరు ఒకాయన మాట లాడాడు ఆయన ఒక షేరుబ్రోకరు గుర్గావ్కి వచ్చి సంజయ్గాంధీనీ, ఆయన కార్యదర్శి "రెగే" అనే ఆయననీ కలుసుకోవాలని ఆయన చెప్పాడు గుర్గావ్ ఎక్కడ ఉందో కూడా అంత బాగా తెలీదు సరే సంజయ్గాంధీ కోసం ఫోన్మీద ప్రయత్నించాను ఎప్పుడు అడిగినా "సాబ్ ఫాక్టరీలో ఉన్నారు" అనే సమాధానమే వచ్చేది ఇక ఫోన్లు లాభం లేదనుకుని గుర్గావ్కి ప్రయాణమయ్యాను, ఒక రోజు ఉదయమే

సంజయ్గాంధీ ఫాక్టరీలోనూ లేడు ఆఫీసు లోనూ లేడు శ్రీ రెగే, ఇంకొక ఆయనా (ఆయన కంపెనీకి పర్సనెల్ మేనేజరు అని విన్నాను) కలిసి ఒక గదిలో కూర్చుని ఉన్నారు శ్రీ రెగే నాకు కొన్ని వివరాలు చెప్పి "పబ్లిక్ లిమిటెడ్ చెయ్యాలంటే ఎంతకర్చు అవుతుంది ?" అని అడిగాడు

"జనంలో ఎందరికి మీ కంపెనీలో వాటాలు తీసుకోవాలని ఉందో తెలియాలికదా ! అంతా దానిమీద ఆధారపడి ఉంటుంది " అన్నాను నేను "ముందు కొందరు విలేఖరులని పిలిచి ఫాక్టరీ చూపించండి వదంతులకన్నా ప్రత్యక్షంగా చూడటం మంచిది "

నేను మాటలాడుతూ ఉండగా సంజయ్ గాంధీ లోపలికి వచ్చాడు ఇద్దరం ఒక అరగంట సేపు చర్చలు జరిపాము ఆయనకూడా "కర్చు ఎంత అవుతుంది ?" అని ముందు అడిగాడు నేను కొన్ని లెక్కలువేసి ఒక్కొక్క దరఖాస్తుకీ రు 2 కాగలదని చెప్పాను అది ఎక్కువగా ఉందని ఆయనకి అనిపించింది రు 1 80కి చెయ్యలేరా అని అడిగాడు చెయ్యగలము, కాని మీ ఫాక్టరీ చూపించండి, అనికోరాను

"ఫాక్టరీ" ఒక పెద్ద హాలు ఇంచుమించు ఖాళీగా ఉంది రెండు 'వర్క్ బెంచిలు' ఉన్నాయి ఈ మాత్రం మామూలు "గారేజీ"లో ఎందులో నయినా ఉంటుంది ఒక మూలగా మూడు, నాలుగు కారులు కనుపించాయి వాటిలో ఒక దానిమీద మాత్రమే పని జరుగుతోంది దానికి కొత్తగా మెరిసిపోతున్న ఒక ఇంజనుని బిగిస్తు న్నారు అది కారుకి కొంచెం పెద్దదయినట్లని పించింది నాకు మేము రాగానే ఆ పని కూడా ఆగిపోయింది

"అది దిగుమతి చేసుకున్న ఇంజనేనా ?" అని నేను ప్రశ్న వేశాను

"లేదు, పూనాలో చేయించాము" అన్నాడు సంజయ్గాంధీ అక్కడ మరాఠీ మాటలాడేవాళ్లు ఎక్కువగా ఉండటం నేను అంతకు ముందే గమనించాను ఎవరో ఒకరు పూనా నుంచి తన యజమానిని సంతోషపెట్టటం కోసం ఇంజనుని తీసుకువచ్చి ఉంటాడని అనుకున్నాను

నేను సంజయ్గాంధిని మరొకసారి కలుసు కున్నాను కంపెనీకి రు 6 కోట్లు ఉన్నాయనీ, దానికి ధనం తక్కువ ఏమీ కాదని నాకుతెలిసింది జనానికి షేరులు అమ్మే పేరుతో ఈ డబ్బుని జమ చేసుకోవాలని సంజయగాంధీ అనుకుంటు న్నట్లు గ్రహించాను ఈ మధ్య రిలయన్స్ టెక్స్టయిల్స్ సంస్థ వాళ్లు ఇంచుమించు ఇలాంటి పనే చేసారు— బ్రిటన్ వద్ద 'ఐల్ ఆఫ్ మాన్' అనే ద్వీపం నుంచి చాలా నిధులు తీసుకు వచ్చి పెట్టుబడి చేశారు అయితే అప్పటిలో సంజయ్ గాంధీకి ఇలాంటి పథకం ఏమీ అందుబాటులో లేదు డబ్బంతా ఢిల్లీలోనేఉంది ఎవరయినా దానిని మార్చిపెట్టాలని సంజయ్గాంధీ సంకల్పం అంటే రిలయన్స్ సంస్థకన్నా ఆయనే ముందు ఇలాంటి పథకాలని ఊహించుకోగలిగాడన్న మాట సంజయ్గాంధీకి అన్ని విషయాలూ స్పష్టంగా అర్థం అయ్యాయి బల్లవా బజార్కి చెందిన మిత్రులు నిజంగా లేరని విన్నాను ఎవరో కొందరు ఉన్నా తమకి ఢిల్లీలో ఏదో కంపెనీలో వాటాలు ఉన్నాయని వాళ్లకి తెలీదు

ఆలోచించి చెబుత నని వచ్చేశాను కాని నిజానికి ఆలోచించేందుకు ఏముంది ? మారుతిని పబ్లిక్ లిమిటెడ్గా మార్చే పథకం రూపొంద లేదు ఆ కోట్ల రూపాయలన్నీ ఏమయ్యాయో తెలీదు నిజానికి సంజయ్గాంధీ ఈ మొత్తాన్ని గురించి నాతో నేరుగా చెప్పలేదు ఆయన మితభాషి తనకి "ధనంకాదు ముఖ్యం, కారు ఉత్పత్తి" అన్న అభిప్రాయాన్ని కలుగచేసేట్లు ప్రవర్తించాడు నేను ముందే అన్నట్లు ఇదంతా కొందరి వంశాలలో సహజంగా అబ్బే విద్య ఆయన తన పెద్దవారి వద్ద ఏమి నేర్చుకోవాలో అది బాగానే నేర్చుకున్నాడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

రచయితలకు గమనికలు

ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ, యితర
రచనలు పంపదలచుకున్నవారు
సంపాదకుడు,
ఆంధ్రసచిత్ర వారపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-520 003
అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరుమీద శీర్షికపేరు పేర్కొనడం మంచిది రచయితలు తమ పూర్తి పేరూ, చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి — హామీపత్రం జతచెయ్యాలి

★ గేయాలు తిప్పి పంపబడవు వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి ఎనిమిది వారాల గడువు అవసరం

★ కథలుగాని, యితర రచనలుగాని త్రిప్పి పంపబడాలని కోరుకునే వారు — వారి స్వంత చిరునామాగల తగినన్ని తపాలాబిళ్ల లంటించిన కవరు పెట్టడం అవసరం

★ రచనల గురించి పంపిన వెంటనేగాక ఎనిమిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయంకోసం ఎదురుచూడడం మంచిది రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కాని— తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు — రచన పేరు — అది పంపినతేదీ, వాటి గురించి పరిశీలించడం కష్టం

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి వారికి కూడా స్వంత చిరునామాగల తగినన్ని తపాలాబిళ్లలంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది

★ కార్టూన్‌లు పంపేవారుకూడా ఎనిమిది వారాలలోగా మా మీద ఉత్తరాలదాడి చెయ్యకూడదు ప్రతీ కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్‌ల కవర్లపై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది

★ రచనల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలువెంబడి జరుగుతుంది

★ రచయితలకు, కార్టూనిస్టులకు [ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'పడ్డ' వారికి తప్ప తతిమ్మా అందరికి] అవి పడ్డ "ప్రతు"లను — కాలక్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము కాపీలు టపాలో పోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు

సం॥



	అయొడెక్స్
ధాతువు (లోపలి పొర) దెబ్బతినడం	✓
నొప్పులు	✓
బెణకడం	✓
కీళ్ళు పట్టడం	✓
కండరాలు పట్టడం	✓
నడుం నొప్పి	✓



ప్రేమపాశం

— పింగళ పద్మ



విజయ బాల్కనీలో నిలబడి రోడ్డు మీదికి చూస్తోంది

ఆమె ముఖంలో ఆనందమో, నిరాశో తెలియని భావం నీడలా తారట్లాడుతోంది

చక్కటి సాయం సమయం రివ్వున వీచే చల్లటిగాలికి చెట్లు హాయిగా తలలూపుతున్నాయి వాతావరణం ఆహ్లాదంగా ఉంది

రోడ్డుమీద ఆ కాలనీలో పిల్లలందరూ చేరి, రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు కొందరు ఫుట్‌బాల్ ఆడుతున్నారు కొంచెం పెద్దపిల్లలు చెక్కముక్కల్ని తెచ్చి వికెట్స్‌గా పెట్టి క్రికెట్ ఆడుకుంటే, మరీ చిన్న పిల్లలు దూరంగా కూర్చొని కుతూహలంగా గమనిస్తున్నారు

వాళ్లందరినీ చూస్తూనే విజయ ఆలోచన ల్లోకి జారిపోయింది

ఈ ప్రపంచంలో పిల్లల్ని ఎంతో గారాబంగా పెంచే వాళ్లని ఎందరినో చూసింది కానీ అమ్మ లాంటి వాళ్లు కనీసం కోటికి ఒక్కరు కూడా ఉండరేమో !

ఆవిడ చూపే ఆ పిచ్చి ప్రేమకు సంతోషించాలో, ఏడవాలో అర్థం కాదు !

'నువ్వింకా చిన్నపిల్లవి పిల్లాడిని పెంచటం నీకేం వస్తుంది, నీ ముఖం !' అంటూ తనని గడ్డిపోచలా తీసిపారేసింది

తను నిజంగా చిన్నపిల్లే కావచ్చు తనకి త్వరగా పెళ్లయింది పెళ్లయిన ఏడాదికే పుట్టాడు, తన చిన్నారి దిలీపు !

వాడిని చూసి తనకంటే తన తల్లే ఎక్కువ సంబరపడింది వాడు తవ దగ్గర పాలు తాగే సమయంలో తప్ప మళ్లీ తనని ముట్టుకోనిచ్చేది కాదు

వాడికి నీళ్లుపోసి, బట్టలు వేయడం దగ్గర నుండీ, వాడి అన్నిపనులూ అమ్మే చూసేది

వాడి పట్ల అమ్మ చూపే ప్రేమ చూస్తూంటే తన హృదయం ద్రవించిపోయేది అమ్మకి తను ఒక్కగానొక్కకూతురు ఎన్నిసార్లో గర్భం పోయి చివరికి తను దక్కిందట తన తర్వాత అల్సర్ లేచి, అమ్మకి గర్భ సంచీ తీసి వేయవలసి వచ్చిందట దాంతో అమ్మకి పిల్లల మీది ఆశ తీరనేలేదు

అమ్మకి తనంటేనే అపురూపం అలాంటిది మనుమడి మీద వెర్రి మమకారం చూపిస్తే అందులో ఆశ్చర్యం ఏముంది ? గుండ్రటి కళ్లు, ఉంగరాల జుట్టుతో 'అమూల్ బేబీ'లా ఉండే బంగారు తండ్రిని ఎలా వదిలి ఉండగలదు ?

బాబు పుట్టి ఆరునెలలు గడిచిపోయాయి

కలకత్తా నుండి మధూ 'ఇంక వచ్చేయండి' అంటూ ఉత్తరాలు గుప్పించసాగాడు

చూస్తూ చూస్తూ అమ్మ నుండి బాబుని ఎలా విడదీసి తీసుకుపోవాలా అని తను మథనపడ సాగింది

అనుకున్నంతా అయింది

ఒకరోజు అమ్మ అంది—

'మీ ఆయన రమ్మని వ్రాశారుగా నువ్వు వెళ్ళు బాబుని నేను చూసుకుంటా'

ఆ మాటకి తన గుండెలో బాయి పడ్డట్లయింది

'విజ్జీ ! పెళ్ళయి ఏడాదేగా అయింది ఇద్దరూ చిలకా గోరింకల్లాగా సరదాగా తిరగండి మధ్యలో వీడెందుకు !?''

తను గదిలోకి వెళ్ళి నిశ్శబ్దంగా ఏడ్చింది తన బాబు—తన చిన్నారి దిలీపుని చూడకుండా తను ఎలా ఉండగలదు ?

వాడిమీద చేయి వేస్తేనే గానీ తనకు నిద్ర పట్టదు వాడి ఆట పాటలు చూడకపోతే తనకి క్షణం తోచదు వాడి ముద్దు ముఖంలోకే తదేకంగా చూస్తూ రోజులు నిముషాలుగా గడిపేయగలదు

అమ్మ దృష్టికి తనింకా చిన్న పిల్లలాగానే కన్పిస్తుందేమో కానీ ఈనాడు తనుకూడా ఒక తల్లే

అమ్మ బాబు మీద పెంచుకొన్న విపరీత మైన అనురాగాన్ని తను కాదనలేదు అలా అని బాబుమీది ప్రేమని చంపుకొని తను ఎడబాటుని సహించనూలేదు

ఎలా అయితేనేం, చివరికి అమ్మే గెలిచింది

నవమాసాలూ మోసి బాబునీ, బాబుతో బాటు తను పెంచుకున్న కలలూ, మధురమైన ఆశలతో సహా అన్నింటినీ అమ్మ చేతిలో పెట్టేసి తను వట్టి చేతులతోనే కలకత్తా చేరుకుంది

రైలు దిగగానే తనను చూసి నవ్వుతూ అన్నాడు మధూ ''మీ అమ్మ బాబుని పంపదని నేనెప్పుడో ఊహించాను ''

తను నవ్వలేదు నిరాశగా ముఖం ప్రక్కకి తిప్పుకుంది

ఆ రాత్రి తనకి ఎందుకో బాగా ఏడుపు వచ్చింది మధూ గుండెలలో తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది

''పిచ్చిదానా ! మీ అమ్మ పెద్దావిడ పిల్లల మీద మమకారం ఇంకా చావలేదు కొన్ని రోజులుపోతే ఆవిడే వాడితో విసిగిపోయి నీ దగ్గరకి పంపించేస్తుంది ''

మధూ తనని ఓదారుస్తూ అన్నాడు

ఆ రాత్రే కాదు ఎన్నో రాత్రులు తనకి నిద్రపట్టేది కాదు చేతులూ, కాళ్ళూ ముడుచుకొని తన గుండెల్లో ఒదిగిపోయి వెచ్చగా నిద్రించవలసిన తన బాబు లేని ఖాళీ స్థలం తనను వెక్కిరిస్తూ ఉండేది

ఒకరోజు ప్రక్క ఇంటి ఆవిడ వచ్చింది, 'మీ బాబేడీ' అంటూ

తను చెప్పింది

'ఎంత అదృష్టవంతులండీ మీరు ! మా ఇద్దరు పిల్లలూ నన్ను ఒకటే సతాయిస్తారు మా అమ్మగానీ, అత్తగారుగానీ కనీసం ఒక్క నెల రోజులు ఉంచుకుంటాం పంపమని పొరబాటున కూడా అనరనుకోండి !' అందావిడ విజయ అదృష్టానికి అబ్బురపడుతూ

ఆవిడకి మొదట పాప ఆ తర్వాత దిలీపు వయస్సువాడే బాబు

బాబుని చూడగానే విజయకి దిలీపు గుర్తుకువచ్చాడు తన దిలీపు కూడా ఈపాటికి ప్రాకుతూ ఉంటాడు బహుశా

బాబుని ఆత్రంగా ఎత్తుకొని గుండెలకు హత్తుకుంది విజయ బాబు మెత్తగా, దూదిలాగా ఉన్నాడు బూరెల్లా ఉన్న బుగ్గల్ని గట్టిగా ముద్దుపెట్టుకుంది

'ఈ వెధవ మరీ ఏడిపిస్తాడనుకోండి వీడితో నాకు అస్సలు పనికాదు కనీసం స్నానం చేయడానికి కూడా కుదరదు ' అంది ఆవిడ తన బాబుని మురిపెంగా చూసుకుంటూ

'మీరు పని చేసుకునే సమయంలో బాబుని నాకిచ్చేయండి నేను చూసుకుంటాను పని కాగానే తీసుకువెళ్ళండి' అంది విజయ

'ఎందుకండీ, మీకుమాత్రం ఇంట్లో పన్లుండవా ?' అంది ఆవిడ మొహమాటంగా

'ఫరవాలేదండీ బాబుని నేను చూసుకుంటాను ' అంది విజయ ఆశగా చూస్తూ

ప్రక్కింటావిడ విజయ ముఖం చూస్తూ కాదనలేక, సరేనంది

అది మొదలు విజయకి ప్రక్కింటి బాబుతో కాలక్షేపం మొదలయింది

పెందలాడే లేచి పనులన్నీ పూర్తిచేసుకొని, తనే ప్రక్కవాళ్ళ యింటికి వెళ్ళి బాబుని తెచ్చుకునేది

వాడికి ఆకలేస్తే పాలు తనే పట్టేది బాబు చాలా చలాకీగా ఉంటాడు

చక్కిలిగింతలు పెడితే నోరంతా తెరిచి పెద్దగా శబ్దం చేస్తూ నవ్వేవాడు పాకడం బాగా వచ్చేసింది

దూరంగా బొమ్మలు పెట్టేది విజయ వాడు వాటికోసం పాకుతూ దగ్గరికి రాగానే, బొమ్మలు తీసి ఇంకా దూరంగా పెట్టేసేది అలా వాడిని చాలాసేపు ఏడిపించి, చివరికి బొమ్మలిచ్చి, వాడు ఆడుకుంటూంటే చూసి ఆనందించేది

సాయంత్రం ఆఫీసు నుండి మధూ ఇంటికి రాగానే ఆ రోజు బాబు ఆటపాటల గురించి పరవశంగా చెప్పేది విజయ

'బాగానే ఉంది వీడితో నీకు కాలక్షేపం' అంటూ నవ్వేవాడు మధూ

అలా కొన్ని రోజులు బాగానే గడిచాయి తన పిల్లాడు ఎంతసేపూ ప్రక్కవాళ్ళ ఇంట్లో గడపటం ఇష్టం లేదో ఏమో, ఒకరోజు ప్రక్క ఇంటావిడ, ''ఎంతసేపూ బాబుని వాళ్ళ ఇంట్లో ఉంచుతావేం, వాళ్ళకి మాత్రం వేరే పనిలేదా అని మా వారు కేకలేస్తున్నారండీ'' అంది ముఖం గంటు పెట్టుకొని

'అయ్యో ! ఫరవాలేదండీ !?' అంది విజయ మనస్సు కష్టపెట్టుకుంటూ

ఒకసారి బాబుకి విపరీతమైన జ్వరం, విరోచనాలూ, వాంతులూ మొదలయ్యాయి విజయ బాబుని చూడడానికి వెళితే, 'మీ యింట్లో మీరేం పెట్టారో ఏమోనండీ, బాబుకి ఒకటే విరోచనాలు దేవుడి దయవల్ల వీడి రోగం తగ్గితే, బాబుని ఎవరిళ్ళకీ పొరబాటున కూడా పంపను' అంది ప్రక్కింటావిడ ఖండితంగా

అనుకోని అపవాదుకి విజయ ముఖం ఎఱ్ఱగా కందిపోయింది, కళ్ళలో గిఱ్ఱున నీళ్ళు తిరిగాయి

'మీ బాబుకి నేనేమీ పెట్టలేదండీ నేను కూడా ఒక పిల్లవాడికి తల్లినే ఆ సంగతి మర్చిపోకండి' అంటూ విసురుగా బయటికి వచ్చేసింది

'ఆ– మంచి తల్లివే ఏనాడైనా పిల్లాడిని పెంచితేకదా తెలిసేది' వెనుకనుండి ఆవిడ విసురు విజయ చెవిని తాకనే తాకింది

విజయ ఇంట్లోకి వచ్చి, మంచంపై వాలిపోయి, వెక్కి వెక్కి ఏడవసాగింది

తన దిలీపు తన దగ్గరే ఉంటే, అసలు ఇటువంటి బాధే ఉండేది కాదు గదా తనకి ?

ఈ ప్రపంచంలో ఎంతమంది కనటం లేదు? తనలాంటి చిక్కు ఎవరికైనా వస్తుందా?


అందరు తల్లులకీ బిడ్డలమీద ప్రేమ ఉంటుంది కూతురి పొత్తిళ్ళలోని బిడ్డలను లాక్కొని, కూతురి కడుపు మీద తన్నడం ఎటువంటి మమకారం ?


''అమ్మా, అమ్మా ! ప్లీజ్ ! నా బాబుని నాకు ఇచ్చెయ్యవూ ?'' విజయ మనస్సు ఆక్రోశించసాగింది

అమ్మకి దిలీపంటే ఎంత ప్రేమో, తనకీ అమ్మంటే అంతే ప్రేమ తనని ఎంత గారాబంగా పెంచింది ఒక్కగానొక్క కూతురని తనని పువ్వులలో పెట్టి పెంచింది ఆ అమ్మ మనసు తనకు తెలుసు అటువంటి అమ్మ మనస్సు నొప్పించి, తన బాబుని తను ఎలా తెచ్చుకుంటుంది ?

అలా అని, వాడు లేకుండా బ్రతకడం తనకీ దుర్భరమే !

సాయంత్రమయేసరికి, ఇంకా నడకకూడా సరిగ్గా రాని దిలీపు వయస్సు పిల్లల్ని వాళ్ళ తల్లిదండ్రులు రెండు వైపులా చేయి పట్టుకొని





నడిపిస్తూ, నడక నేర్పించడానికి ప్రయత్నిస్తూంటే, వాళ్ళని చూస్తే తన హృదయం ఎవరో పిండేసినట్లుగా అవుతుంది.

విజయ అలా మంచంమీద పడుకొని ఎంత సేపు ఏడ్చిందో ఆమెకే తెలియదు.

ఎవరో తలుపు తట్టిన శబ్దం అయి లేచి, తలుపు తీసింది. ఎదురుగా, మధూ !

'అరె ! అప్పుడే సాయంత్రం అయి పోయిందా?' అనుకుంది విజయ. విజయ వాలకం చూసిన మధూ కలవరపడ్డాడు.

'విజ్జీ ! ఏమయింది ? అలా ఉన్నావేం ?' అంటూ కంగారుగా అడిగాడు. విజయ ఏడుస్తూ ప్రొద్దున్న జరిగిన సంఘటన చెప్పింది.

''ఇంకొకరి పిల్లలమీద ఆశలు పెంచుకోవటం తప్పు విజయా, ఇలా జరుగుతుందని నేనెప్పుడో ఊహించాను.''

మధూ విజయని ఓదారుస్తూ అన్నాడు.

''ఇలా చూడు. మీ అమ్మ ఉత్తరం వ్రాసింది. దిలీపు ఫొటోలు పంపింది చూడు.''

మధూ ఒక కవరు తీసి చూపిస్తూ అన్నాడు.

విజయ ఆత్రంగా కవరు విప్పి చూసింది. తన దిలీపు — అబ్బ ! ఎంత ఆరోగ్యంగా, అందంగా ఉన్నాడో! రకరకాల పోజుల్లో ఫొటోలు తీయించింది అమ్మ.

ఒంటిమీద బట్టలులేకుండా బకేటులో నిలబడి స్నానం చేస్తున్నట్లు, బొమ్మలతో ఆడుకుంటూ, వాళ్ళ అమ్మమ్మని ముద్దుపెట్టుకుంటూ, అమ్మ గుర్రంలా వంగొని ఉంటే ఆవిడమీద కూర్చొని స్వారీ చేస్తున్నట్లూ —

రకరకాల పోజుల్లో — ముఖం, సంతోషం, ఆరోగ్యం అన్నీ బాబు ముఖంలో కన్పిస్తోంటే, పిల్లలు పంచియిచ్చే ఆనందం, ఆత్మతృప్తి అన్నీ ఆస్వాదిస్తున్న సంతోషం అమ్మ ముఖంలో కన్పిస్తోంది !

ఫొటోలతోబాటుగా, తల్లి వ్రాసిన ఉత్తరం చూసింది. ఆ ఉత్తరంలో అంతా దిలీపు అల్లరి గురించే. చివరిలో — 'నీ పిల్లాడి అల్లరితో నేను

ప్రేమపాశం

చిక్కి సగం అయ్యానని మీ నాన్న అంటున్నారు. వీడిని పెంచడం నా తరం కాదమ్మా' అంటూ హాస్యంగా వ్రాసింది.

అది చదివిన విజయ కళ్ళు మెరిసాయి. బహుశా వాడి అల్లరి బాధ భరించలేక వాడిని దగ్గరకి పంపించేస్తుందేమో !

ఎంతసేపూ ఆ ఫొటోలు చూసుకుంటూనే గడిపేది విజయ, ఆ ఫొటోలను చూస్తుంటే వాడిని చూస్తున్నట్లే అన్పించేది.

విజయ వాలకం చూస్తుంటే మధూకి చాలా బాధగా అన్పించసాగింది. తల్లినుండి బిడ్డను వేరుచేసిన విజయతల్లి అతనికి చాలా దురాశాపరురాలిగా కన్పించింది. నిజానికి అతను కూడా తన కొడుకుని చూసి చాలా కాలమయింది. తన కొడుకు ఇల్లంతా సందడిగా తిరుగుతూ ఆడుతూ పాడుతూ ఉంటే చూడాలని అతనికి మరీ మరీ అన్పించసాగింది.

ఒకరోజు సాయంత్రం ఆఫీసునుండి రాగానే అన్నాడు మధూ — ''విజ్జీ ! నా బట్టలు

సంక్రాంతిశోభ

పసిడి పంటల శోభ పాడిపశువుల శోభ
కలవారి లోగిళ్ళ కలిమి శోభ
రంగవల్లుల శోభ ప్రాంగణమ్ముల శోభ
గొబ్బి పూజలు ముద్దుగుమ్మ శోభ

గంగిరెద్దుల శోభ గ్రామవీధుల శోభ
మేలు కొలుపుపాట మిగుల శోభ
రచ్చబండల శోభ రాజకీయపు శోభ
కోడి పందెములాటకూడ శోభ

మంచు తెరలోన పూబంతి మించు శోభ
పడుచుగుండెల కోర్కెలు పండు శోభ
మనిషి ప్రతికంటినను భోగిమంట శోభ
కాంతి వెల్లువై వచ్చె సంక్రాంతి శోభ

— తమ్మిశెట్టి రామారావు

బ్రీఫ్ కేస్ లో సర్దు. నేను ఆఫీసు పనిమీద విజయవాడ వెళ్తున్నాను.''

'విజయవాడ' అనేసరికి విజయ కళ్ళు సంతోషంతో మెరిసాయి.

హటాత్తుగా వచ్చిన అల్లుడిని చూసి విజయ తల్లి ఆశ్చర్యపోయింది.

''ఏమిటిలా — ఉత్తరం ప్రత్తం లేకుండా ఊడిపడ్డారు.' అంది నవ్వుతూ. అక్కడ గడిపిన రెండురోజులూ బాబుని బాగా గమనించాడు మధూ. బాబు వాళ్ళ అమ్మమ్మకి బాగా చేరువ అయ్యాడు. ఆవిడ ఒక్కక్షణం కన్పించకపోతే ఇల్లంతా తిరుగుతూ వెతుక్కుంటాడు. ఎప్పుడూ ''అమ్మమ్మా, అమ్మమ్మా'' అంటూ ఆవిడ కొంగు పుచ్చుకు తిరుగుతూ ఉంటాడు.

''వీడితో నాకు ఒక్కక్షణం ఖాళీ ఉండదు'' అంది ఆవిడ మధూతో నవ్వుతూ. అలా అంటూంటే ఆవిడ ముఖం సంతోషంతో వెలిగిపోవటం గమనించాడు మధూ.

''నేను తప్పు చేయడం లేదు గదా'' అని ఎంతో ఆలోచించాడు. అతని మనస్సులో కొడుకు కోసం తపిస్తున్న విజయ ముఖం దీనంగా కన్పించింది.

చివరికి ధైర్యం చేసి అడిగేశాడు మధూ —

'నేను బాబుని కలకత్తా తీసుకు వెళతానండీ' అని.

ఆ మాట వినగానే ఆవిడ ముఖం మాడిపోయింది.

''ఇప్పటికే వాడిని చాలా కాలం ఉంచేశాను. విజయ బాబుకోసం కలవరిస్తోంది'' అన్నాడు మధూ.

అల్లుడిని ఎదిరించలేకపోయింది ఆవిడ. పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకోవడం చాలా కష్టంగా ఉంది ఆవిడకి.

''ఏరా, బాబూ ! అమ్మదగ్గరికి వెళ్దాం, వస్తావా ?'' మధూ బాబుని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

''ఓ'' అన్నాడు బాబు తల గుండ్రంగా తిప్పుతూ. వాడికి అసలు క్రొత్త తెలీదు. ఈ రెండు రోజులలోనే తండ్రికి అలవాటయ్యాడు.

విజయ తల్లి బాబుని గదిలోకి తీసుకుపోయి, వాటుగా ఏడవటం గమనించాడు మధూ

బాబు పట్ల ఆవిడ ప్రేమకి మధూ హృదయం ద్రవించిపోయింది ఈ వయస్సులో ఆవిడని అనవసరంగా ఏడ్పిస్తున్నానా అన్పించింది అతనికి

మళ్ళీ – బాబుకోసం విజయపడే తపన గుర్తుకు వచ్చింది మధూ బాబుని తీసుకుని ఊరికి వెళుతూంటే, విజయ తల్లి హృదయం దుఃఖభారంతో బరువెక్కింది ఆవిడ బాబుని ఎన్నిసార్లు ముద్దుపెట్టుకుందో లెఖ్కలేదు వాడిని గుండెలకు హత్తుకొని ఏడ్చింది

ఆవిడ దుఃఖాన్ని చూసిన మధూ గుండెను రాయి చేసుకున్నాడు

రైలు ప్రయాణం బాబుకి బాగా నచ్చింది రైలు కిటికీలో నుండి బయట వేగంగా కదిలే చెట్లూ, కొండలూ చూసి సంతోషంతో గంతలు వేశాడు

బాబుకి మాటలు బాగానే వస్తున్నాయి వాడి ముద్దు మాటలు వింటూంటే మధూకి చాలా ముచ్చటగా అన్పించాయి

మధూ చేతిలో బాబుని చూసిన విజయ సంతోషానికి హద్దులు లేవు వాడిని ఎత్తుకొని వాడి ముఖం అంతా ముద్దులతో ముంచెత్తింది బాబు మొదటిసారిగా ఇంట్లో అడుగుపెట్టాడు

"అమ్మయ్య ! ఇన్నాళ్టికి బాబు ఇంటికి వచ్చేశాడు" మధూ హాయిగా నిట్టూర్చాడు

బాబు కాసేపు బాగానే ఆడుకున్నాడు కాస్సేపటికి వాడికి గుర్తుకు వచ్చింది ఇది ఇంతకు ముందు తను ఉన్న ఇల్లు కాదని

"అమ్మా, అమ్మమ్మ ఏదీ ?" అంటూ ఏడవటం మొదలు పెట్టాడు

"ఇది మా ఇల్లు కాదు అమ్మమ్మ ఇంటికి పోతా" అంటూ నేలమీద పడి దొర్లుతూ ఏడవసాగాడు బాబు

వాడిని ఓదార్చేసరికి తాతలు దిగివచ్చారు

రెండు రోజులు గడిచాయి బాబు అప్పుడప్పుడూ 'అమ్మమ్మ, అమ్మమ్మ' అని అడుగుతూనే ఉన్నాడు విజయ వాడిని ఏమారుస్తూ కథలూ, కబుర్లూ చెప్పేది సాయంత్రం అయేసరికి వాడిని బయటికి షికారుకి తీసుకుపోయి రకరకాల బట్టలూ, బొమ్మలూ, బిస్కెట్లూ కొనిచ్చారు విజయ, మధూ

తరువాత రెండు రోజులు బాబు పైకి బాగున్నట్లే కన్పించాడు విజయా, మధూ వాడిని ఎంతో అపురూపంగా చూసుకుంటున్నారు 'ఆటల్లో పడ్డాడు ఇంక ఫరవా లేదు' అని వాళ్ళు అనుకుంటూ ఉండగానే, ఐదోరోజు బాబుకి ఒళ్ళు వెచ్చబడింది

విజయా, మధూ కంగారు పడుతూ డాక్టరుకి చూపించారు 'మామూలు జ్వరమే

'గోవు' ఎందుకు పూజనీయమైనది?



భారత సంస్కృతిలో గోవు స్థానము కడు పూజ్యమైనది గోవుని చాలమంది తల్లితో పోల్చి 'గోమాత' అంటారు కారణం గోవు వలన మానవుడు అనేక లాభాలు పొందుతున్నాడు

గోమయంతో అలికిన లేక కళ్ళాపు చల్లిన ప్రదేశాల్లో పాము, తేలు లాంటి విషజంతువులు రావు ఆవుపేడలో అతి సూక్ష్మ రూపంలో రేడియం ఉంటుంది అందువలన విషజీవులు ఆవుపేడ వాసనకు రావు యజ్ఞయాగాది క్రతువులలో 'శుద్ధి' ప్రక్రియ గోమయంతో ప్రారంభమౌతుంది

గోమూత్రం క్రిమి సంహారిణి, ఇళ్ళల్లో చల్లినందువలన అంటువ్యాధులు రావు వేప ఆకు, పసుపు మెత్తగా నూరి గోమూత్రంలో కలిపి శరీరానికి పట్టించి స్నానం చేస్తే గజ్జి, దురద లాంటి చర్మవ్యాధులు ఇట్టే నయమైపోతాయి గోమూత్రంతో కళ్ళు కడుగుకుంటే అనేక రకాలైన కంటి జబ్బులు నయమౌతాయి 'కండ్ల కలక' లాంటి జబ్బులు అసలు రావు

గోక్షీరం రక్తవృద్ధి నిస్తుంది అనేక వ్యాధులకు మందు గోమూత్రం, గోక్షీరం కలిపి త్రాగితే క్షయ మున్నగు దీర్ఘకాలిక జబ్బులు నయమౌతాయి 'కఫము' తెగిపోతుంది

ప్రాయశ్చిత్తమునకు 'పంచగవ్య' సేవనము ప్రథమ ప్రక్రియ కూడ!

ఇన్ని ఉపయోగాలు కల 'జీవి' కనుకనే ఆవుని భారతీయులు చాల పవిత్రంగ చూస్తారు 'వాల్మీకి' యుద్ధకాండలో రావణునిచే ''గోవులు సర్వ భాగ్యాలకు నిలయాలు'' అని పలికిస్తాడు—

విద్యతే గోషు సంపన్నం,
విద్యతే బ్రాహ్మణే దమః ।

వేదవ్యాసుడు అనేక పురాణాల్లో గో మహాత్మ్యమును వివరిస్తాడు శుభప్రద జీవనము కొఱకై నిత్యం 'గో ప్రదక్షిణ' చేయాలని మహాభారతములో అనుశాసనిక పర్వములో, దాన ధర్మ పర్వమునందు బృహస్పతి దేవేంద్రునకుపదేశిస్తాడు—

మా తర స్సర్వ భూతానాం
గావ స్సర్వ సుఖప్రదాః ।
వృద్ధి మా కాంక్షతా నిత్యం
గావ కార్యాః ప్రదక్షిణాః ॥

అంతే కాదు, 'గో పూజ' చేసిన వారికి 'శతక్రతువులు' చేసిన పుణ్యఫలం లభిస్తుందంటాడు —

ఏకే నైవచ భక్తేన యః క్రీత్వా గాం
ప్రయచ్ఛతి
యావన్తి తస్యా రోమాణి సంభవంతి
శతక్రతో
తావత్ ప్రదానాత్ నగనాం ఫల మాప్నోతి
శాశ్వతీవ్ః॥

ఫొటో, వ్యాసం

—కేప్టెన్ షేక్ మౌలాలీ

వాతావరణం మార్పువల్ల వచ్చింది' అన్నాడు డాక్టరు

తర్వాతి రోజుకి జ్వరం బాగా పెరిగింది అంత జ్వరంలో కూడా బాబు 'అమ్మమ్మ, అమ్మమ్మ' అని కలవరించసాగాడు

వారం రోజులయినా జ్వరం తగ్గకపోయేసరికి విజయ భయపడి పోయింది ఈ వారం రోజులలో బాబు చిక్కి శల్యమయ్యాడు

విపరీతమైన జ్వరంతో ఒళ్ళుతెలియకుండా పడి ఉన్న బాబుని చూస్తే విజయకి దుఃఖం ఆగలేదు

ఒకరోజు డాక్టరు 'బాబు కలవరిస్తున్నాడేమిటి? ఎవరికోసమైనా బెంగపెట్టుకున్నాడా? వారిని పిలిపించండి' అన్నాడు

ప్రేమపాశం

గబగబా చొక్కా వేసుకుని వెళ్తున్న మధూని ఆపింది విజయ 'ఎక్కడికి వెళ్తున్నారు' అంటూ

'మీ అమ్మని రమ్మని ఫోన్ చేస్తా' అన్నాడు మధు

'ఒద్దు మనమే బాబుని తీసుకు వెళదాం' అంది విజయ

'విజయా' ఆశ్చర్యంగా చూశాడు మధూ

'అవునండీ వాడికి అమ్మ దగ్గరే బాగుంది అక్కడ ఎంత ఆరోగ్యంగా ఉండేవాడో! వాడిని అమ్మ దగ్గరే ఉంచుదామండీ వాడు సుఖంగా ఉంటే నా కంతే చాలు'

అప్పటిదాకా ఆపుకున్న విజయ మధూ గుండెలమీద వాలి భోరుమని ఏడవసాగింది

'అయితే త్వరగా బట్టలు సర్దు! ఈ కోరమండల్‌ని ఎలా అయినా అందుకోవాలి' అన్నాడు మధూ

ఇద్దరూ గబగబా ప్రయాణానికి సిద్ధమయ్యారు

ఇంతలో 'టెలిగ్రాం' అంటూ వచ్చాడు పోస్ట్‌మాన్

'మదర్ సీరియస్ స్టార్ట్ యిమ్మీడియట్లీ' అన్న టెలిగ్రాం చూసుకొని, 'ఏమండీ, మనం పాపం చేశామండీ, వాళ్ళిద్దరినీ విడదీసి' అంటూ ఏడుస్తున్న విజయని చెయ్యి పట్టుకొని, బాబుని భుజంమీద వేసుకొని రైల్వేస్టేషన్ వైపు దారి తీశాడు మధూ

బ్రాహ్మణుని పతనము

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు

ఏమో ఎవ్వరెఱుగుదురు ఎప్పుడు పుట్టి పెరిగి అంతటి పెద్దవాడయ్యెనో? ఎంత కాలము నుండి యచ్చట నివాసముండెనో? చరిత్రకు కొంత ప్రాజ్ఞత వచ్చునాటికే ఆయుష్మంతుడయిన ఆర్య కుమారుడు భారత భూమిని పచ్చని పైరు చేల నడుమ, వనలక్ష్మి అందాలు దిద్దుకొను సాంద్రాటవీ సీమల మధ్య ఆశ్రమ పదములు నిర్మించుకొని పర్ణ కుటీరములందు కర్మ పరతంత్రుడయి విరాజిల్లెను ముందగ్నిహోత్రముతో, పార్శ్వములయం దధ్యయన పరాయణమయిన ఛాత్రబృందముతో వేద బుక్కులను వల్లె వేయుచు, నెడనెడ సామగానము నాలపించుచు, తాను త్రొక్కినంతమేర భూతలమును కర్మ క్షేత్రముగను, ఆజన్మాంతమును దన భౌతిక దేహమును కర్మనిబద్ధముగను గావించి తన చూపు ప్రాకినంత లెక్క తానే పెద్దనని గడ్డము సవరించుకొనుచు దర్పముతో ప్రవర్తించిన కర్మ వీరుడతడు జగత్తింకను నిద్రాపరవశమయి యుండగనే తొలుదొలుత మేలుకాంచి తెలివి తెచ్చుకొని పెద్దఱికము వహించిన ప్రోడయతడు ఎవ్వరెఱుగుదురు? ఎప్పుడు పుట్టి పెరిగి యంతటి పెద్దవాడయ్యెనో, ఎంత కాలమున నుండి యచ్చట నివాసముండెనో?


ద్యావా పృథ్వులకు, మిత్రా వరుణులకు, వాయ్వాకాశములకు తెలియును అతని పుట్టు పూర్వోత్తరములు కొంతవఱకు, శైశవమున నుండి యా మహాశక్తుల నిశ్శ్వాసమే యాతనిని లాలించి పాలించినది ఆ భారత కుమారుడు కన్ను తెఱచునప్పటికే యాప్రాకృతశక్తులు నిండు స్ఫూర్తితో గోచరించి వెలుపు వెలుగులతో సంకులమయిన యాతని నిరీక్షణమున అప్రాకృత ములయి దివ్యములైనవి వెంటనే యా స్నిగ్ధ హృదయునికి విశ్వమంతయు అవ్యక్త దివ్య నాదాంచితమయిన శబ్దబ్రహ్మమై మంత్రమై వేదమై శ్రవణగోచరమయినది ఇట్లు సాంఘిక వ్యవస్థ చక్కబడకపూర్వమే, రాజకీయ మర్యాద దిద్దుబాటు కాకపూర్వమే బ్రహ్మవర్త మహాక్షేత్ర మున భారతీయుడు పౌరుషమును నమ్మి కృషి చేసి, పుణ్య తరంగిణులయందు క్రుంకులిడి, దివ్యమూర్తుల కర్మ్య ప్రదానముల నొసంగి, గృహస్థుయి యజ్ఞవేదిను నిర్మించి నిరతాగ్ని హోత్రియై తాపసియై మంత్రద్రష్టయై పరిఢవిల్లినాడు దివ్యలోకమునకు దారిచూపు నాయకుడై, తనయెడల దేవతలను ప్రసన్నులను జేసి, తన యభ్యుదయమునకు వారి యాశీస్సులను గొనిరాగల కార్యచతురుడై తుదకు తనకును దేవతలకును నడుమ రాయబారములను జరపు దేవదూతయై అగ్ని యాతనికి బోరాని చుట్టమయ్యెను దేవతలను ప్రసన్నులను గావించుకొనుటకు ఆతనికి క్రతువు నిత్యవిహిత కర్మమయినది సంఘము పెరిగి సుస్థితి రక్షణము లావశ్యకములయి సాంఘిక, రాజకీయ వ్యవస్థలేర్పాటయినవి దేవతా ప్రసన్నత సాంఘికుల కెల్లకార్యములందు తప్పనిసరియై తన్నిమిత్తము క్రతు వావశ్యకము కాగా తత్కార్యదీక్షాపర తంత్రులయిన బ్రాహ్మణ్యులు పురోహితులై సంఘ శరీరమున ప్రాధాన్యము వహించిరి సత్యము శమము, దమము, దానము, ధర్మము, త్యాగము మొదలగు కల్యాణగుణములకునిదానమయి బ్రాహ్మణుడు పూజ్యత గడించెను అభ్యుదయమును, శ్రేయస్సును కాంక్షించు సాంఘికుడు తలపెట్టు ప్రతి స్వల్ప విషయమునకు కాలక్రమమున అగ్నికార్య మనివార్యమయి, క్రతుసంఖ్యయు, దానితోపాటు కర్మకాండమునుకొండంతలుగ పెరిగిపోయి సంఘ పురోహితుడయిన బ్రాహ్మణుని కెక్కడలేని యాధిక్యమును వచ్చినది తన మంత్రశక్తి వలనను, క్రతుకర్మాదికమునలనను దేవతలను వశముకావించుకొన్న బ్రాహ్మణుడు సాంఘికుల దృష్టిలో భూదేవతయైనాడు భూదేవతను పోషించుటయు, యజ్ఞయాగాది వైదికకర్మల యందు భూరిసంభావనలచేతను, గోదానాదికములచేతను వారిని సంప్రీతులంజేయుటయు రాజన్యాది బ్రాహ్మణేతర సాంఘికుల విధికృత్యమయ్యెను

కర్మవలన నుత్తమగతులు కలుగును కర్మవలన జీవాత్మ జన్మాంతరములయం దుత్తరోత్తర ముత్కృష్ట జన్మమెత్తుచు నుత్తమపదమును బొందుచుండును జీవికి తరణోపాయము కర్మతక్క వేఱులేదు తమకు నియతములైన కర్మల నాచరించు, వర్ణాశ్రమోచిత ధర్మములను బరిపాలించుచుండినచో ఆయా వర్ణముల వారుత్తమ లోకములను బొందగలరు వర్ణాశ్రమ ధర్మ విరుద్ధముగ ప్రవర్తించినవాడు పతితుడు, నింద్యుడు

అగ్రవర్ణములయం దిట్టి యభిప్రాయములు బలిసి కర్మకాండము ముదిరినది కర్మకాండమున గలుగుచున్న మార్పులతో క్రొత్త క్రొత్త యాచారములును, సంప్రదాయములను వాడుకలోనికి వచ్చినవి వచ్చిన ప్రతి సంప్రదాయమును, ఆచారమును క్రొత్త క్రొత్త మంత్ర తంత్రములాదుకొని, సమర్థించి, బలపఱుచుచువచ్చినవి యజ్ఞయాగాదుల సందర్భమున క్రమప్రాధాన్యము గాంచిన బలిహరణక్రియకు ఓషధివర్గ ధాన్యాదికములకు బదులు పశువు వరిష్ఠమయి పశుమారణము ప్రధానలక్షణమయినది ఆర్యావర్త యాగశాల మంత్ర విహితమయిన జంతువధ్యశాల యయ్యెను దినదినము నీ కర్మకాండమునకు క్రొత్త కూర్పేకాని మార్పున్నది లేకపోయినది తానుత్పాదించిన కర్మయంత్రమునకు తానే దాసుడై భారతీయ కర్మణ్యుడు ఉపజ్ఞగోలుపోయి యా యంత్రపు అరలయందు జిక్కువడిపోయెను

కర్మకాండముతో నూపిరి సలుపక యుక్కిరిబిక్కిరగుచుండిన భారతీయ సంఘమున క్రమముగా నశాంతి యతిశయించెను ఒకవైపున యజ్ఞయాగాదుల ప్రయోజనమును, మఱియొకదెస బ్రాహ్మణుల ప్రవర్తనాధిక్యములును తీవ్ర విమర్శలకు గురియగుచువచ్చినవి

గృహస్థాశ్రమమును దానితోపాటు చాలవఱకు వేదవిహిత కర్మాదికమును పరిత్యజించి యరణ్యా





వాసముచేయు వానప్రస్థులును, సర్వసంగ పరిత్యాగము కావించి,జనపదములందు పర్యటనము చేయుచు సాంఘికులకు ధర్మోపదేశము చేయు సన్యాసులును క్రతుకర్మాదికముల ప్రయోజన సామర్ధ్యములనుగూర్చి సంశయావిల మనస్కులై తర్కవితర్కములు చేయుచుండిరి, వేదార్థమును గురించియు, సృష్టి ఉత్పత్తి స్థితి లయములను గుఱించియు జిజ్ఞాస యధికమయినది సృష్టి యెట్లు కలుగుచున్నది, జన్మించుటకు పూర్వమును, మరణించిన యనంతరమును

బ్రాహ్మణుని పతనము

భూతకోటిస్థితి యెట్టిది, పరమాత్మ యెవరు, బ్రహ్మమననేమి – ఈ మొదలగు తర్కవితర్కములకు, జిజ్ఞాసకు ఫలముగ వేదాంతము – ఉపనిషద్విజ్ఞానము పులకరించినది యజ్ఞకర్మలు నిష ఫలమను నమ్మకము నానాటికి ప్రబలమయినది క్రతుకార్యసంకులమయిన భారత వర్షమున వేదములను, వైదికకర్మను నిరసించి తిరస్కరించు సంప్రదాయములు పొడచూపినవి

అయినను కర్మప్రవృత్తమయిన లోకము నూతనావిష్కృత సంప్రదాయ ప్రబోధములకు చెవియొగ్గి యాలించుటకుకూడ క్షణమాత్రము నవకాశములేక గ్రిరున తిరిగిపోవుచుండెను సంప్రదాయముల సంఖ్య యెక్కువగుచున్నకొలది బ్రాహ్మణునికి దినకర్మ యందు శ్రద్ధ తగ్గిన యంత్రము న విశ్వాసమును, స్వార్థపరతయు నధికమయినవి గోదాన, హిరణ్యదానాదికములవలన బ్రాహ్మణులు సంపన్నులయిరి హిరణ్యాదికములు బ్రాహ్మణ హృదయమున మోహ లోభ తృష్ణాది వికారములను రేపెట్టినవి సంఘమున నూతనముగ గలిగిన యనన్య గౌరవాధిక్య సంపదలతో బ్రాహ్మణునకి 'స్వాతిశయము', నహంకారమును మెండయినవి ప్రవర్తనము వక్రతనొందినది శీలము కలుషితమయినది శమదమ దాన ధర్మాది గుణముల కంటెను బ్రాహ్మణునికి భాగ్య భోగ్యములకు కారణమయిన క్రతుకర్మాచరణమే ప్రధానమయినది పరమార్థమును సాధించుట కుపకరణముగ నుండిన క్రతువే మహా పరమార్థమయి శిరసావహమయినది బ్రాహ్మణ పదము వెనుకటివోలె పూజనీయమగుటకుమాఱు ఆపవాదమునకు, అపప్రథకు కారణమయ్యెను


క్రతు కార్యకలాపముల ప్రయోజనమును గుఱించి మేధావులయిన బ్రాహ్మణులలోవలెనే రాజ్యములయందును మీమాంస బయలుదేరినది బ్రాహ్మణ మతానుసారులై వేద వేదాంగాది విద్య లభ్యసించి యజ్ఞయాగాదుల నొనరించుచు రాజధర్మము ననుసరించియు, మత ధర్మము ననుసరించియు, ప్రాధాన్యమువహించి భారతీయ సంఘమున క్షత్రియులు బ్రాహ్మణులకు పిదప ప్రముఖులైరి వేదకర్మాచరణమునకు తమకును గొంత హక్కు కలదనిపించుకొనుచు, కృషి పాశుపాల్య వర్తక వ్యాపారములందు ప్రవృత్తులయి వైశ్యులు వృత్తి ధర్మము ననుసరించి ప్రాముఖ్యము వహించిరి చతుర్థ వర్ణము వారగు శూద్రులు పై మూడు వర్ణములవారి నుండి ధర్మోపదేశము నొందుచు ధర్మాధర్మములను గుర్తెఱుంగుచు, ఉత్తమలోకప్రాప్తికి అగ్రవర్ణుల యాదేశోపదేశముల ప్రకారము ప్రవర్తించుచు, సేవా ధర్మమును ప్రధానముగ జేసికొని మహితులయిరి

ఈ రీతిని భారతీయ సంఘమున పైనుండి యొక్కొక్క మెట్టు దిగినకొలది వేదకర్మ తగ్గిపోవుచు వచ్చినది వేద వేదాంగాది విద్యల నభ్యసించుటకు గాని, యజ్ఞ యాగాదులను జేయుటకుగాని ఉపవీతము లాంఛనమయి, దానిని ధరించుటకు బ్రాహ్మణ క్షత్రియ వైశులు మాత్రమే యధికారులైరి సన్యాసము స్వీకరించుటకు సర్వ వర్ణములవారికి నధికారము లేకపోయినది ఉన్నవారిలోనైన నది పురుషులకు మాత్రమే నిర్ణీతమయినది వేదవిద్యల నభ్యసించి ధర్మాధర్మములను స్వయముగ దెలిసికొనుటకుగాని, వైదిక కర్మలయందు పాల్గొనుటకుగాని చతుర్థ వర్ణము వారు అనధికారులయిరి అయినను

ఉత్తమలోక, ఉత్తమ జన్మలాభమును ప్రాప్య లక్షములుగ నుంచి ఆలక్ష్య సిద్ధికి వేదవిహితక్రతు కర్మాదికమును సాధనముచే, వాటినన్నిటిని దన గుప్పిట బెట్టుకొని సర్వాధికారియై నెగడిన వాడగుటచేత నెట్టివాడయినను బ్రాహ్మణుని యాశ్రయమును, ప్రాపకమును తక్కిన వర్ణముల వారికి తప్పని సరియయినది బ్రాహ్మణుల ప్రవర్తనము నానాటికి మఱింత గర్వాన్యమగుచు వచ్చినను, భూదేవతలయినందున వారిని విమర్శింపరాదని కడవర్ణముల వారు తమ హృదయ గత భావములను వెలిపుచ్చనోడిరి సంసార దుఃఖమున నుండి తరింప బ్రయత్నించుట కెల్లరకు హక్కున్నప్పుడు ఆ తరణోపాయము లయిన యజ్ఞయాగాది కర్మలకును, వేదార్థ విచారమునకును, సన్యాస స్వీకారమునకును అధికారము తమకెందులకు లేకపోవలెనని కడవర్ణముల వారియందలి యువజనులు — రహస్యముగనే యయ్యె — సాహసప్రశ్నలు వేసి అగ్రవర్ణుల యధికారస్వామ్యమును విమర్శించుచు వచ్చినను కులవృద్ధులది యరిష్ట ప్రదమని, ధర్మాతిరిక్త విచారమని వారిని వారించుచుండిరి

ఈ రీతిని భారతీయ సంఘ మనేక విషయములయందు రహస్యముగనో బహిరంగముగనో వాద ప్రతివాదములతోను, విమర్శ ప్రతి విమర్శములతోను ప్రతిధ్వనించుచు అశాంతితో పొంగులు దేఱుచుండెను అపూర్వమయిన మానసిక అశాంతి యది, భావనాతీతమయిన పరమార్థ జిజ్ఞాసయది గూఢముగనో ప్రకటముగనో — ఎల్లరును బ్రాహ్మణుని విమర్శించువారే, ఎల్లరు నతని క్రతుకర్మకలాపమును నిందించువారే, ఎల్లరు నతని చెయ్దముల కుద్దేశము లారోపించు వారే బ్రాహ్మణ కృతములందలి మంచి కూడ చెడ్డగదోచిన విపరీతకాల మది సంఘ సముద్రము ఘూర్ణిల్లినది సంఘశక్తులు ప్రకోపించినవి బుద్ధి విలయతాండవము చేసినది వికారములు రేగినవి నడుములు కట్టుడు, లెండు, మేల్కొనుడు, బ్రాహ్మణుడు కపటి, వేదములు పౌరుషేయములు, క్రతుకర్మ బూటకము మోస పోకుడు, నిష్ఫలమీతంతు నిరర్థక మీ ప్రయత్నము — ఇవే బరాబరులు — అంతే అంతయు అల్లకల్లోలము తిరుగుబాటు విప్లవము

విప్లవధ్వజమును చేతబూని ముందున కడుగిడిన వారు క్షత్రియులు మతధర్మమునకే


సంక్రాంతి ముగ్గు — ఎస్ పి కుమారి

గాని రాజధర్మమునకు గణ్యత లేనందువలన ఈ యవకాశమును దీసికొని భారతీయ సంఘ గురు పదమును బ్రాహ్మణుల హస్తము నుండి గుంజుకొని మత విషయముగ ప్రాధాన్యము వహించిన వారు క్షత్రియులు భారతీయ సంఘమునకు, ధర్మమునకు రూపురేఖల నొసంగి యొక మహా సంస్కృతి సౌధమునకు పునాదులు వేసిన భారతీయ కులగురువు బ్రాహ్మణుడు తన యాదర్శమున నుండి పతితుడయి పదచ్యుడైనాడు సంఘమున బ్రాహ్మణుని యెడ నవిశ్వాస ముదయించుట కదే మొదలు అదే మొదలు బ్రాహ్మణుని పై తక్కిన సాంఘికులు జెబ్బచరుచుటకు ●

ఆంధ్రపత్రిక
1935 నవంబరు 13
సంచిక నుంచి


వ్యక్తిగతం



ఎక్కువ పరుగులు సాధించడంలో బాయ్‌కాట్‌ని, 31 టెస్ట్ సెంచరీలు చేసి బ్రాడ్‌మన్‌ని అధిగమించి ప్రపంచ క్రికెట్ చరిత్రలో కొత్త రికార్డుల్ని నెలకొల్పిన భారతీయుడు సునీల్ గవాస్కర్



పోలాండ్ కార్మిక నాయకుడు లెక్‌వలేసాకి నోబెల్ బహుమతి (శాంతికి) వచ్చింది కాని దానిని తీసుకునేందుకు ఆయన వెళ్లలేదు ఒకసారి దేశం వదిలివెడితే తనని పోలాండు ప్రభుత్వంవారు తిరిగి రానివ్వరని ఆయన భయపడి తన భార్య దానుతాని పంపారు పయి బొమ్మ ఆమె నోబెల్ బహుమతిని స్వీకరిస్తున్నప్పుడు తీసినది



నియంతలనే పేరు పొందిన ఆర్జెంటీనాలో రావుల్ ఆల్‌ఫోన్‌సిన్ అధ్యక్షుడుగా ఎన్నిక అయిన తర్వాత నిరంకుశపాలనకి తోడ్పడిన సైనికాధికారులమీద విచారణలు జరిపిస్తామన్నారు అమెరికా అధ్యకుడు రీగన్ కూడా ''మధ్య అమెరికా''గా పిలువబడే ప్రాంతంలో ఉన్న దేశాలలో నియంతల అధికారం తగ్గాలని అంటున్నారని వినికిడి



కౌంట్ ఓట్టో లాంబ్‌స్‌డోర్ఫ్ పశ్చిమ జర్మనీ ఆర్థికశాఖమంత్రి ఇటీవలే ఆయన తమ పార్టీకి విరాళాలు (రహస్యంగా ?) వసూలు చేశారన్న ఆరోపణ వెలువడింది ఆయన రాజీనామా చెయ్యాలని కూడా ఆయనని విమర్శించేవారి కోరిక

వారఫలం

20-1-1984 శుక్రవారం మొదలు 26-1-1984 గురువారం వరకు

♈ మేషం ఏవిషయం ఎలాగున్నా క్రయవిక్రయాలందు ఎలాంటి లోపం రాదు చాలకాలంగా నిలచిన ధనం క్రమంగా ఈవారం అందగలదు ఎన్నో నూతన విషయాలు మిత్రుల మూలంగా తెలిసికొంటారు స్త్రీలకు నగల సేకరణకు, ఉద్యోగమందు 'ప్రమోషన్' కు అవకాశం గలవారం

♉ వృషభం చేతయినంతలో యితరులకు సహాయం చేయవలసి రావచ్చు సోదరభావంతో మెలగినవారే అనవసరంగా పేచీలకు దిగనున్నారు వృత్తిలో చాల మందికి పెంపు కనిపిస్తుంది అధికార వర్గం మూలాన జరుగవలసిన పనులు ఏవైనా ఉంటే వారాంతంలో నెరవేరగలవు స్త్రీలకు పెద్దగా అనుకూలత ఏ రంగంలో కనిపించదు

♊ మిధునం వస్తు వాహన సేకరణకు అవకాశమున్నది ముఖ్య బంధువులతో కలిసికొనే అవకాశం గలవారం సాహితీ రంగాన కొందరకు సదవకాశాలు లభిస్తాయి స్త్రీలకు నూతనోద్యోగ యత్నాలు ఫలించటం నూతనాంశాలు గ్రహించటం జరుగుతుంది

♋ కర్కాటకం ఈవారం మీ జీవితంలో ఒక విధంగా నూతనాధ్యాయం ప్రారంభమైనట్లే, నూతన వ్యాపారానికిగాని, వృత్తిలో ప్రగతి సాధించుటకుగాని ప్రయత్నాలు సాగిపోతాయి వ్యవహార రంగంలో మీకు పేరు ప్రతిష్ఠలు రాగలవు స్త్రీలకు వృత్తియందు ఆధిక్యత, చేసిన ఉద్యోగ యత్నాలు ఫలించటం గమనిస్తారు

♌ సింహం అన్ని రంగాలలో ప్రగతి కనిపిస్తుంది ముఖ్యంగా రచనా విధానంలో, వ్యాపారంలో, ఉద్యోగ యత్నాలలో రాజకీయంగా మీకు మేలున్నది ఒకానొక విషయంలో ఆశించిన ఫలితం అందుకోనున్నారు స్త్రీలకు ప్రభుత్వ మూలంగా గాని, ధనిక వర్గం మూలంగా గాని, బంధు వర్గీయుల వలన గాని అనుకూలత చేకూరుతుంది

♍ కన్య వ్యవహారం ఏదైనా పరిష్కరింపబడవలసి ఉంటే సులువుగా పరిష్కారం కానున్నది రాజకీయంగా మేలున్నది క్రయ విక్రయాల నిమిత్తం చుట్టు ప్రక్కల ప్రాంతాలకు పయనించటం జరుగుతుంది 'కోర్టు' వ్యవహారాలు ఏవైనా ఉంటే, అనుకూలంగా పరిష్కరింపబడగలవు స్త్రీలకు ఉద్యోగ రీత్యా ఆశించిన 'ప్రమోషన్' లభ్యం కాగల అవకాశమున్నది కొందరకు విదేశ పర్యటనావకాశాలు చేకూరుతాయి

♎ తుల ప్రభుత్వోద్యోగులకు మేలు చేకూరుతుంది ఆశించిన 'ప్రమోషన్' లభించే అవకాశమున్నది నూతన వ్యాపారానికి కొందరు యత్నిస్తారు యత్న కార్యమందు లాభం చెకూరుతుంది అధికార ప్రాబల్యం సమకూరటం చెప్పదగిన అంశం స్త్రీలకు నగలో వస్త్రాలో సమకూర్చుకొంటారు

♏ వృశ్చికం చాల మందికి వ్యాపారంలో ప్రగతి కనిపిస్తుంది అప్పులు వసూలయ్యే మార్గమున్నది వ్యవహార రీత్యా ఎంత జాగరూకత వహిస్తే అంత మేలు అధిక విద్యా ప్రయత్నాలు చేకూరటం గమనింపదగిన అంశం స్త్రీలకు అప్రయత్నంగా ధనాదాయం, హటాత్తుగా బంధువుల రాక గమనింపదగిన అంశాలు


♐ ధనుస్సు మీకు గల వ్యవహార జ్ఞానం ప్రకాశించే అవకాశాలు ఉన్నాయి ఆదరించే బంధు మిత్రులు సమకూరుతారు పదిమందిలో పేరు ప్రతిష్ఠలు అతిశయించే సన్నివేశాలు అమరుతాయి 'గురుగ్రహ' బలం చేకూరుతుంది స్త్రీలకు విద్యా వైజ్ఞానిక, దైవ కార్యాల లాంటి విషయాలలో పెంపు కనిపిస్తుంది

♑ మకరం మేలు పొందిన వారు కీడు చేయ తలపెడుతారు 'ఇదిలోకన్యాయమే' నని గుట్టు చప్పుడు లేకుండా ఉండటం మంచిది వ్యాపారం సాఫీగా జరిగిపోవటం కూడా గమనిస్తారు విరోధి వర్గాన్ని ఒక కంట కనిపెట్టి మెలగాలి ఉద్యోగ వృత్తులందు అధిక ఫలాలు ఆశిచటం న్యాయంగాదు స్త్రీలకు శుభకార్య సంబంధమైన సంభాషణల, కించిత్తు ఆదాయం, విందు వినోద కాలక్షేపం

♒ కుంభం మీరు చిరకాలంగా చేసే వ్యాపారంలోగాని వృత్తిలో గాని మార్పులు రానున్నాయి శుభ కార్యాలోచనలకు విఘాతం ఏర్పడుతుంది ప్రతిఫలాపేక్ష రహితంగా శ్రమించవలసిన అవసర మున్నది వ్యవహార రీత్యా మేలు సంభవం స్త్రీలకు చాల కాలంగా అందని అవకాశం ఈవారం లభించటం గమనిస్తారు

♓ మీనం పేరు ప్రఖ్యాతులు అతిశయించే సన్నివేశాలు సమకూడుతాయి విద్యా విషయంగా ఏదో పెంపు లభ్యం కానున్నది కొందరకు అనుకోకుండా ప్రయాణం తగిలే మార్గమున్నది వ్యాపార విస్తరణకు యత్నించవచ్చు అప్రయత్న ధన లాభానికి కూడా అవకాశం లేకపోలేదు స్త్రీలకు వివిధరంగాలలో శ్రమించే వారికి, రచనా విధానంలో సదవకాశాలు లభిస్తాయి, గమనించండి

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి



MCA/TDB/53M/TEL

ఉత్పాదన కర్నాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్, బెంగళూరు మార్కెట్ చేయువారు మైసూర్ సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ బెంగళూరు

సీరియల్

యక్షగానం

స్వర్గీయ

శ్రీమతి మాదిరెడ్డి సులోచన

20

(గత సంచిక తరువాయి)

ఆ నాటికి వారం రోజులయింది ముకుందాదేవి, సత్యసాయిబాబా ఆశ్రమం పుట్టపర్తికి వెళ్ళిపోయి. ఆనాటి రాత్రి జరిగిన సంఘటన తరువాత తల్లీ కూతురు మాట్లాడుకోలేదు. వెళ్ళేటప్పుడు మాత్రం కన్నీటితో ఒకే మాట చెప్పింది.

"నీకే అవసరం వచ్చినా డాక్టరుగారిని అడగటం మరిచిపోకు." తనేం అనలేదు. తన హృదయంలో స్పందనలేదు. అనుభూతి లేదు. కరుడుకట్టిపోయింది.

తండ్రి మొదటిరోజు బాగానే ఉన్నాడు. మర్నాటినుండి అతను మారిపోయాడు. చాలా గంభీరంగా ఉంటున్నాడు. కూతురు కనిపిస్తే చిరాకు పడుతున్నాడు.

తల్లికి, శివాజీకున్న సంబంధం తండ్రికి తెలుసేమో. అందుకే అంత గంభీరంగా ఉండిపోయాడేమో. తనమూలంగా తల్లి దూరం అయిందన్న దిగులా! ఏమయి ఉంటుంది. ఆమెకు అర్థంకాలేదు.

అలాగే ఆలోచిస్తూ నిలబడింది. వంటింట్లో పెద్ద శబ్దం అయింది. పరుగున వెళ్ళింది నీలిమ. కాఫీ చేసుకోబోతూ, గిన్నెపడేసాడు రావు.

"అదేమిటి నాన్నా నేను చెయ్యనా!"

"నాకెవరి దయా భిక్ష అక్కరలేదు."

"నాన్నా! అమ్మ అలా వెళ్ళింది. మీరు ఇలా అంటే, ముట్టనట్టు ఉంటే నాకెంత బాధ కల్గుతుందో ఆలోచించారా!"

ఉషస్సు మెల్ల, మెల్లగా మాయం అవుతోంది. వాతావరణం చాలా హాయిగా ఆహ్లాదకరంగా ఉంది.

"నా బాధ యెవరకి చెప్పకోను" అన్నాడు యెటో చూస్తూ.

"నాన్నా! మనము ఒకరి కొకరం మిగిలాం. బాధలు, సంతోషాలు, ఏవయినా కలిసే పంచుకుందాం." అన్నది, వెళ్ళి అతని భుజంపై చేయి వేసి.

కంగారుగా, ఏదో అంటరాని వస్తువు కంటపడినట్టు, తన ఒంటిని అంటుకున్నట్టు దులపరించుకున్నాడు.

"నాన్నా!"

"నాన్నా! నాన్న అమ్మ ఇద్దరూ చచ్చిపోయారు. పో... ఆ డాక్టరు దగ్గరకు వెళ్ళమన్నదిగా వెళ్ళరాదూ!" అన్నాడు.

"నాన్నా! నామీద యెందుకింత కోపం వచ్చిందో అర్థం కావటంలేదు. ఏమయింది నాన్నా!"

"ముందు నా కళ్ళముందు నుండి పో." గిన్నె ఎత్తాడు.

ఆమెకాక్షణంలో, అతడిని రెచ్చకొట్టడం భావ్యం కాదనిపించింది. మౌనంగా వచ్చేసింది. బయట ఏడుస్తూ కూర్చుంది. ఆమె అయిదు నిమిషాలు కనిపించకపోతే తల్లడిల్లిపోయే నందనరావు ఆమె ఉనికిని మరిచినట్టు ఊరుకున్నాడు.

పదకొండు గంటలు దాటాక, ఊగుతూ బయటికి వచ్చాడు. పడిపోతాడేమోనని భయపడింది కాని, తను వెళ్తే ఇంకా రెచ్చిపోతాడని, చూస్తూ కూర్చుండి పోయింది.

అతను ప్రక్కింటి డ్రైవరు కనిపిస్తే పిలిచాడు.

"చూడు రాములూ! నా చేతి క్రిందకో కుర్రవాడిని చూడు, అలాగే నువ్వు రోజూ క్యారియర్ తెచ్చిపెట్టు" అన్నాడు.

"అలాగేనయ్యగారూ."

"కుర్రాడిని మాత్రం త్వరగా చూడు."

అతను డబ్బులు క్యారియర్ తీసుకుని వెళ్ళిపోయాడు. అతను ఇంట్లోకి వచ్చాడు. అరగంట తరువాత రాములు క్యారియర్ తీసుకు వచ్చాడు. అబగా తిన్నాడు నందనరావు.

"రాములూ! బయట ఎక్కడో ఆ అమ్మాయి ఉంటుంది. ఈ మిగిలిన అన్నం తినమని చెప్పు."

జరిగిన కథ — 12 : ఇక తను ఆడే నాటకాన్ని విరమించాలని ప్రయత్నిస్తుంటుంది ముకుందాదేవి. ముకుందాదేవి ఇంట్లో దోపిడి జరుగుతుంది. తను ఇంతకాలం నాటకం ఆడి భక్తుల ముడుపుల ద్వారా సంపాదించిన సొమ్మును కొంచెం కూడా మిగల్చకుండా ఎత్తుకుపోతారు. ముకుందాదేవి ఆదిత్యపై నేరం మోపి అరెస్ట్ చేయిస్తుంది. చైనులూ, రాయుడూ కలసి ఈ దొంగతనం చేశారని నీలిమ చెప్పినా వినదు. ఆ ఆస్తి కోసమే కాచుక్కూచున్న సావిత్రి తన కొడుకుతో వెళ్ళిపోతుంది. డాక్టర్ శివాజి ఇచ్చిన పేపర్ ప్రకటన చూసి అప్లికేషన్ పెట్టిన నీలిమను ఆహ్వానిస్తాడు శివాజి. వారిరువురూ మాట్లాడుకొన్న తర్వాత గుళ్ళో పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొంటారు. ఆదిత్య కేసు వాయిదా పడుతుంది. నీలిమ తనకు పుట్టిన బిడ్డే అని ముకుందాదేవి ద్వారా తెల్సుకొంటాడు శివాజి. ఆదిత్యను బెయిల్‌మీద విడిపిస్తాడు. నీలిమను ఆదిత్యకిచ్చి పెళ్ళి చేయాలని నిర్ణయించుకొంటాడు. ఆదిత్య, నీలిమలకు తను విద్యార్థి జీవితంలో అనుభవించిన కష్టాలను చెపుతాడు డాక్టరు శివాజి. యువ తరంగిణి ప్రోగ్రాం నుంచి ఇంటికి వచ్చిన నీలిమ శివాజికి, తన తల్లికి గల అక్రమ సంబంధాన్ని తెలుసుకొని తల్లిని అసహ్యించుకొంటుంది.


నీలిమ గుండెల్లో మొండి బాకు దిగింది

''మీ అమ్మాయా!''

''మా, మీ అని ఏముంది! ఎవరో ఒకరు యెవరికీ ఎవరూ లేరు'' అన్నాడు

నీలిమ లేచింది తనిప్పుడు పంతానికిపోయి, సాధించేదేముంది! అందుకే లోపలికి వెళ్ళి, అవన్నీ సర్ది పెట్టి, స్నానం చేసి, మిగిలిన అన్నం తిన్నది క్యారియర్ కడిగి పెట్టింది

''నాన్నా! క్యారియర్ ఎందుకు'' అని అడగబోయి ఊర్కున్నది, తనేమడిగినా తప్పులు వెతుకుతాడు తండ్రి ఆమెకేం పని తోచటం లేదు ఒకప్పుడు ఊపిరి తీసుకునే సమయము కూడా ఉండేది కాదు ఇప్పుడు ఇప్పుడు



ఒక్కొక్క క్షణం దొర్లించటానికి మహా అవస్థ పడుతున్నది

శివాజీని చూడాలంటే అసహ్యంగా ఉంది

సాయంత్రం వేళకు ఓ పనమ్మాయి, కుర్రాడు కుదిరాడు

''కుర్రాడు దినమంతా ఉండాలయ్యా! జీతం ఎక్కువ ఇవ్వు''

''నాకొచ్చే అద్దెలో అన్నీ గడవాలి నేను దేవుడిని దయ్యాన్ని కాను' అన్నాడు కఠినంగా

నీలిమ లోపలి గది నుండి తొంగి చూచింది తండ్రి ముఖం వికృతంగా, అసహ్యంగా ఉంది

ఎందుకిలా మారాడు! అమ్మే కారణం అనుకుందామె ఆ రోజంతా మాట్లాడుకోలేదు రాత్రి అతను నిదురపోయాక, కాసేపు అతని కాళ్ల దగ్గర కూర్చుంది తల్లిని తప్పు పట్టలేదు

కాని ఆమె పిరికితనాన్ని హిపోక్రసీని తప్పు పట్టింది ఫలితంగా ఆమె ఇల్లు విడిచింది

తెల్లవారి పనిమనిషి చేతే అన్ని పనులు చేయించుకున్నాడు

''నాన్నా!'' అన్నది జాలిగా అతను వినరానట్టే ముఖం తిప్పుకున్నాడు

తనేం తప్పు చేసింది

''అమ్మా టీ పెడతావు రాజా?''

"పని కుర్రాడు ఉన్నాడు కదా అమ్మాయిని ఎందుకు విసిగిస్తారు ?" అనేది తల్లి ఆయన చిన్నగా నవ్వేవాడు

"ముకుందా! తల్లి కొట్టినా, తిట్టినా తల్లిని హత్తుకుని తృప్తి పడతాడు పసిపిల్లడు ఈనాడు నా పరిస్థితి అలాగే ఉంది నా తల్లి చేత్తో ఇస్తే అమృతము" అన్నాడు.

ఆ మాట విన్నాక ఏనాడు తండ్రి పనులు నిర్లక్ష్యం చేయలేదు

"అమ్మడూ! నీ చేతి స్పర్శతో నా అణువణువు కొత్త రక్తం పోసుకుంటుంది"

"నీలూ! నీ చిరునవ్వు చూస్తూ నా వ్యథలు, బాధలు మరిచిపోతాను ఈ ప్రాణం ఎప్పుడో పోయేదమ్మా నీ కోసం నీ పెళ్ళి చూడాలని, నీ బిడ్డలచేత తాతయ్యా అనిపించుకోవాలని బ్రతుకుతున్నాను"

అలాంటి తండ్రి తన ఉనికినే అసహ్యించుకుంటున్నాడంటే తను ఏం చేసింది!

"నాన్నా!" అతని భుజాలు నిమిరింది

"ఏమిటి ?" ఆ కంఠంలో మార్దవం లేదు, మామూలు పలుకరింపు కూడా లేదు

"ఎందుకు నాన్నా అంత కోపం! నేను వెళ్ళి అమ్మను తీసుకువస్తాను జరిగింది మరచిపోదాం" అన్నది

"ఆమె లేదు కావాలని ఏడుస్తున్నాననా నీ భావం! పనివాళ్ళు నాకు వండి పెడతారు ఉండాలనుకుంటే ఉండు"

"నాన్నా!"

"నన్ను పేరుతో పిలువ వద్దు"

"నాన్నా! కోపమెందుకో చెప్పు నాన్నా!"

"నాకెవరిపైనా కోపం లేదు నాపైనే నాకే కోపం, అసహ్యం, జాలి" అనుకుంటూనే గోడ పట్టుకుని వెళ్ళిపోయాడు

ఆమె అలాగే అతను వెళ్ళినవైపు చూస్తూ నిలబడిపోయింది

"నీలూ!"

ఆమె చప్పున తల ఎత్తింది డాక్టర్ శివాజీ నిల్చున్నాడు అతని ముఖాన కళలేదు

"డాక్టర్‌గారూ! మేము మీకేం అపకారం చేసామని మమ్మల్ని సాధిస్తున్నారు! మా అమ్మ ఊరెళ్ళింది నాన్న విపరీతమైన వేదాంతం పెంచుకున్నాడు ఇంకా నేను ప్రాణంతో మిగిలి ఉన్నాననా మీ బాధ!" అన్నది కోపంగా

"నీలూ! శాంతంగా నా మాట వింటావా!"

"మీరు చెప్పాల్సింది, నేను వినాల్సిందేం లేదు మీరు వెళ్ళిపొండి మళ్ళీ ఈ ఇంటి ఛాయలకు రాకండి" అన్నది టప్పున చేతులు జోడించి

"నీలూ! ఒక్కమాట వినమ్మా!"

"అరమాట కూడా వినను వినను" అన్నది పిచ్చిపట్టినట్టు అరిచింది

యక్షగానం

శివాజీ ఏం చేయలేనట్టు వెళ్ళిపోయాడు

అతను వెళ్ళిపోయాక కుర్చీలో కూర్చుంది చాలాసేపు ఆమెకు చెప్పుకోదగిన దగ్గర బంధువులు లేరు స్నేహితులులేరు సావిత్రమ్మ కొడుకును మెంటల్ ఆస్పత్రిలో చేర్పించారీ మధ్యే ఆమె మనసు విరిగి దేశయాత్రలు చేస్తున్నది ఏదో ఒక పని చేయాలి ఏం చేయాలి!

ఆమె ఆలోచిస్తూండగానే వారంరోజులు గడిచిపోయాయి నందనరావు పని కుర్రాడి సహాయంతో పనులు చేసుకుంటున్నాడు పని మనిషి వంట చేస్తున్నది అతను తిన్నాక యాంత్రికంగా భోజనం చేస్తున్నది అతని కోపం తగ్గకపోతుందా అని ఎదురుచూస్తున్నది కాని రోజుకు, రోజుకి ఎక్కువే అవుతున్నది

ఒక్కొక్కసారి బూతులు తిడతాడు చేతిలో ఏదిఉంటే అది నీలిమపైకి విసురుతాడు నీలిమ చూస్తుండగా, పళ్ళు, మిఠాయిలు తెప్పించుకు తింటాడు మిగిలితే పనివారికి పెడతాడు

ఆమె కతని ప్రవర్తన ఒక్కముక్క అర్థం కాలేదు వీలయినంతవరకు అతన్ని తప్పించుకు తిరుగుతున్నది ఇంట్లో అద్దెకున్నవాళ్ళతో కలివిడిగా తిరిగింది

రెండురోజులకే మొహం మొత్తింది ఆ యజమానురాలు శ్రీవత్స చిత్రమైన స్త్రీ! యెదుటివారు శ్రోతలు, తను రేడియో అనుకుంటుంది రెండురోజులలో తన పుట్టింటివారు తన పెళ్ళి ఎంత ఘనంగా చేసారో ఇరవైరెండుసార్లు చెప్పింది

"అమ్మో! పురాణం విప్పింది" పనిమనిషి పరుగులు పెట్టేది చేసేది చిన్న పని అయినా పెద్ద కలరిచ్చి చెబుతుంది వినేవారికి ఓపికకు పరీక్ష పెడుతుంది

"అక్కా! మా ఇంటికి రావటం మానేశావేం ?" వాళ్ళమ్మాయి అడిగింది

"ఏం లేదమ్మా"

"నాకు తెలుసు మా అమ్మ సోది భరించటం కష్టం అసలు ఆర్ట్ ఆఫ్ టాకింగ్ అని క్లాసులు పెట్టాలి" అన్నది ఆ అమ్మాయి పేరు హేమ

"అక్కా! నాకు తెలుగు రాదు కాస్త చెప్పవూ!" అన్నది

ఆ రోజు ఆ అమ్మాయికి తెలుగు పాఠం చెబితే ఎంతో రిలీఫ్‌గా తన సమయము సద్వినియోగం అయినట్టుగా అనిపించింది మెల్ల, మెల్లగా అన్ని సబ్జెక్ట్సు చెప్పేది

ఒకరోజు హేమ తల్లి శ్రీవత్స వచ్చింది

"అమ్మాయ్! మా హేమకు ఒక్క టీచరు నచ్చదు నీకు తోచదు అంటున్నావు కదా ట్యూషన్ చెప్పరాదూ!"

"అలాగేనండీ" అన్నది ఆవిడే ఫీజు అది నిర్ణయించింది ఏమాట కామాటే చెప్పుకోవాలి ఫీజు అది నిర్ణయించింది గాని, ఖచ్చితమైన మనిషే ఒక్క మాట్లాడేటప్పుడే రాచకొండ కథలూ, పురాణం నవలలా ఎక్కడో మొదలపెట్టి, ఎక్కడికో తీసుకువెడుతుంది

ఆమె మోపెడు చీరలు మోసుకువి వెళ్ళింది ఎక్కడికో

"చీరలు డ్రైవాష్‌కా పిన్నిగారూ!"


"పిచ్చిపిల్లా! ఇన్ని చీరలు డ్రైవాష్‌కిస్తే ఆరిపోతారు అలా అని ఇచ్చేవారు లేరనుకోకు మా సుబ్బమ్మపిన్ని కూతురుంది దాని భర్త విజయవాడలో పెద్ద లాయరు గోగినేని రంగారావు అంటారు వినే ఉంటావు అతని భార్య

సంక్రాంతి

అదిగో సంక్రాంతి
ప్రతి ఇంట నవ్వులు పూయించ
వస్తూన్నది తొలి వేకువ గీతికలా

సన్నాయి మేళవింపులో
బసవన్న విన్యాసాలు,
హరిదాసు కీర్తనలో
పల్లవించే రసరాగామృతాలు,
జంగమ దేవరుని శంఖారావాలు,
బుడుబుక్కల వాని డుబుడక్క నాదాలు,
సోది చెప్పెడి చిన్నారి పలుకులో
శుభ స్వాగతాలు,
పల్నాటి యోధుల పౌరుషాన్ని
కీర్తించే కోడి పందెముల క్రీడలు,
భోగిమంటల నీడల్లో
చలికాచుకొనే అర్భకుల కేరింతలు,
ధన ధాన్య రాశులతో
కర్షకుని కన్నుల్లో తొణుకులాడే
ఆనందాల సిరి మూటలు,
కన్నెపడచుల అందమైన కోరికల్లా
ఇంటింట తీర్చిన రంగవల్లికలు,
పూబంతులు చామంతులు కుమ్మరించి
కడు భక్తితో చేయు గొబ్బిపూజలు,
కొత్తల్లుళ్ళ గుండెల్లో సంబరాలపరవళ్ళు,
మేలిముత్యపు సరుల్లా చెలువొందు
అనురాగాలు,
తెలుగునాట నాల్గు చెరగులా —
తరతరాల సంస్కృతిని
పుణికి పుచ్చుకొని
అదిగో సంక్రాంతి — ప్రతి ఇంటా
నవ్వులు పూయించ
వస్తూన్నది తొలి వేకువ గీతికలా

— అవనిగడ్డ సూర్యప్రకాష్



అన్నపూర్ణ మా సుబ్బమ్మ పిన్ని కూతురు రుమాలుగుడ్డ డ్రైక్లీనింగ్‌కు వేస్తుంది నిజానికి ఆయన రెండు చేతులా సంపాది స్తున్నాడు కాబట్టి, తట్టుకుంటున్నాడు ''

''పిన్నిగారూ!'' మాట తప్పించబోయింది

''నువ్వుండమ్మా! మీ బాబాయిగారూ ఎప్పుడూ అంటుంటారు 'శ్రీవత్సా నీవు అన్నీ పొదుపుగా చేస్తావు,' అంటూ నేను పొదుపు చెయ్యబట్టే ఈనాడు ఈ స్థితిలో ఉన్నాము అమ్మాయి, మీ బాబాయి ''

''పిన్నిగారూ! మరి ఈ చీరలు చీరలు బయటికి ఎందుకు తీసుకువెళ్తున్నారు ?'' అన్నది చీరలు ప్రెస్ చేస్తూ చీరల విషయం తప్ప మరే విషయం చెప్పొద్దన్నట్టు

''ఫాల్ కుట్టటానికి అమ్మాయ్! మహారాష్ట్రలావిడ, మూడు రూపాయలు తీసుకుంటుంది గాని చక్కగా కుడుతుంది నా పెళ్లి అయిన దగ్గర నుండి అక్కడే కుట్టి స్తున్నాను అసలావిడ చదువుకోలేదు ఆ సలహా ఇచ్చింది నేనే కాని ఏం ప్రయోజనం! ఇప్పుడు ఒక్క నిముషం తీరిక వుండదు మన పని అంటె చేస్తుంది ''

ఆ సంభాషణ సాగి, తీగ పాకంగా మారి, ఆ మహారాష్ట్రలావిడ చరిత్రను తిరగవేసి, మళ్లీ తన పెళ్లిదగ్గర ఆగి, ఎంత ఘనంగా జరిగిందో, తల్లి ఎంత శ్రమపడ్డారో చెబుతుంది

''పిన్నిగారూ ఒక్కమాట ''

''ముందు నా మాట వినమ్మాయ్ అసలా మహారాష్ట్రలావిడ ''

''ఆవిడ సంగతి వదిలెయ్యి ఆ ఫాల్స్ నేను కుట్టిపెడతాను'' గబుక్కున చీరలు లాక్కుని ఇంటికి వచ్చింది

తన పొదుపు గురించి చెప్పుకోవటమేగాని, ఒక్క విషయంలో పొదుపు పాటించగా చూడ లేదు న్యాయంగా ఒక గంట కూర్చుంటే ఫాల్ కుట్టవచ్చు ఒక గంట నోరు ఆడించగలదు కాని, చెయ్యి ఆడించలేదు శ్రీవత్స

అలా ఒక వ్యాపకం కల్పించుకున్నది

ఆ రోజు పనమ్మాయి రాలేదు తండ్రి మెప్పు పొందాలని, గబ గబ వంట చేసింది కాఫీ కాచింది కాఫీ పని కుర్రాడి చేతికిచ్చి పంపింది

''పనమ్మాయికూడా మా అభిరుచులు నేర్చుకుంటుందిరా'' అన్నాడు నందనరావు

''పనామె రాలేదయ్యా ''

''మరి కాఫీ, వంట నువ్వు చేసావా ?''

''నేనెందుకు చేస్తాను! నీలమ్మ చేసింది ''

''ఓహో! ఎందుకు ఎందుకు దానిచేత పని చేయించావురా అది వండింది తింటానా!'' గోడ ఆసరాగా చేసుకొని వంటింట్లోకి వెళ్లి అన్నం కూరలు ఎగజిమ్మాడు గిన్నెలు నేలకేసి కొట్టాడు

''నాన్నా! నాన్నా! మనసు బాగాలేదు కోలుకుంటారని ఊరుకుంటే రోజుకు, రోజుకు మితిమీరి పోతున్నారు ఏమిటిది!'' వెళ్లి అతడిని పట్టుకుంది

''కబడ్‌దార్! నన్ను ముట్టుకుంటే '' ఆమెను ఒక్క నెట్టు నెట్టాడు

''నేను నేను ఏం చేస్తే నీకు సంతోషం కల్గుతుందో చెప్పు నాన్నా!'' అన్నది

నేలమీదినుండి, మెల్లగా లేస్తూ గాజులు చిట్లి, చేయి గీరుకుపోయి రక్తం వచ్చింది

''నువ్వు నువ్వు చచ్చిపోతే నాకు మన శ్శాంతి ''

''నాన్నా!''

''నన్నా పేరుతో పిలువవద్దు '' శాసించి నట్టే అన్నాడు

''నీ కోరికమేరకే చచ్చిపోతాను నాన్నా! చచ్చిపోతాను'' ఆమె చర, చర బయటికి పోబోయింది

''మరీ చిన్నపిల్లలా ఏమిటి నీలూ!'' శ్రీవత్స వచ్చి ఆపుచేసింది తనింటికి తీసుకు వెళ్లి ఓ అరగంట లెక్చర్ ఇచ్చింది

''అతను మెంటల్ అని తెలిసాక నువ్వు తొందరపడితే యెలా! సైకియాటిస్ట్‌కు చూపించి ఏదయినా ఆలోచిద్దాం'' అన్నది

ఏరు, వాగు తెంచుకుని వచ్చినట్టు దుఃఖం వచ్చింది నీలిమకు వెళ్లి తల్లికి ఘాటుగా ఉత్తరం రాసింది

21

ఆదిత్య అప్పుడే నల్గొండ నుండి వచ్చాడు అక్కడ అతను ప్రభుత్వ ఆస్పత్రి బిల్డింగ్ కంట్రాక్ట్‌కు తీసుకున్నాడు అక్కడ పని చేస్తున్నాడు ఈ రోజు వచ్చాడు

''వర్క్ యెలా ఉంది ఆదిత్యా ?''

''నీలిమ యెలా ఉంది సార్ ?''

శివాజిరావు పక్కున నవ్వేసాడు వెంటనే సరిగ్గా కూర్చున్నాడు

''నీలిమ బాగానే ఉందని అనుకుంటున్నాను ఉంటావుగా రేపు వెళ్లిచూడు ''

''సార్! నేను ఈ పనిలో ఎక్కువ రోజులు ఉండలేనేమో ''

''ఆదిత్యా!''

''అవును సర్! మనిషి తనకు కొంత మిగుల్చుకోవాలనే పని చేస్తాడు, కాదనను కాని, మా పార్టనర్ ఇచ్చిన పాళ్లు చూస్తే నాకు మతి పోతున్నది ''

''మరి కంట్రాక్ట్ అంటే ఏమటనుకుం టున్నావ్ ? దోపిడీ ''

''ఈ దోపిడీ నావల్ల కాదు వర్కర్స్‌ను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు యెవరు బాగుపడుతు న్నట్టు! మధ్య వర్తులు ''

''చూడు ఆదిత్యా! నిన్ను అక్కడికి పంపింది, అన్యాయం చేయమని కాదు అనుభవం సంపాదించమని ఈ కంట్రాక్ట్ అయిపోగానే స్వతంత్రంగా చేద్దువుగాని'' అన్నాడు

''సర్! మీ రుణం ''

''తరుణం వచ్చినప్పుడు తీర్చుకుందువు గాని ''

''అది కాదు సర్ ''

''నాకంతా తెలుసు ఆదిత్యా! ప్రతీ

...యివచ్చు, అడ్డదార్లు తొక్కవచ్చు నిజాయితీగా ఉంటూ సంపాదించ గలనని నువ్వు నిరూపించాలి ''

''మీ ఆశీస్సులు, అండ, దండలుంటే అలాగే నిరూపిస్తాను ''

''విష్ యు ఆల్ ద బెస్ట్! మారేడ్‌పల్లిలో నాదొక ప్లాటుంది అది నీలు పేర ట్రాన్స్‌ఫర్ చేస్తాను ఇల్లుకు ప్లాను నీ ఇష్టప్రకారం ఇవ్వాలి ''

''రేపు నీలుతో మాట్లాడుతాను ''

''ఆ అమ్మాయి నందనరావును వదలి రావటం అంటే ఇబ్బంది పడుతుంది ''

''నిజమే'' అన్నాడు ఫోన్ అయినా చేద్దాం అంటే ఫోన్ లేదు అతనికి ఇంకా తనను దొంగగా మార్చిన వ్యక్తులను పట్టుకోవాలనే ఉన్నది

మర్నాడు బజారుకు వెళ్ళి, నీలిమ అభిమాన రచయితవి నాల్గు పుస్తకాలు కొని పేక్ చేయించాడు 'నీలుకి ప్రేమతో ఆదిత్య' అని రాసాడు పండ్లు, స్వీట్స్ నందనరావు కోసం కొన్నాడు


అతను వాకిట్లోనే ఆగిపోవల్సి వచ్చింది నందనరావు నోట వినకూడని దుర్భాషలు వినిపిస్తున్నాయి నీలిమ మాత్రం ఏదో చెప్పాలని తెగ ప్రయత్నిస్తున్నది

''అమ్మో అవతారం ఎత్తితే కూతురు మరో అవతారం ఎత్తుతుందట సిగ్గూ, బిడియం లేని మనుషులు ఏ హుస్సేన్‌సాగర్ లోనో పడి చావరాదూ !''

''నాన్నా ! నా మాట వినండి మీ దగ్గర డబ్బులు తీస్తానా ?''

''షట్ అప్ డర్టీ రాస్కెల్ ! యెవరు ! యెవరే నీకు నాన్న ? రంకు నేర్పినమ్మ బొంగు నేర్పదా ! ఆ ఆదిత్య గాడితో ఆటలు సాగించావు మళ్ళీ సిగ్గు ఎగ్గు లేక '' అతని మాటలు దారుణంగా మొండి బాకుల్లా దిగబడుతున్నాయి

''నందనరావుగారూ !'' ఆదిత్య లోపలికి వెళ్లాడు అక్కడ దృశ్యం చూచి అక్కడే ఆగి పోయాడు పడక కుర్చీలో నందనరావు



సంక్రాంతి ముగ్గు —పి గౌరి

యక్షగానం

కూర్చున్నాడు అతని ముందు, అసహాయంగా నేలమీద కూలబడి ఉంది నీలిమ ఆమెను తాకి క్రింద పడ్డాయనటానికి నిదర్శనంగా అక్కడ వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి

నీలిమ నుదురు అద్దుకుంది

''ఓ నువ్వా !'' నందనరావు ముఖంలోని వికృత తత్వాన్ని చిరునవ్వుతో జయించాలని చూచాడు సాధ్యం కాలేదు పక్షవాతముతో తీసుకుంటున్నా మనిషి అందంగా శుభ్రంగా కనిపించేవాడు ఇప్పుడు ముఖంపై ఎముకలు తేలి అసలు మనిషి మరింత వికృతంగా తయారయ్యాడు

''నేనేనండీ నేను వస్తూనే వినకూడని మాట విన్నాను ''

''అది అది నిన్నుకాదు ఆదిత్యా రా '' ప్రక్కన కుర్చీ చూపాడు ఆ పరిస్థితి పరాయివాడి కంటపడినందుకు నీలిమ తల భూమిలోకి వంగి పోయింది ఆమె అతడిని పలుకరించాలని కూడా మరిచిపోయి, గదిలోకి దూరింది

పెద్దవాడు నిన్ను కాదు అన్నాక ఏం వాదిస్తాడు ? తను చెవులారా విన్నాడు మాట్లాడక వెళ్లి ప్రక్కన కూర్చున్నాడు

''ఏమిటంకుల్ ఏమయింది ?''

''డబ్బు అయిపోయిందని ఆ సన్యాసురాలు వెళ్ళి పుట్టపర్తిలో కూర్చుంది ఈవిడను తిని కూర్చో అంటే ఏదో ఒకటి తెస్తుంది దొంగతనాలు చేస్తుంది ''

''అదేమిటంకుల్ ! నీలిమకు దొంగతనం చెయ్యాల్సిన అవసరం ఏముంది ? పొరపాటు పడి ఉంటారు ''

''అది నిజమే, ఇంట్లో డబ్బు ఎక్కడికి పోతుంది ''

''పనివాళ్లు తీసి ఉండవచ్చు ''

''ఏమో ! నాకు నమ్మకం కలగటంలేదు ''

''మీ కూతుర్ని మీరు అనుమానిస్తున్నారా ?''

''నా కూతురు ! '' అతను వికృతంగా నవ్వాడు

''ఆర్థిక ఇబ్బందులుకూడా మనిషిని అసహాయుడిని చేస్తాయి అంకుల్ ! నీలిమను ఏదయినా చిన్న ఉద్యోగం చెయ్యమనండి ''

''దానికెవడిస్తాడు ఉద్యోగం ! అదొక్కటే పని చెయ్యాలి బ్రోతల్ హౌస్ పెట్టుకోవాలి,'' అన్నాడు కసిగా

''అంకుల్ !'' ఆశ్చర్యంగా చూచాడు


''అదంతా ఎందుకు కాని, నీ పని యెలా ఉంది ?''


''చాలా బావుంది అంకుల్, ఆత్మ, మనసు అనేవి లేదనుకుంటే ఒక్క సంవత్సరంలో లక్షలకు, లక్షలు సంపాదించవచ్చు '' అన్నాడు నందనరావు మాట్లాడలేదు

''డాక్టరుగారి ప్రోత్సాహమే లేకపోతే ''

''డాక్టరుగారా ! అవును ఆయన ఎవరికి ఏం కావాలో కనుక్కొని మరీ చేస్తారు ''అన్నాడు వెటకారంగా పని కుర్రాడిని పిలిపించి కాఫీ తెమ్మని చెప్పాడు

(ఇంకా వుంది)





దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మొదటిబహుమతి రు 250/- పొందిన వ్యాసం

సెంటిమెంట్స్ ప్రాధాన్యంగా మానవతా విశ్లేషణ!

రుధిరోద్గారి దీపావళి బహుమతి కథల్లో సన్నివేశాల ఆలంబనగా కాక, సెంటి మెంట్స్ ప్రాధాన్యంగా మానవతా విశ్లేషణ జరిగింది బహుమతి కథలు, రొటీన్ పడికట్టుకు అతీతంగా సహజంగా వున్నాయి నాకు నచ్చిన కథలు వరుసగా

రేపటి తండ్రి — పిల్లల భవిష్యత్తు, అభివృద్ధి ఆకాంక్షించే తండ్రికి— అవసరానికి ఆదుకొన్న తండ్రిని మరచినా, తండ్రి కాని మనుమడి పసి మనసు తాతకు బ్యాగ్ బాగు చేయించే యత్నం అభినందనీయం తండ్రి మనసుకు దర్పణం పట్టిన కథ

దొడ్డమనసు — ఆడపడుచుగా తాను బాధ పడినా, తన ఆడపడచు దగ్గర స్వార్థంతో వర్తించినా గౌరి సారూప్యంతో మనసు తెరలు తొలిగిన ఇల్లాలు కథ సహజంగా వుంది

మనుషులు — పరిస్థితులు ప్రతికూలమైన మంచితనం ముందు స్వార్థం తల వంచి చేసిన తప్పును దిద్దుకోవడంతో మానవత్వాన్ని మేల్కొలిపిన కథ

వారసత్వం — ఆశయాలకు ఆచరణలో అవరోధాలు గుర్తించి వాస్తవంలో రాజీపడిన కథ వారసత్వం

గోరంతదీపం — బాహ్యానికి కటువుగా కనిపించినా భర్త మనసు తెలుసుకొని, అంత రంగాన గోరంతదీపం వెలిగించుకున్న ఇల్లాలు కథ

మమతల వంతెన — తరాల అంతరాల వైవిధ్యంలో దూరమయి, మమతల వంతెనలో దగ్గరయిన రెండు తరాల తండ్రీ కొడుకుల కథ ముస్లిమ్ కుటుంబ వాతావరణం కళ్లముందుంచింది

కథలు చదివిన తర్వాత రచయితలు గురించి కుతూహలం కలిగింది మంచి కథలకు ఇది కూడా లక్షణం అనుకుంటాను

బహుమతి గ్రహీతలకు అభినందనలు

—జి. కుసుమకుమారి*

రచయిత్రి పరిచయం



"ప్రకృతి కళ కళలకు కాణాచి, గలగలా గోదారి అందాల కొంగుబంగార మయిన కోనసీమ ఒడిలో జననం 5–10–1957 సుధాపాలెం—పెరిగింది అమ్మమ్మ తాతయ్యగారి దగ్గర భీమునపల్లె హైస్కూల్‌లో చదువు— సంధ్య అమలాపురం కాలేజిలో వివాహం 1978లో శ్రీవారు శ్రీ జి వి యస్వీ ప్రసాదరావు ఇండియన్ బాంక్‌లో ఉద్యోగం

తిలక్, బుచ్చిబాబు, బీనాదేవి అభిమాన రచయితలు లలితకళలందు ఆసక్తి, స్నేహం, సంగీతం అభిరుచులు సాహిత్య సృష్టి కన్నా అధ్యయనంపై మక్కువ ఎక్కువ లబ్ధ ప్రతిష్టులయిన రచయితలు వ్యాపార దృక్పథంలో మగ్గుతున్నా, వర్ధమాన రచయితల్లో సిన్సియారిటీ తెలుగు సాహిత్యానికి కొత్త ఊపిరి వి రాజా రామోహనరావుగారి కథలు, బాపు, బాలి, కాటూరి కార్టూన్‌లు మిస్‌కాను ప్రథమ యత్నంలోనే మొదటి బహుమతితోపాటు, పరిచయంకూడా చేస్తున్న పత్రికకు, పాఠకులకు సంక్రాంతి శుభాకాంక్షలు!"

— గండ్రోతు (నూకల) కుసుమకుమారి

ఇంతకీ ఏ పెట్టెలో వచ్చావు?

సంకురుమయ్యా
ఒంటరిగా వచ్చావా
ఒంటిపై వచ్చావా
గుర్రమెక్కి వచ్చావని
పంచాంగమయ్య
చెప్పిందు
గుర్రమెక్కి వస్తే
గుగ్గిళ్ళు ఎక్కడివయ్యా
సంకురుమయ్యా
బియ్యం కిలో
రెండు 'అన్న' మాట
తప్పిందు కదయ్యా
ఉలవలు తింటున్నారు
జనం ఘనంగా
సింధూర వస్త్రం కట్టావా
రాజయోగం అయిందా
ఇక సన్యాసయోగం
అబద్ధాలు ఆడినా
పర్వాలేదు సంకురుమయ్యా

ఇంతకీ మకర సంకురాత్రి
పురుష లక్షణమా
స్త్రీ లక్షణమా — ఇది
ఒకరోజా లేటుగా
వచ్చావు రైళ్ళు రావడం
లేదులే సకాలంలో
పైగా ఏ పెట్టెలో వచ్చావో
ఎలా వచ్చావో — ఆదివారం
వచ్చావు సెలవు ఎగగొట్టావు
సంకురుమయ్యా సరదాగా
ఉందాము వీడియోలుచూద్దాము
అనుకున్నాం దాని తస్సదియ్యా!
రూల్సు మార్చారు తధికిణతోం—
గంగిరెద్దు మేళం

గందరగోళం —
అన్నట్టు ఏం తెచ్చావు?
చెరకుగడలా—వంట చెరకులా
మీగడ తరకలా
పూతరేకులా
పూలు, బంతులు
పండ్లు ఫలాలు
కూరలు, ధాన్యం
పప్పులు ఏవీ తేలేదా!
ఏం చేస్తావు? ఆకాశంలో
ధరలు ఉంటే అందకుండా
అందుకే 15న వచ్చావు
తప్పించుకు — తరలించుకు
అష్టకర్ముడుగా విశాలాక్షుడుగా—
సస్యలక్ష్మి వచ్చింది బంతిపూలతో
గొబ్బిళ్ళు తెచ్చింది గోమాత
వచ్చింది కామదేమవై

— ఎం ఎస్. ఎం.

తలతన్నే వాడిని తాడి తన్నేవాడు

— ఎం.పి. సౌజన్య



యస్. ఐ యస్వంతరావుకు చాలా మంచి పేరుంది క్రైమ్ డిటెక్ట్ చేయటంలో, అనుమానితుల్ని వలవేసి పట్టటంలో, నేరస్తులతో వాళ్ళు చేసిన నేరాలు అంగీకరింప చేయటంలో — అలా వాళ్ళు ఆ నేరాలు చేసి సంపాదించిన డబ్బులు — వస్తు సామాగ్రి ఎక్కడెక్కడ దాచిందీ కూపీలు లాగడంలో — అతనికతనే సాటి

యస్ ఐ యస్వంతరావు ఒక్కోసారి అవలంబించే తెలివైన పద్ధతులే అతన్ని మరింత ప్రఖ్యాతుణ్ణి చేశాయి! అయితే తాడితన్నేవాణ్ణి తలతన్నేవాడు వుంటాడు కదా!?

యస్వంతరావు యస్ ఐ గా మంగళాపురం పోలీస్ స్టేషన్ చార్జి తీసుకోగానే ప్రకాష్ అనే దొంగమీద ఫిర్యాదుల ఫైలు చూసి విస్తుపోయాడు

ప్రకాష్ చదువుకున్నవాడేకాక, పూర్వాశ్రమంలో నాటకాల్లో నటించే నటుడు, పైగా కొన్నాళ్ళు గడియారాలు, రేడియోలు, టేప్ రికార్డర్లు, ఫాన్లు కూడా మెకానిజం చేసిన ఘటికుడు

అతను ఏ సుముహూర్తాన దొంగతనం మొదలుపెట్టాడో — కేవలం పై వస్తువులు తెలివిగా కాజేయటమేకాక, వాటి రూపురేఖలు లోపలి భాగాలూ గుర్తుపట్టటానికి వీల్లేకుండా మార్చివేసి — మసిపూసి మారేడుకాయ చేసి — ఎవరికీ అనుమానం రాకుండా అమ్మివేసేవాడు

పైగా తన నేరం సాక్ష్యాలు లభించకుండా జాగర్తపడేవాడు అందుకే ప్రకాష్ అన్నాళ్ళు దొంగతనాలు చేస్తున్నా సరైన సాక్ష్యాధారాలు లేక కొన్నిసార్లు, పోయిన వస్తువులు సరిగా లభించక కొన్నిసార్లు అతను చేసిన దొంగతనాలు రుజువయ్యేవికావు

యస్వంతరావు మంగళాపురంలోకి రాగానే ఆలస్యం చేయకుండా ప్రకాష్ సంగతి తేల్చాలని నిర్ణయించుకున్నాడు

దీనికి నాందిగా ప్రకాష్‌కు సంబంధించిన భోగట్టా యావత్తూ రహస్యంగా సేకరించి రంగం సిద్ధం చేసుకున్నాడు

వృద్ధురాలైన ప్రకాష్ తల్లి ఆ ప్రక్కనే ఉన్న పల్లెటూళ్ళో వంటరిగా గుండె జబ్బుతో ఉందని, ఆమె ప్రకాష్ కోసం ఎంతో అతురతగా ఎదురుచూస్తున్నదని తెలుసుకున్నాడు

యస్వంతరావు ఆలస్యంచేయకుండా ఒక మంచి లేడీ డాక్టరును నర్సుగా వేషంవేయించి తను డాక్టరుగా మారువేషం వేసుకుని ప్రకాష్ తల్లి దగ్గరకు చేరి తమను ప్రకాష్ పంపినట్లు చెప్పాడు

ఆ ముసలమ్మ తన కోసం తన కొడుకు డాక్టర్‌ను, నర్సునూ పంపినందుకు ఎంతో ఆనందించి, తన రోగం సగం తగ్గినట్టు మంచంలో వుండే సంబరపడిపోయింది

ఇలా రెండు రెండు రోజులు వైద్యం జరిగాక, మూడో రోజు ప్రకాష్ గంగా జలం తెచ్చిన బ్రాహ్మణ పూజారిగా నుదుట విభూతి రేఖలతో, తెల్లటి అంగవస్త్రం పైపంచెతో ప్రత్యక్షమయ్యాడు

ఇలా తల్లికోసం మారువేషంలో ఎప్పుడైనా ప్రకాష్ రావచ్చని ఊహించిన యస్వంతరావు, అతని తల్లికి పెథిడ్రిన్ మత్తు మందు నర్సు చేత యిప్పించి ఆ ముసలమ్మను స్పృహలో లేకుండా ఉంచాడు

''ఎవరు మీరు? ఈ ముసలమ్మకు వైద్యం చేయమని ఎవరు పంపారు?'' అన్నాడు ప్రకాష్ డాక్టర్, నర్సులతో

''మేము ఈ పల్లె ప్రాంతాల్లో ప్రాక్టీసు పెట్టాలని వచ్చాం! అదృష్ట వశాత్తు ఈ ఇంట్లో ఉన్న ఈ ముసలమ్మ జబ్బుగా ఉందని ఊళ్ళోవాళ్ళు చెబితే మా క్లినిక్ ఇక్కడే ప్రారంభించాము!'' అన్నాడు యస్వంతరావు చేతిలో ఉన్న స్టెతస్కోప్, మెడలోవేసుకుంటూ

తన తల్లికి అలాగిన్నా కాస్త మంచి వైద్యం దొరికినందుకు ప్రకాష్ లోలోపల సంతోషించి, తనెవరో వాళ్ళకు తెలియనందుకు సంతోషిస్తుండగా ''మీరెవరో మాకు తెలియదు! కాని ఈ ముసలమ్మ బ్రతకాలంటే ఈ మందులు

కొన్ని అర్జెంటుగా తేవాలి! కాస్త ఖరీదైన మందులు—అయినా గుండె జబ్బు తగ్గటానికి—తప్పదు!'' అన్నాడు ఓ మందుల చీటీ ఇస్తూ. ప్రకాష్ అలా మందుల చీటీతో మందులషాపు దగ్గర ఆ చీటీ చూపగానే, మందుల దుకాణాల్లో మఫ్టీలోవున్న పోలీసులు అతన్ని వెంటనే అరెస్టు చేశారు.

తనను అంత తెలివిగా అరెస్టు చేసిన యస్ ఐ యస్వంతరావు ఎత్తుగడకు ఆశ్చర్యపోతూ లాకప్‌లోకి వెళుతున్న ప్రకాష్‌తో 'డియర్ ఫ్రెండ్ ప్రకాష్! మీ అమ్మకు అంత సీరియస్‌గా ఏంలేదు! కేవలం నిన్ను అరెస్టు చేయటానికి అలా పథకం వేశాను. మీ అమ్మ క్షేమంగా ఉంది. నాతో నర్సుగా నటించిన లేడీ డాక్టర్ ఆమెను ట్రీట్ చేస్తోంది! ఆమె క్షేమముగా ఉంది! పైది పై— నీకో రెండు రోజుల టైం ఇస్తున్నాను! నువ్వు చేసిన దొంగతనాలు—ఇవి ఎలా ఎవరిద్వారా అమ్ముతున్నావో — ఎవరు మధ్యవర్తులుగా ఉండి నీతో సహకరిస్తున్నారో ఆ వివరాలు కావాలి! ఆలస్యంచేస్తే నీవంటి వాళ్ళచేత నిజం ఎలా కక్కించాలో నాకు బాగా తెలుసు?'' అన్నాడు.

ప్రకాష్ ఏం మాట్లాడలేదు! నిశ్శబ్దంగా లాకప్‌లోకి వెళ్ళిపోయాడు.

రెండు రోజులు అన్నం నీళ్ళు లేకుండా మాడబెట్టినా ప్రకాష్ లొంగకపోవటం యస్వంతరావుకు ఆశ్చర్యం కలిగించింది. పోలీసు లాఠీ దెబ్బలు ఏం పనిచేయలేదు. మరో రెండు రోజులు గడిచాయి. అయినా ప్రకాష్‌లో మార్పు రాలేదు. మనిషి నీరసించి, మొహం పీక్కుపోయినా మొండి ధైర్యంతో నిమ్మకు నీరెత్తినట్లు అట్లాగే వున్నాడు.

ఈలోపు ప్రకాష్‌కు ఓ గరల్ ఫ్రెండ్ ఉందని, ఆమె పేరు 'రాణి' అని తెలిసి, ఆమెనే రాత్రి రహస్యంగా స్టేషనుకు పిలిపించాడు.

మంచిగా రాణీకి చెప్పవలసింది చెప్పి ఆమెను ప్రకాష్‌ఉన్న లాకప్ గదిలోకి పంపుతూ ''నువ్వయినా ప్రకాష్‌తో రహస్యాలు చెప్పిస్తే... అతనికి తక్కువ శిక్ష పడే ఏర్పాట్లు చేయిస్తాను! లేదా... అతనిమీద లేనిపోని దొంగతనాలేకాకుండా మర్డరు కేసులో పెట్టవలసి వస్తుంది! జాగర్త!'' అంటూ హెచ్చరించి మరీ చెప్పాడు.

రాణి నోరెత్తకుండా యస్. ఐ. చెప్పింది వింది. ఆమెను ప్రసన్నం చేసుకోడానికి యస్.ఐ. నాలుగు కప్పుల బోర్నవీటాకూడా తేవటానికి ఆర్డరిచ్చి ప్రకాష్‌ను లాకప్‌నుంచి బయటికి తెప్పించాడు.

''మీరిద్దరూ ప్రేమికుల్లట కదా! మీకు ఓ అరగంట టైమిస్తున్నాను! ఇప్పుడు టైం పదిన్నర అయింది గడియారం పదకొండు గంటలు కొట్టేప్పటికి మీరిద్దరూ మాట్లాడుకోవటం పూర్తికావాలి! సరిగా పదకొండింటి వరకు నేను అక్కడ గదిలో వేచివుంటాను! మీకు ఏ సెంట్రీలూ కాపలా వుండరు మీరిద్దరే ఏకాంతంలో ఉన్నట్టు మాట్లాడుకోండి! ఓ కే'' అంటూ అక్కడినుంచి నిష్క్రమించాడు.

ప్రకాష్‌ను ఆ పరిస్థితిలో చూసిన రాణి భోరుమని కావలించుకొని విలపించింది. ఇంతలో నాలుగు కప్పుల బోర్నవీటా హెడ్‌కానిస్టేబుల్ తెచ్చాడు.

అది అతను బల్లమీద పెట్టగానే 'ఇక్కడ బాత్‌రూమ్ ఎటు?' అంటూ సంజ్ఞలతో చేతి వేళ్ళు చూపుతూ అడిగింది రాణి. హెడ్ ఆమెను ఓ వైపు చూపెడుతూ ముందుకు నడవగానే ఆమె అతని వెంట వెళ్ళింది.

ఈలోపు రాణి అందించిన మత్తుమందు రెండు కప్పుల్లోపోసి ప్రకాష్ ఏమీ ఎరగనట్టు కూర్చున్నాడు.

కాస్సేపటికి రాణి హెడ్‌తో తిరిగి వచ్చి కూర్చుంది. ఒక కప్పు హెడ్‌కు, మరోటి ఎస్.ఐ. యస్వంతరావుకు ఉద్దేశించి ఇచ్చి—యస్.ఐ.గారికి ముందు 'ఆ బోరన్‌వీటా కప్పు ఇవ్వమంది. హెడ్ ఆమె మాట వెంటనే పాటించాడు.

క్షణాల్లో జరగవలసినదంతా జరిగిపోతోంది. ఏదో సంభాషించుకుంటున్నట్టు కేవలం పెదిమలు కదుపుతూ రాణి—ప్రకాష్‌లు సంభాషించుకోసాగారు.

హెడ్ కానిస్టేబుల్ మత్తుగా కుర్చీలో వరిగిపోగానే, అంతవరకు గుండెల్లో దాచుకున్న ఫారిన్ మిని టేప్‌రికార్డర్ రాణి బయటికి తీసి ''యస్ ఐ యస్వంతరావు నాతో అన్న మాటలు అన్నీ ఇందులో రికార్డు చేశాను! అతనన్న మాటలే చాలు నీ నిర్దోషిత్వం రుజువు చేయటానికి!'' అంది.

మరు నిముషంలో యస్ ఐ దుస్తులతను ధరించి, తన దుస్తులు యస్ ఐ కి తొడిగి ప్రకాష్—సురక్షితంగా రాణితో బయటపడ్డాడు.

తరువాత జరిగింది తెలిసిన యస్ ఐ కిమ్మనకుండా నోరుమూసుకోవాల్సి వచ్చింది కారణం—ప్రకాష్ చేత అంత ఘోరంగా తను అవమానింపబడ్డట్టు లోకానికి తెలిస్తే — ముఖ్యంగా తన పరువు—డిపార్ట్‌మెంట్‌లో తనకు అంతవరకున్న పేరు ప్రతిష్ఠలు హరించుకుపోతాయి పైగా అది ప్రమోషన్‌కి అడ్డం వస్తుంది.

రెండవది—తను రాణిని బెదిరిస్తూ అన్న మాటలు రహస్యంగా రాణి టేప్ రికార్డు చేసిన విషయం.

ఇప్పటికీ యస్వంతరావుకు యస్. ఐ. గా మంచి పేరే వుంది!

ఎంత తల తన్నేవాడికైనా—తాడి తన్నేవాడు ఎవడో ఒకడు తగలకపోడు గదా! ★

'సంక్రాంతి సంబరం' (ఫోటో : దుర్గాసి సాయిబాబు)





శ్రీమతి జి. భవానీకృష్ణమూర్తి సీరియల్
అనురాగ తరంగాలు

(గత సంచిక తరువాయి)

జయని ఒయుట వదిలి రఘు గదిలోకి వెళ్లి కారు తాళాలు తీసుకుని "జయా, ఎక్కు" అంది స్టార్టు చేస్తూ ఎక్కి ఆమె ప్రక్కన కూర్చున్నాడు జయ

చాలాసేపటివరకూ లీలతో మాట్లాడ డానికి ధైర్యం చాల్లేదు జయరావ్‌కి

ఆమె కారు నడిపే తీరుకి భయపడి "లీలా ప్లీజ్ ! కొంచెం మెల్లగా పోనీ" అన్నాడు ఆదుర్దా నిండిన గొంతుతో

"నా బాధ నీ కర్థం కాదు జయా, రేణు నన్ను అలా అంత చీప్‌గా ఊహించుకుని, దేముడు లాంటి రఘుని అపార్థం చేసుకుని వెళ్లిపోయిం దంటే ఈ కారులో నుంచి దూకి చావాలన్నంత బాధగా ఉంది నాకు"

"నిజమే లీలా ! వదిన నిన్ను, అన్నయ్యని అలా ఊహించిందంటే నాకూ చాలా బాధగా ఉంది ప్లీజ్ రిలాక్స్ ! ఇప్పుడు మనం వెళ్లి నిజంచెప్తే అర్థం చేసుకోలేనంత మూర్ఖురాలు కాదు నువ్విలా ఆదుర్దాపడవలసిన పని లేదు" ఆమె భుజాల చుట్టూ చెయ్యివేసి ఓదార్పుగా అన్నాడు

"నువ్వు పక్కకి జరుగు నేను డ్రైవ్ చేస్తాను" అన్నాడు

ఏమనుకుందో కారు ఆపి స్టీరింగ్ అతని కిచ్చి వెనుక నుంచి తిరిగివచ్చి అతని పక్కన కూర్చుంది

కారు మెల్లగా సాగిపోతోంది అతని భుజం మీద తల ఆనించి కళ్లు మూసుకుంది లీల

ముందుగదిలో కూర్చుని బాబుకి, చంద్రం కొడుక్కి చదువు చెప్తున్న రేణుక, ఒకరి వెనుక ఒకరుగా లోపలి కొస్తున్న లీలని, జయరావ్‌ని చూసి గతుక్కుమంది

అలసటవల్ల ముఖం వాడినట్లున్నా మునుపటికంటే రంగొచ్చి, సంపూర్ణ ఆరోగ్యంతో పుష్టిగా, నిండుగా కనిపిస్తోంది జుట్టంతా చెదిరి ఉన్నా లైటు వెలుతురులో కూడా నల్లగా నిగనిగ లాడుతోంది "ఉండకేం చేస్తుంది కోరుకున్న వాడితో కాపురం చేస్తోందిగా" కసిగా పళ్ళు కొరుక్కుంది రేణుక

తనని చూడగానే 'లీలా' అంటూ అమాంతంగా కౌగలించుకుంటుందని అంతవరకూ ఊహించుకుంటున్న లీల, రేణుక బింకాన్ని చూసి మెల్లగా దగ్గరకు వెళ్ళి రెండు భుజాల మీద తన చేతులువేసి "రేణూ !" అంది కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ

ముఖం పక్కకి తిప్పుకుంది రేణుక, కళ్ళల్లోని నీళ్ళు లీల కంట పడకూడదని

బాధగా అనిపించినా నిగ్రహించుకుని "రేణూ ! పద ఇంటికెళ్ళాక అంతా వివరంగా మాట్లాడుకుందాం" అంది

"నేను రాను నీ ఆహ్వానమూ నాకు అవసరం లేదు" విసురుగా అంది

"రేణూ! ఆనాడు వెంకటేశం నీ జీవితంలో రాహువులా ప్రవేశించబోతే అడ్డుపడి నాయింటికి తీసుకొచ్చి, నన్ను తోబుట్టువులా భావిస్తున్న రఘుతో నీ పెళ్ళి దగ్గరుండి జరిపించాను అలాంటిది నీకు అన్యాయం చేస్తానని గానీ, నీ జీవితంలో నిప్పులు పోస్తానిగానీ ఎలా అనుకున్నావే ?"

మౌనమే శరణ్యమైంది రేణుకకి

"పద చంద్రం ఏడి ?" చుట్టూ చూసింది లోపలికెళ్ళిన లీల ఎవరూ లేరు తిరిగి వచ్చింది

రేణుక మాట్లాడలేదు గానీ బాబు జవాబిచ్చాడు "మావయ్య, అత్తయ్య సినిమాకి వెళ్ళారు" ఆ ముద్దు మాటలు విని పొంగిపోతూ బాబుని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది లీల

"అమ్మమ్మ లేదా నాన్నా ?"

మోకాళ్ళమీద కూర్చుని బాబు బుగ్గలు నిమురుతూ అడిగింది

"పిన్ని దగ్గరకెళ్లింది" అన్నాడు

బాబుని ఎత్తుకుని జయ దగ్గరకు తీసుకొచ్చి "బాబాయ్ దగ్గరకు వెళ్ళు బుజ్జీ నాన్న దగ్గరకు వెడదాం" అంటూ జయకి అందించింది

"బాబూ ! ఇలారా" కోపంగా పిలిచింది రేణుక

"ఉహు ! నేను డాడీ దగ్గరకు వెడతాను" జయ మెడని కౌగలించుకున్నాడు బాబు

లీల రేణుక దగ్గరకు వెళ్ళి "రేణూ ! ఇంటికి వెళ్ళాక అన్నీ వివరంగా మాట్లాడు కుందాం ఆ తరువాత కూడా నీకు అక్కడ ఉండడానికిష్టం లేకపోతే నేనే తీసుకొచ్చి మళ్ళీ ఇక్కడ దిగబెడతాను ప్లీజ్ ! కాదనకు నీకు తెలియని నిజం ఒకటి చెప్పనా ?" చేతిని అందుకుని మృదువుగా నొక్కింది లీల

ఏమిటన్నట్లు రెప్పలు రెపరెపలాడించి చూసింది రేణుక

"నేను, జయ పెళ్ళి చేసుకోబోతున్నాం"

జరిగిన కథ — 10 : ఓ అనాధశరణాలయాన్ని నడపాలని నిశ్చయించుకొంటుంది లీల అనుకున్న ప్రకారంగానే అనాధ శరణాలయాన్ని నిర్మించి ఎంతోమంది అభాగినులను ఆదుకొని వారికి జీవనోపాధి చూపెడుతుంది లీల లీలని భయంకరమైన వ్యాధి ఆవరిస్తుంది రఘుకి ఇచ్చిన మాటప్రకారం హైదరాబాద్ వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకోడానికి ఒప్పుకొంటుంది కానీ ఇంట్లో తల్లిదండ్రులకు, రేణుకకు తను చదువుకోడానికి వెళ్తున్నట్లు అబద్ధమాడి, వాళ్ల కోపతాపాలకి గురౌతుంది కానీ రఘు వాళ్లని వొప్పిస్తాడు లీల, రఘు రైలులో హైదరాబాద్ వెళుతుండగా దారిలో కలుస్తాడు జయరావ్ అతనికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అవుతుంది లీలని టి బి ఆస్పత్రిలో చేర్చి, కావల్సిన సౌకర్యాలన్నీ కల్పించి వూరు వెళ్లిపోతాడు రఘు జయరావ్ లీలతో వీలున్నప్పుడల్లా వచ్చి కాలక్షేపం చేస్తుంటాడు లీలకి రోగం తగ్గిపోయాక పెళ్లి చేసుకోవాలని వారు నిర్ణయించుకొంటారు లీలకు, రఘుకు అక్రమ సంబంధం ఉందని రేణుకి చెపుతాడు వెంకటేశం ఈ విషయం నిలదీసి అడుగగా రఘు కోపంతో రేణుకను చెంపపై కొట్టి హైదరాబాదు వెళతాడు హైదరాబాదునుంచి వచ్చిన లీలను చూచి ప్రభావతమ్మ రేణుక పచ్చని సంసారంలో నిప్పులు పోశావని నిందిస్తుంది లీల ఈ మాటలకు ఆశ్చర్యపోయి రేణును తీసుకుని రావటానికి జయరావ్‌ను తీసుకొని గుంటూరు వెళుతుంది

నమ్మలేనట్లు ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది రేణుక

నిజమేనన్నట్లు చిన్నగా నవ్వాడు జయరావ్

"మరి మరి ఆ వెంకటేశం అలా "

"ఏదో చెప్పాడు నువ్వు నమ్మేశావు పిచ్చిరేణూ! ఒకందుకు మేము కొన్ని నిజాలు దాచిపెడితే మరోరకంగా ఊహించుకుని అనవసరంగా అపోహపడి రఘుని బాధపెట్టి, నువ్విలా మోడులా బ్రతుకుతున్నావు రేణూ! నువ్వు ఇంక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండడానికి వీల్లేదు నిజానిజాలు తెలిశాక నువ్వు చేసిన ఈ పిచ్చిపనికి నువ్వే తప్పక బాధపడతావు పద వెడదాం"

"తమ్ముడు, మరదలు లేని సమయంలో పిల్లవాడిని ఇలా వదిలేసి వెళ్ళడం "

"ఓహో! వాళ్ళు వచ్చాకే వెడదాంలే నీ బట్టలన్నీ సర్దుకో"

రేణుక లోపలికెళ్ళి తనవి, బాబువి బట్టలు సూట్‌కేసులో సర్దింది

చంద్రం, భార్య సినిమానుంచి రాగానే చెప్పి, వాళ్ళు ఉదయం వెడుదురుగాని అన్నా వినక రాత్రి పది గంటలకి కారెక్కారు

* * *

జయరావ్ కారు నడుపుతూంటే లీల, రేణుక వెనకాల సీట్లో కూర్చుని ఉన్నారు లీల బాబుని ఒడిలో కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తూ మధ్య మధ్య రేణుని పక్కచూపులు చూస్తోంది విండోలోనుంచి బయటికి చూస్తోంది రేణుక ఆమె మనసంతా గజిబిజిగా భారంగా ఉంది

"రఘుతో లీలకి ఉన్న సంబంధం తెలియకనే జయ లీలని పెళ్ళి చేసుకుంటున్నాడా? అయినా అసలు లీల మాటల్లోని నిజానిజాలేమిటో? నన్ను రప్పించుకోడానికి ఆయన ఆడుతున్న నాటకమేమో ఇది అదే నిజమైతే తను మళ్ళీ తిరిగి వచ్చేస్తుందితప్ప ఛస్తే అక్కడ ఉండదు" బాబు పిలుపుతో ఆలోచనలు ఆపి పక్కకి చూసింది

"మమ్మీ! నాకు ఆకలేస్తోంది" ఏడుపు గొంతుతో అన్నాడు

చిరాగ్గా ఉండడంవల్ల "నోరు మూసుకుని పడుకో" విసుక్కుంది

ఏడుపు మొదలు పెట్టాడు బాబు

"ఊరుకో నాన్నా! నీకేం కావాలి? పాలు కావాలా? బిస్కెట్లు కావాలా? చాక్‌లెట్లు కావాలా?" బుజ్జగిస్తూ అడిగింది లీల

"అన్నీ కావాలి" ఏడుస్తూనే జవాబిచ్చాడు

"వెరీగుడ్! జయా! వచ్చే ఊళ్ళో ఏదైనా హోటల్ తెరిచి ఉందేమో చూడు, నాక్కూడా బాగా ఆకలిగా ఉంది ఏదైనా తిందాం" అంది లీల జయరావ్‌తో

'తాము తినలేదు సరికదా కనీసం లీలని,



జయరామ్‌ని కూడా తినమని అనలేదు కనీసం కాఫీగానీ, మంచినీళ్ళుగానీ ఇవ్వలేదు' అన్న విషయం గుర్తు రాగానే ఇన్సల్టింగ్‌గా ఫీలయింది రేణుక

''సారీ ! నాకావిషయమే గుర్తు రాలేదు'' అంది అతి మెల్లగా

లీల నవ్వి ''ఫరవాలేదులే, ఇలా అర్ధరాత్రి పూట హోటళ్ళ చుట్టూ తిరుగుతూ దొరికిందే పరమాన్నంలా తినడం కూడా థ్రిల్లింగ్ గానే ఉంటుంది'' అంది

''నీకు థ్రిల్లింగ్‌గానే ఉందిగానీ నా ప్రాణం పోతోంది'' అన్నాడు తిరిగి తిరిగి విసుగొచ్చిన జయ

''ఈ మాత్రానికే ప్రాణం పోతే ఎలా ? సతీ సావిత్రిలా ఆ యమధర్మరాజు వెంటపడి అయినా నిన్ను బ్రతికించుకుంటాను సరేనా ? మన సంగతి ఎలా ఉన్నా ముందు బాబు పాలో, నీళ్లో దొరికేదాకా నీకాపాట్లు తప్పవు అదిగో చూడు అక్కడ ఏదో దీపం వెలుగుతోంది'' అంటూ వేలుపెట్టి చూపింది

నిజమే అదొక చిన్న టీ దుకాణం పక్కనే బస్సుస్టాండు 12 గంటల దాకా బస్సుల రాకపోకలు ఉంటాయి కనుక ప్యాసింజర్లు అడపాదడపా వస్తుంటారు కాబట్టే అది ఇంకా తెరిచే ఉంది అందరూ తలొక రొట్టె తిని, నీళ్ళలాంటి వేడి వేడి కాఫీ తాగారు

''మొత్తానికి సాధించావు'' స్టార్టుచేస్తూ నవ్వాడు జయరామ్

''నీకు తెలియదేమోగానీ, నేను అనుకున్నది పూర్తిచెయ్యకుండా ఎప్పుడూ వదిలిపెట్టలేదు ఒక్క విషయంలో తప్ప అయినా ఆ విషయంలో అపనింద తప్పలేదు నాకు '' అంటూ ఓరకంట రేణుక వైపు చూసింది ఆ మాటలు వాడి బాణాల్లా రేణుక హృదయాన్ని తాకాయి

ఈసురోమంటూ హైదరాబాదు వెళ్ళిన లీల రెట్టింపు ఉత్సాహంతో తిరిగివచ్చింది

లీల అలా గలగలా నవ్వుతూ మాట్లాడు తూంటే చిన్నప్పటి, చదువుకునే రోజులు జ్ఞాపకం వస్తున్నాయి రేణుకకి

ఆనాటి విషయాలు, సంఘటనలు లీలతో ముచ్చటించాలనిపించినా ఇంతవరకూ నోరు బిగించుకుని కూర్చుని ఇప్పుడు తనంతటతానే ఏమీ ఎరుగనిదానిలా మాట్లాడాలంటే చిన్నతనంగా అనిపించింది

కడుపు నిండాక కాస్సేపు కబుర్లు చెప్పి లీల ఒడిలోనే నిద్రపోయాడు బాబు కాళ్ళు రేణుక ఒడిలోకి వచ్చేలా సరిచేసి, కుదుపుకి క్రింద పడకుండా పట్టుకుని, జయతో కబుర్లు చెప్తోంది లీల, మూడో మనిషి ఉందన్న ధ్యాస లేకుండా కళ్ళు మూసుకుని వెనక్కి జార్లబడి కూర్చుని వినకూడదనుకుంటూనే వారి మాటలు వింటోంది రేణుక

అనురాగ తరంగాలు

లీల, రేణుక, జయరాం ఒకరి వెనుక ఒకరుగా కారు దిగారు వీధి దీపాలు మసక మసగ్గా వెలుగుతున్నా చీకటిగానే ఉంది ఇంట్లో కూడా చీకటిగానే ఉంది లీల పక్కసందులో నుంచి రఘు గదిలోకి తొంగి చూసింది మంచం మీద కాళ్ళు జాపుకుని, కళ్ళకడ్డుగా చేతిని పెట్టుకుని, కుర్చీలో వెనక్కి జార్లబడి కూర్చుని ఉన్నాడు రఘు ఆ గదిలో లైటు వెలుగు తూండడంతో అంతవరకూ మెలకువగానే ఉండి ఉంటాడని ఊహించి ''రఘూ !'' పిలిచింది చిన్నగా చప్పుడు చేస్తూ

చటుక్కున కళ్ళు తెరిచి చూచాడు

''రఘూ ! నేను లీలని తలుపు తియ్యి''

సంక్రాంతి వేళ

డబుడక్కవాడ ! కేల్‌డక్క మ్రోగింపుము
కీడు మేల్ దెల్పుచు కేకలిడుచు —
రంగరంగా యంచు చెంగున దాటుచు
హరిదాసుడా ! ఊరు తిరుగిరమ్ము !
పేరు పేరున ఇంటివారిని కొనియాడి
జంగముదేవరా ! శంఖమూదు —
గంగెద్దు దాసరీ ! సింగారమును చేసి
బసవన్న నాడించు ప్రాంగణమున —

కర్షకా! మేలు నీ పంట గాదె జేరె—
అల్లుడా ! రమ్ము ! నీ కోర్కెలెల్ల చెల్లు—
వచ్చె చెచ్చెర ప్రతి యింటివరకు నేడు
సర్వహితదాత్రి సంక్రాంతి పర్వనేత్రి

—— శనగన నరసింహస్వామి

అంది గదిలోంచి బయటికి వచ్చి తలుపుతీసి లైట్లు వేశాడు

ముగ్గురినీ చూసి నమ్మలేనట్లు అలాగే నిలబడిపోయాడు

''రఘూ !'' ముందుగా లీల పలకరించింది.

''లీలా ! ఇప్పుడు నీ ఒంట్లో ఎలా ఉందమ్మా ?''

''బాగానే ఉన్నాను రఘూ ! నువ్వేమిటిలా చిక్కిపోయావు '' చెంపలు పీక్కుపోయి, కళ్ళు లోతుకిపోయి, గడ్డం కొద్దిగా పెరిగి ఉన్న రఘుని చూడగానే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి లీలకి

''నాకేమ్మా, బాగానే ఉన్నాను ఏరా జయా ? సాయంకాలం వచ్చి వెంటనే వెళ్ళి పోయారట '' తమ్ముణ్ణి పలకరించాడు

విశ్వనాథంగారు, ప్రభావతమ్మ కూడా లేచి వచ్చారు ఆ హడావిడికి

ప్రభావతమ్మ రేణుక దగ్గరగా వచ్చి భుజం మీద నిద్రపోతున్న బాబుని అందుకుంటూ ''వచ్చావా తల్లీ ! నువ్వు గుంటూరు వెళ్ళి పోయావని చెప్తే చెప్పులైనా విడవకుండా తిరిగి ప్రయాణం అయింది పిచ్చిపిల్ల'' అంది రేణుక తల నిమురుతూ

లీల భుజాల చుట్టూ చేతులువేసి ప్రభావతమ్మ దగ్గరకు నడిచి ''ఆంటీ ! లీలని నిజంగా నా చెల్లెలులాగే భావించాను చదువు వంకతో ఇన్నాళ్ళు మీకు దూరంగా ఉంచి మిమ్మల్ని బాధపెట్టాను కారణం, ఆమెలో అంకురించిన భయంకర వ్యాధికి ఆమె గురి కాకూడదని, ముందుగా చెప్తే తల్లిదండ్రులుగా మీరు, ప్రాణమిత్రులుగా రేణు భరించలేరని ఆ భయంకర నిజాన్ని దాచిపెట్టి చదువు వంక పెట్టి హైదరాబాదు టి బి ఆస్పత్రిలో చేర్పించాను జయకి ఆ ఊరు ట్రాన్స్‌ఫర్ కావడంతో రోజూ వెళ్ళి చూస్తుండమని, లీల అధైర్య పడకుండా నేను కూడా తరచుగా వెళ్ళే వాడిని నిజం తెలిస్తే రేణు బాధపడడమేకాక నోరు జారి మీతో చెప్తే నా ప్రయత్నాలన్నీ వృథా అవుతాయనిపించి మౌనం వహించాను అందుకే తను అన్నిసార్లు కూడా వస్తానని అన్నా మొండిగా నిరాకరించాను కానీ, రేణు నన్ను అపార్థం చేసుకుంది'' ఆగాడు రఘు

''అవునమ్మా ! రఘు అంతగ పట్టుబట్టి ఉండకపోతే నేనింత శ్రద్ధగా వైద్యం చేయించుకునేదాన్నే కాదు ఇక్కడి ఈ గొడవ లన్నీ చెప్తే నేను బాధపడ్తానని తను లోలోపల బాధపడుతూనే నాకు ఏవేవో ఇక్కడి కబుర్లు చెప్పేవాడు బ్రతుకుమీద ఆశలు కల్పించి, భవిష్యత్తుపై తీయని ఊహలు రేపాడు అన్నగారి మాట పాలించే లక్ష్మణునిలా, జయ నాకు ధైర్యం చెప్తూ తోడుగా నిలిచాడు ఆత్మీయత పంచి ఇచ్చి నన్ను అలరించాడు అందుకే మీ అనుమతితో, ఆశీర్వాదంతో అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను,''

''నా తల్లీ ! నీలో నువ్వే ఎంత బాధ పడ్డావేమిటమ్మా ?'' దుఃఖం ఆగలేదు ప్రభావతమ్మకి

''ఏమ్మా ఇంకేం ఫరవాలేదని చెప్పారా డాక్టర్లు ?'' అడిగారు విశ్వనాథంగారు ఆదుర్దాగా

''అవును నాన్నా నేను పరిపూర్ణ ఆరోగ్యవంతురాలినయ్యానని చెప్పాకే పెళ్ళికి ఒప్పుకున్నాను ''

''చాలమ్మా ఇన్నాళ్ళు మమ్మల్ని బాధ పెట్టినా ఇప్పుడు ఇంత సంతోషవార్త చెప్పావు మాకు వెయ్యేనుగుల బలం వచ్చింది రేపే శాస్త్రిగార్ని పిలిపించి ముహూర్తం పెట్టిస్తాను రంగరంగ వైభవంగా నీ పెళ్ళి జరిపిస్తాను,'' ఆనందాశ్రువుల్ని భుజంమీద ఉన్న తువ్వాలుతో

ఒత్తుకుంటూ జయరావ్ దగ్గరకు వచ్చి ''నాయనా! లీలని కోడలుగా చేసుకుంటానన్న మీ నాన్న మాట నువ్వు నిలబెడుతున్నావా?'' అన్నారు

సమాధానంగా చిన్నగా నవ్వాడు జయరావ్

రఘు జయ భుజంమీద చెయ్యేసి నొక్కుతూ ''నాకు చాలా సంతోషంగా ఉందిరా'' అన్నాడు

తల్లి చేతుల్లో నుంచి తప్పించుకుని రఘు గదిలోకి వెళ్ళింది లీల

కిటికీ దగ్గర నిలబడి రెండు చేతులతో ఊచల్ని గట్టిగా పట్టుకుని, ఆ చేతులమీద తలానించి బయటికి చూస్తోంది రేణుక ఆమె హృదయం పశ్చాత్తాపంతో కుమిలిపోతోంది

మెల్లగా దగ్గరకు వెళ్ళి భుజమ్మీద చెయ్యేసి ''రేణూ!'' ప్రేమగా పిలిచింది లీల

''లీలా!'' గట్టిగా కౌగలించుకుని మెడ ఒంపులో మొహం దాచుకుంది రేణు

''ఛ! ఊరుకోవే పిచ్చీ! నిన్ను తనకి దక్కకుండా చేశానని ఆ వెంకటేశం నీ మనసుని కలుషితం చేశాడు ఆ మాటలు నమ్మి నువ్వూ

అనురాగ తరంగాలు

బాధపడ్డావు రఘుని బాధ పెట్టావు రేణూ! నీ జీవితంలో నిప్పులు పొయ్యడానికే రఘుతో నీ పెళ్ళి జరిపించాననుకున్నావా? అన్నీ తెలిసిన నేను అంత నీచానికి పాల్పడతానని ఎలా అనుకోగలిగావే? నువ్వు నాకున్న ఒక్కగానొక్క ప్రాణ మిత్రురాలివి రఘు నాకు అత్యంత ఆప్తుడు, ఇదివరకు అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నమాట నిజమే కానీ, అతని మనసులో నాకున్న స్థానమేమిటో తెలిశాక ఆ అభిప్రాయాన్ని నా మనసులో నుంచి తుడిచిపారేశాను ఇప్పుడు రఘు అంటే అభిమానం, ఆత్మీయత, గౌరవం తప్ప మరో నీచభావం నా మనస్సులో మచ్చుకికూడా లేదే అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ నిండు నూరేళ్ళూ మీరిద్దరూ పిల్లాపాపలతో సుఖంగా సంతోషంగా ఉండాలన్నదే నా కోరిక ''

''లీలా! ఉన్నతమైన నీ అభిప్రాయాల ముందు, విశాలమైన నీ మనసు ముందు నేను చాలా అల్పురాలినే మనస్ఫూర్తిగా నన్ను క్షమించవే''

''రేణూ! నిన్ను నేను క్షమించడం ఏమిటే? కాబోయే తోటికోడలివి అక్కవి ఒకరి అభిప్రాయాల్ని ఒకరు గౌరవించుకుంటూ నిన్నమొన్నటిదాకా వున్నట్టు ఒకే ప్రాణంగా, ఒకే మాటగా ఎప్పటికీ కలిసిమెలిసి ఉండాలి ఒకే''

''ఒకే! లీలా!'' తన చేతుల్లో ఉన్న లీల చేతిని పైకెత్తి పెదవులకి ఆనించి ముద్దు పెట్టుకుని తృప్తిగా నవ్వింది రేణుక

గుమ్మం బయట తచ్చాడుతున్న రఘుని చూసి ''ఏయ్! నీ కటాక్ష వీక్షణాల కోసం మీ ఆయన బయట కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు ఇంకా నీతో ఇలాగే కబుర్లు చెప్తూ కూర్చుంటే బొత్తిగా మేనర్సు తెలియనిదాన్నని తిట్టుకుంటాడు'' చిలిపిగా నవ్వుతూ రేణుక గడ్డంపట్టి ఊపి బయటికి వచ్చి తన గదిలోకి వెళ్ళి తెలతెలవారబోతూంటే కాసేపు నడుము వాల్చింది లీల


* * *

పెళ్లి పందిరంతా కోలాహలంగా ఉంది ఆడంబరంగా పెళ్ళి చేసుకోవడం తన కిష్టం లేకపోయినా వారి మనసు నొప్పించిన కారణంగా తల్లిదండ్రుల సరదాలను కాదనలేకపోయింది ఒక్కగానొక్క కూతురు పెళ్లి అనుకుంటూ దేనికీ వెనుకాడకుండా వచ్చిన వాళ్ళందరూ ముక్కున వేలేసుకునేలా ఏర్పాటు చేయించారు విశ్వనాథంగారు ఇంటికి వేసిన కొత్త సున్నం వాసన, పచ్చి మామిడాకుల వాసనతో పిండి వంటల ఘుమ ఘుమలు జత కలిసి మత్తుగా, మైకంలో ముంచి తేల్చుతున్నాయి రంగు రంగుల విద్యుద్దీపాల కాంతి రకరకాల పట్టుచీరల మీద, రాళ్ల నగల మీద ప్రతిఫలిస్తూ నవ్య కాంతులను వెదజల్లుతున్నాయి రఘు, రేణు పెళ్లి పందిరంతా తామే అయి ప్రతి పనిలోనూ మేము ఉన్నాం అన్నట్టు కలయతిరుగుతున్నారు

రఘు చేత నియమింపబడిన వారు వచ్చిన అతిథుల్ని సాదరంగా ఆహ్వానించి వరుసక్రమంలో కూర్చోబెట్టి మరీ మర్యాదలు చేస్తున్నారు ప్రముఖ రచయిత్రి లీలారాణి వివాహానికి పబ్లిషర్సు నుండి, పత్రికాధిపతుల నుండి, అభిమానుల నుండి గ్రీటింగ్స్ కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి కొంతమంది ముఖ్యులు స్వయంగా వచ్చి అభినందనలు తెలియజేస్తున్నారు ఆమె ఆధ్వర్యంలో దిన దినాభివృద్ధి చెందుతున్న శరణాలయం, హైస్కూలు, నర్సింగ్‌హోమ్ తిలకించి తమ ప్రశంసలను అందజేస్తున్నారు

దివినుంచి భువికి దిగివచ్చిన అపర రతీదేవిలా అలంకరింపబడింది లీల, రేణుక చేతుల్లో ఆమెకు సరిజోడీ అనుకునేలా ఠీవిగా, దర్జాగా ఉన్నాడు జయరావ్ బుగ్గన చుక్క, పంచె కట్టు, ఉత్తరీయంతో మహా అవస్థపడిపోతూంటే, ముత్తయిదువలు వెంట రాగా హంస గమనంతో కళ్యాణ మండపంలో అడుగు పెడుతున్న లీల అతన్ని చూసి ముసిముసిగా

సంక్రాంతి ముగ్గు —మారేమండ వాణి




పాఠకుని పేజి

తొలి మహిళా జడ్జి !

కేరళ రాష్ట్రం అలనాడు బ్రిటిషువారి హయాంలో ట్రావెన్కూర్ – కొచ్చిన్‌గా వున్న రోజులలో ఫాతిమా బీవీ అనే ముస్లిమ్ వనిత న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నారట ఈమె ఆ రాష్ట్రపు మొట్ట మొదటి స్త్రీ న్యాయ శాస్త్ర పట్టభద్రురాలట ఈవిడను యీనాడు దేశానికి స్వాతంత్ర్యము వచ్చాక కేరళ హైకోర్టులో ఎడిషనల్ జడ్జిగా ప్రభుత్వం నియమించిందట ఈవిడ భారతదేశపు తొలి మహిళా న్యాయమూర్తి అట

ఏకాగ్రత పెంచే చీకటి !

కొన్ని ఎలుకలకు త్రాగుడు మప్పి, వాటి మీద చేసిన ప్రయోగాలలో ఎలుకలు చీకటిగా వున్న ప్రదేశంలో వున్నపుడు ఎక్కువగానూ, వెలుతురున్న చోట తక్కువగానూ త్రాగడం కనిపెట్టారట శాస్త్రజ్ఞులు దీనివల్ల చీకటిగా వున్నపుడు ప్రాణి తన సర్వేంద్రియాలనూ, తను చేస్తున్న పనిమీదే కేంద్రీకరించి, ఆ పనిని చక్కగా, మెండుగా నిర్వహించగలుగుతుంది అనే విషయం కనుక్కున్నారట అందుకే కన్యా కుమారిలో వివేకానందుని కొండమీద నున్న ప్రార్థనా మందిరంలో గదంతా చీకటిగా చేసి, ఒకచోట కొద్ది వెలుగులో ఓంకారాన్ని వుంచుతారుకాబోలు ఇంత చెప్పనేల ! బీరు (వగైరా) త్రాగు బారులలో లైట్ల వెలుతురు తగ్గించి చీకటి చీకటిగా ఏర్పాటు చేయుటలేదా !– ఎందుకు !! అధిక లాగుడుకే !



ప్రియునితో కలిసి భర్తని హతమార్చిన సీతమ్మ !

పెదకాకానికి చెందిన సీతమ్మ అనే వో సాధ్వి తన భర్తతో అయిదేళ్ళు కాపరం చేశాక, ఆమెకు అదే వూరుకు చెందిన రామస్వామి అనే యువకునితో పరిచయమై, అది స్నేహంమీదుగా, ప్రేమమీదుగా అక్రమ సంబంధంగా స్థిరపడిందట ఈ సంబంధం అయిదు సంవత్సరాలు గోప్యంగా వుంచినా, వోనాడు వారిద్దరూ కామక్రీడలలో వుండగా ఆమె భర్త లక్ష్మయ్య చూసి, ఆమెను చితకబాదాడట దాంతో ఆమె ఎదురుతిరిగి భర్తను చితకతన్ని, తన ప్రియుని సహాయంతో ఆతని నోట్లో గుడ్డలు కుక్కి, పీక పిసికి చంపి, ఆతని శరీరాన్ని గోనిబస్తాలో పెట్టి గుంటూరు ఛానల్ కాలువలో పడేసిందట

దక్షిణాఫ్రికాలో వికృత రూపం ధరిస్తున్న జాతి విచక్షణ !


దక్షిణాఫ్రికాకు చెందిన 19 ఏళ్ళ రానీ జోహన్సేన్ అనే శ్వేత జాతీయుడు తన పుట్టిన రోజు కొత్త రకంగా చేసుకోదలచి, ఎవరూ, ఎన్నడూ చేసుకోని, చేసుకోలేని విధంగా వుండాలని దారి పొద్దున్నే కాసి, ఆ దారిన పోయే వో నల్లజాతి వానిని చంపి, ఆనక బర్త్‌డే కేకు కోశాడట ఈ హత్య పోలీసులు విచారిస్తుండగా నేనే చంపానని వెళ్ళి లొంగిపోతే చంపింది తెల్లవాడూ, చచ్చింది నల్లవాడూ గనుక కోర్టు ఆతనికో యాభై రోజులు లాంఛన కారాగార శిక్ష విధించిందట – ఆహా ! వేరీజ్ మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి !

అందుకు సంతోషించండి !

ద్వారక (అలనాటి ద్వారకే) లో ఒకాయన 1960 జూలై 18వ తేదీన రాసిన పోస్టుకార్డు విసుగులేక పయనించి, 1983 నవంబరు 28వ తేదీకి జామ్‌నగర్ ఎడ్రసుదారుని చేరిందట ఈ విషయంలో మాట్లాడిన వో పోస్టలు అధికారి అలనాడు పోస్టుకార్డు అయిదు పైసలే! ఇప్పటి ధర ప్రకారం డ్యూ (రావాల్సినది) మేము వసూలు చేయాలేదు అన్నారట – ఆహా ! ఇదా సంజాయిషీ !

ఆనకట్టలలో దిట్ట !

ఆనకట్టల రికార్డులో మన భారతదేశానికి చక్కని స్థాయి వున్నదట ప్రపంచంలో అత్యధిక ఆనకట్టలు కట్టిన దేశాల జాబితాలో మన దేశానికి చక్కని చోటున్నదట మన దేశమిప్పటికి 1554 పెద్ద ఆనకట్టలు కట్టిందట అవేకాక, చిన్న చిన్నవి, బుజ్జి బుజ్జివీ అన్నీ చేర్చి, వీటి కంతటికీ యిప్పటికి పదివేల కోట్ల రూపాయలు వెచ్చించిందట–ఆహా !



ఆలస్యానికి అపరాధం !

యు యస్ కు చెందిన మెక్సికో నగర శాంతాఫి కోర్టు ప్రసిడెంటుగారు సెషన్సుకు అయిదు నిముషాలు ఆలస్యంగా వచ్చారట అది ఆయన మన్నించరాని నేరంగా ఎంచి, తనకు తానుగా 50 డాలర్ల ఫైను వేసుకుని, వెంటనే అపరాధాన్ని చెల్లించి, రసీదు తీసుకున్నారట –

అనర్థానికి దారితీసిన అక్రమ సంబంధం !

ధర్మపురికి చెందిన చిన్నతప్పై అనే గ్రామంలో 30 ఏళ్ళ తూమన్ అనే అతను ముగ్గురు పిల్లల తండ్రయివుండీ సిట్టాండ అళ్ళి అనే గ్రామానికి చెందిన మల్లి అనే ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకుని, భార్య 25 ఏళ్ళ మంగళాన్ని చితక బాదనారంభించాడట ఈ అసలు కథ తెలిసిన మంగళం మనస్సు రాయి చేసుకుని 5 ఏళ్ళ, 3 ఏళ్ళ రాజప్పన్, సెల్వరాజ్, 2 ఏళ్ళ యువరాజ్ అనే ముగ్గురు పిల్లలనూ నూతిలో పడేసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుందట

పొగడ చెట్టుక్రింద ఇనుపకుర్చీ వేసుకుని వారపత్రిక తిరగ వేస్తోంది సింహళ. ఆ రోజుతో పరీక్షలు ఆఖరు. బి.ఏ. ఫైనలియర్ పరీక్ష రాసి వచ్చింది. వస్తూ కిళ్ళీ షాపులో వారపత్రిక కొనుక్కుని మరీ వచ్చింది.

అందులో ఆమె అభిమాన రచయిత 'నవీన్' సీరియల్ నవల ప్రారంభం. అందుకే ఆ వారపత్రిక ప్రత్యేకించి తను స్వయంగా వెళ్ళి తెచ్చుకుంది.

అన్నీ అలావుంచి తనకి కావలసిన సీరియల్ చదవడం ప్రారంభించింది. అందులో లీనమైన ఆమె గేటు తీసుకుని లోపలకు వస్తున్న స్నేహితురాళ్ళని గమనించనేలేదు.

కొత్త సీరియల్

జొన్నలగడ్డ

"హల్లో! సింహళా! మనుషుల ఆగమనాలుకూడా అర్థం కానంత దీక్షగా నవల చదువుతున్నావు. ఏమిటి నీ అభిమాన రచయిత ప్రారంభ నవలేనా?" అంటూ భుజంమీద చెయ్యివేసి మరీ అడిగింది స్వప్న.

ఆ మాటతో ఉలిక్కిపడి చూసింది ఆమెవంక.

ఎదురుగా స్వప్న - ఆమె ప్రక్కన సమత

వేళగాని వేళలో అదీ తన అభిమాన రచయిత నవల సీరియల్ చదువుతున్న సమయంలో వచ్చిన ఆప్త మిత్రురాళ్ళే అయినా అప్పుడు వచ్చినందుకు, వచ్చి డిస్టర్బ్ చేసినందుకు మండిపోయింది సింహళకి

అయినా తమాయించుకుని "ఏమిటి! ఇలా వచ్చారు?" అని అడిగింది

"ఏంలేదులే! పరీక్ష ఎలా రాశావు అడుగుదామని" అంది స్వప్న

"నా పరీక్ష కేంలే! నేను బాగానేరాశాను" అంది సింహళ

"క్లాసు వస్తుందా?"

"ఆ! రావచ్చు"

"పిక్చరుకు వస్తావా?"

"సారీ! మా ఫాదర్ వూళ్ళో లేరు" అంది తప్పించుకుంటూ

"మీ అమ్మగారిని అడగరాదా!"

"అడగవచ్చులే! నాకు మా నాన్నగారి దగ్గర వున్న చనువు అమ్మ దగ్గర లేదు" అంది నవ్వుతూ సింహళ

"అయితే ఈ రోజు రానంటావు అంతేగా?"

"అంతే మరి"

అంతవరకూ ఒక్కమాట మాట్లాడని సమత మటుకు గ్రహించింది, సింహళకి తమతో మాట్లాడాలని లేదని

"పద స్వప్నా! పాపం సింహళ నవల చదువుకుంటోంది మనం వచ్చి డిస్టర్బ్ చేస్తే ఏం బాగుంటుంది? వాళ్ళ నాన్నగారు వచ్చాక అడిగి వస్తానందిగా!" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా ముందు తను నడిచింది బయటికి

స్వప్నకి ఎప్పుడూ సామాన్యంగా ముక్కుమీద వుంటుంది కోపం అందుకని సింహళ ముభావానికి ముందే మనసులో కోపం రాజుకుంటోంది దానికి తగినట్లే సమత పదమని చెప్పడంతో ఇంక ఆలస్యం చేయకుండా గబగబా ఆమె వెనకే వచ్చింది బయటికి వస్తూ—

"సింహళకి ఉన్నంత పొగరు ఎవరికీ వుండదు" అంది మంటగా

"ఏదోలే! పుస్తకంలో పడితే అంతే! లేకపోతే తను నవ్వుతూ ఎన్ని జోక్స్ వేస్తూ చెబుతుంది కబుర్లు" అంది సర్దివేస్తూ సమత

దానికి స్వప్న ఘాటుగా జావాబిచ్చేదే! కానీ అప్పుడే సందుమలుపు తిరుగుతున్న వ్యక్తిని చూసేసరికి ఆమె కోపం మంచులానే కరిగి పోయింది

"హల్లో! స్వప్న?" అంటూ పలకరించబోయిన అతని ముఖం సమతని చూసి మాడిపోయింది

"ఏమిటి! ఇద్దరూ ఇక్కడ ప్రత్యక్షమయ్యారు?" అని అడిగాడు నవ్వుతూ

స్వప్న అతనికేసి ఒక చిన్న చిరునవ్వు విసిరింది సమత ముఖంలోనూ ఆనందం వెల్లివిరిసినా అది అతనికి అవసరం లేదు అతనికి కావలసింది స్వప్న చిరునవ్వు మటుకే!

స్వప్న యదార్థంగా చెప్పవలసి వస్తే చాలా అందమైనది ఆమె ముందు సమత ఏమంత అందమైందిగా కనిపించదు

"ఇక్కడ మా ఫ్రెండ్ సింహళ వుంది గదా! దాని కోసం వచ్చాము" అని స్వప్న జవాబిచ్చింది

"అలాగా! రండి. అలా హోటల్‌కి వెళ్ళి కాస్త కాఫీ త్రాగుదాము." అన్నాడు అమలేశ్వర్.

"వద్దు! కావాలంటే మీరిద్దరూ వెళ్ళి రండి" అంటూ సమత అటు సందు మలుపు తిరగబోయేంతలో —

"ఇది ఎప్పుడూ ఇంతే! కాస్త కాఫీ త్రాగితే ఏం పోయిందీ? అసలే సింహాళ మంచినీళ్ళన్నా ఇవ్వకుండా పంపిందయ్యే." అంది విసుగ్గా స్వప్న.

కాని సమతకి అమలేశ్వర్ సంగతి బాగా తెలును. అతని ఆర్థిక పరిస్థితీ తెలుసు.

అందుకే తెగించి అతనితో హోటల్‌కి వచ్చి ఇబ్బంది పెట్టదలచుకోలేదు.

సమత సమాధానంగా చిన్న చిరునవ్వు విసిరి అతని జవాబు — స్వప్న విసుగును లక్ష్య పెట్టనట్లు "టాటా" అంటూ ఇంటి ముఖం పట్టింది. ఇంటికి వచ్చేసరికి తండ్రి పరాత్పర రావు వీధిలో పచార్లు చేస్తూ కనిపించాడు.


లోపల పెరట్లో బోరింగ్ పంపు క్రింద శ్రైనుగా బిందెలు — బక్కెట్లు పేరుస్తోంది సమత తల్లి ప్రసన్నలక్ష్మి.

లలితాదేవి

వర్షం

ప్రారంభం!

"ఆగమ్మా! నేను వచ్చానుగా! ఆ పని నేను చూస్తాలే. నువ్వు కాసేపు రెస్టు తీసుకో" అంది సమత.



ఆ మాటకి ప్రసన్నలక్ష్మి ముఖం ప్రసన్నంగా మారిపోయింది..

ఒకసారి తృప్తిగా చూసుకుంది కూతురి వంక.

"ఫ్లాస్కులో కాఫీ వుంది తాగావా ?"

"తాగుతాలే ! ఫ్లాస్కులోనే వుందిగా" అంటూ అన్నింటినీ నీటితో నింపసాగింది.

సరిగ్గా అదే సమయంలో స్వప్నతో హోటల్‌లో కాఫీ సేవిస్తున్నాడు అమలేశ్వర్.

"అమల్ ! టిఫిన్‌కూడా తెప్పించరాదా ! ఒట్టి కాఫీ యేం బాగుంటుంది" అని అడిగిన స్వప్న మాటలకు పచ్చి వెలక్కాయ పడినట్లయింది అమలేశ్వర్‌కి.

అతని జేబులో వున్నది రెండురూపాయలు.

రెండు కాఫీలతో సరిపెట్టాలనుకున్నాడు. టిఫిను — కాఫీ రెండు అంటే తన పని ఆఖరే !

హోటల్‌వాడికి షర్టు విప్పతీసి అక్కడ పెట్టిరావాలి. లేదా ఓ గంట కూర్చుని పప్పన్నా రుబ్బిపెట్టాలి.

ఈ రెండూ తనవల్ల కాదు !

ఆ సమయంలో ముందుగానే వెళ్ళిపోయిన సమతని మనసులోనే మెచ్చుకున్నాడు. ఆమెకూడా వుంటే తన పనీ మరీ ఇరుకునపడేది. సరే : అదలా వుంచితే, ముందీ స్వప్న ముందు తన పరువు పోకుండా వుండే తరుణోపాయం ఏమిటి ? అన్న ఆలోచనతో బుర్ర హీటెక్కిపోయింది.

రెండు ప్లేట్లు ఇడ్లీ — అంటూ ముందు ఆర్డరిచ్చాడు.

స్వప్న ముఖం వికసించింది. అవి తెచ్చి ముందు పెట్టాడు సర్వరు.

" తీసుకో " అంటూ ఆమె ముందుకు జరిపాడు అమలేశ్వర్.

అమలేశ్వర్ సమతకు స్వయానా బావ.

మారేడు దళం

బి. ఏ. ఫైనలియర్ పరీక్ష రాసి వచ్చాడు అతను కూడా.

తన కంటే రెండు సంవత్సరాలు పెద్ద అయిన అతన్ని మనసారా ఆరాధిస్తోంది సమత.

కాని అతను మటుకూ స్వప్నని మనసులో నిలుపుకుంటున్నాడు. ఆ విషయం ముందుగా పసికట్టింది సమతే!

అందుకే తన మనసు అతనికి తెలియకుండా జాగ్రత్త పడింది.

ఇడ్లీ చాలా తాపీగా తినసాగాడు అతను. మూడు క్షణాల్లో ముగించింది స్వప్న.

ఆమె మళ్లీ ఏం చెప్పకుండా "ఒక కాఫీ" అని తనే ముందు అన్నాడు అమలేశ్వర్.

"అదేమిటి ? కాఫీ నీకువద్దా ? " అని అడిగింది స్వప్న.

" నేనసలు తాగే బయటకి వచ్చింది. " అంటూ తప్పించుకోబోయాడు.

"ఇంకానయంలే, టిఫిన్ తిన్నాక కాఫీ తాగకపోవడం ఏమిటి ? " అంటూ రెండు కాఫీ చెప్పేసింది స్వప్న.

సర్వరు నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

పిడుగు నెత్తిన పడనే పడింది అనుకున్నాడు అమలేశ్వర్— డబ్బు దండిగా జేబులో లేనప్పుడు గరల్ ఫ్రెండ్స్‌ని కాఫీకి ఆహ్వానించడం అంత బుద్ధి తక్కువ పని మరి ఒకటి లేదనుకుని మనసులోనే లెంపలు వేసుకున్నాడు. ఏ ఆపద్బాంధవుడు అడ్డుపడి ఒక రూపాయి డబ్బిస్తాడా? అన్నట్టు అటూ ఇటూ దిక్కులు చూడసాగాడు.

ఇంతలో అతని మొర ఆలకించినట్లు వినోద్‌బాబు ఆ బల్లదగ్గరకే వచ్చి స్వప్నని చూస్తూనే "హల్లో ! బ్యూటీ క్వీన్ ! ఇక్కడున్నావా ?" అంటూ పలకరించేసరికి ఉబ్బి తబ్బిబ్బయిపోయింది స్వప్న.

"మీరిక్కడ కూర్చోండి" అంటూ అతి మర్యాదగా అతన్ని ఆహ్వానించి తను కూర్చున్న సీటులో అతన్ని కూర్చోపెట్టి మెల్లగా పక్కకి తప్పుకుని అట్నించి అటు వీధిలోకి జారుకున్నాడు అమలేశ్వర్.

వినోద్‌బాబు పర్సు ఎప్పుడూ పచ్చ కాగితాలతో కళకళలాడిపోతూ ఉంటుంది. అలాగే అతని ముఖం కూడా డబ్బుంది కనుక లక్ష్మీ కళతో వెలిగిపోతూ వుంటుంది.

ఖరీదైన డ్రస్సు— చేతికి గోల్డు రిస్టువాచి— తిరగడానికి ఒక కారు అతని స్టేటస్‌ని చాటుతూ వుంటాయి.

ముఖ్యంగా అతనికి ఎదుటివాళ్ళనిమాటలతో ఆకాశానికి ఎత్తగల చాతుర్యం వుంది.

ఆ చాతుర్యంతోనే ఇప్పుడు స్వప్నని తన వైపు తిప్పుకోవాలని అతని తాపత్రయం.

"అప్పుడే ఏం కాఫీ ! ఏం తిన్నారు ?" అని అడిగాడు సర్వరు తెచ్చిన కాఫీ చూసి.

"ఆ ! ఏడుస్తూ రెండు ఇడ్లీ తెప్పించాడులే అమర్‌గాడు" అంది గోంగూరకాడలా విరిపారేస్తూ స్వప్న.

"వాడంతేలే !" అని సర్వరుని చూసి "ముందు రెండు స్వీట్స్ పట్రా" అంటూ ఆర్డరిచ్చాడు.

"స్వీటెందుకు ?" అని అడిగింది స్వప్న.

"స్వీటులేని టిఫిన్, టిఫిన్ క్రిందకి లెక్కేరాదు నా దృష్టిలో."

"అయితే మీకు తీపి అంటే ఇష్టమా !"

"ఆ ! తీపి పిండివంటలంటే ఇష్టం ! మీలాంటి స్వీట్ గరల్స్ అంటే మరీమరీ ఇష్టం" అన్నాడు నవ్వుతూ.

స్వప్న కూడా తియ్యగానే నవ్వింది.


బిల్లు బెడద నించి బయటపడిన అమలేశ్వర్ మళ్ళీ వెనక్కి తిరిగి చూడకుండా ఇంటికి వెళ్ళిపోయాడని, ముచ్చట్లలో పడిపోయిన ఆ యిద్దరూ గమనించనే లేదు.

2

తన అభిమాన రచయిత నవీన్ అడ్రసు సంపాదించింది సింహాళ. వెంటనే అతనికి ఉత్తరం రాసింది.

శ్రీ నవీన్‌బాబుగారికి !

నమస్తే ! మీ నవల వారపత్రికలో వస్తున్న సీరియల్ 'సంధ్యాదీపం' ఇప్పటికి మూడు వారాలనించీ చదువుతున్నాను. నవల బిగినింగు— దానిలోని పాత్రపోషణ బ్రహ్మాండంగా వున్నాయి. ఇలాంటి నవల నేనింత వరకూ చదవ లేదంటే నమ్మండి. మీ నవలలంటే నాకు చాలా చాలా ఇష్టం. మీరు రాసిన నవలలన్నీ బోరు పోకుండాఇంతవరకూఅన్నీ చదువుతూనే వున్నాను.



నవ్వుకుంది ఎర్రంచు తెల్లని పట్టుచీర, నడుముకి వడ్డాణం, చేతులకి బంగారు గాజుల మధ్య బంగారు తళుకులీనుతున్న గాజుగాజులు దోసిలిలో కొబ్బరి బొండాం, పొడుగ్గా అందంగా కత్తిరింపబడిన గోళ్ళకి నైల్ పాలిష్ వంకీలు, మెడలో మూడుపేటల చంద్రహారాలు, ఎర్ర రాళ్ళనెక్లెను, చెవులకి జాలరి దుద్దులు, బుగ్గన చుక్క, కళ్ళకి నిండుగా, అందంగా తీర్చి దిద్దబడిన కాటుక, గుండ్రని బొట్టు, తలమీద పాపిడిపట్టీ, చంప స్వరాలు, పూలజడ, కాలి అందెలు చిరుసవ్వడి చేస్తూ ఉండగా వచ్చిన లీలని కొత్తగా వింతగా చూస్తున్నాడు జయరామ్

నామకార్థంగా తెరని పట్టుకున్నవాళ్ళు దాన్ని వదిలేసి కబుర్లు చెప్పుకోవడం చూసి హెచ్చరించాడు పురోహితుడు తాత్కాలికంగా ఇద్దరి మధ్య తెర, తారాస్థాయిలో వినిపిస్తున్న బ్యాండుమేళం


రక్షాబంధనం, జీలకర్ర బెల్లం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు ఇలా ఒక్కొక్క కార్యక్రమం జరుగుతూంటే ఒక్కొక్క వింత అనుభూతికి గురి అవుతోంది లీల

తను ఎన్నో నవలల్లో ఇటువంటిసన్నివేశాల్ని ఎంతో రమ్యంగా చిత్రించింది కానీ అవన్నీ ఊహలు మాత్రమే కానీ, ఇది స్వానుభవం జన్మ జన్మలకు మరపురాని, మరువలేని మధురఘట్టం రకరకాల భంగిమల్లో ప్రతి అంశాన్నీ కెమెరాలో బంధిస్తున్నారు ఫొటోగ్రాఫర్లు అడుగులో అడుగేసి, అతని చిటికెనవ్రేలు అందుకుని హోమం చుట్టూ ఏడడుగులు వేస్తూంటే ఏడేడు లోకాల్లో విహరిస్తున్న భావన తను రిజిష్టరు మ్యారేజీ చేసుకోవాలనుకుంది తల్లి దండ్రులు పట్టుబట్టి ఉండకపోతే తను ఇంతటి దివ్యానందాన్ని మిస్ అయ్యేదికదా! కళ్ళెత్తి కృతజ్ఞతా పూర్వకంగా తల్లిదండ్రుల వైపు చూసింది సృష్టిలోని ఆనందం, సంతోషం అంతా వారి కళ్ళల్లోనే ఉన్నట్లు అనిపించి ఇన్నాళ్ళు వారి నెంత బాధ పెట్టాను అనుకోగానే లీల కళ్ళు చమర్చాయి

"ఏమిటే?" మోచేత్తో పొడుస్తూ "పెళ్ళి పీటలమీద కూడా ఆలోచనలేనా తల్లీ! నీకు పుణ్యముంటుంది గానీ, నాలుగు రోజుల పాటు ఆ ఆలోచనల్ని నీ దరిదాపులకీ కూడా రానివ్వకు పాపం! మా మరిది ఇందాకట్నుంచి నీ వైపు చూడలేక మహా అవస్థ పడుతున్నారు" అంది రేణుక


"చాల్లే సరసం!" చిరుకోపంతో అంది

"లేకపోతే ఏమిటే? ఇంతమంది మధ్యలో కూర్చుని కుదురుగా ఉండక ఏవేవో ఆలోచిస్తే ఎలా?" అంది



తలనిండా తలంబ్రాలు ఇరుక్కుని, మెడలో దండతో, వాటి మధ్య మంచి మిలమిలా మెరుస్తున్న మంగళసూత్రాల జంటతో ఏదో కొత్తగా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా ఉంది లీల

అంకితం



విద్యా గౌరవ విరాజితులు
సుజన వందనులు,
పాండిత రంజనులు
స్వర్గీయ శ్రీ గోపావఝుల
సూర్యనారాయణ మామగారి
శ్రీచరణ సన్నిధికి,

భక్తితో
—భవాని

పతీసమేతంగా వెళ్ళి అరుంధతీ నక్షత్రాన్ని దర్శించి నమస్కరించింది తిరిగి లోపలికి వస్తూ "ఇవన్నీ మూఢాచారాలు అనుకుంటాం గానీ, ఇవి ఆచరించేటప్పుడు ఎంత తీయని అనుభూతి కలుగుతుంది" అనుకుంది భర్త వెంట అడుగులో అడుగేసి నడుస్తూ తల్లి దండ్రుల దగ్గరకు వెళ్ళి పాదాభివందనం చేసింది లీల

"పెళ్ళికుమార్తె తండ్రి విశ్వనాథంగారు తమ కుమార్తెను, అల్లుడినీ ఆశీర్వదిస్తూ పసుపు కుంకుములుగా, తమ యావదాస్తిని బహూమతిగా ఇస్తున్నారు" పురోహితుడు మంత్రం చదువుతూంటే తన చేతిలోని కాగితాన్ని లీల చేతిలో పెట్టారు విశ్వనాథంగారు

నోట మాటరాక "నాన్నా!" ఆయన ఎదమీద వాలిపోయింది లీల

"ఛ! ఊరుకోమ్మా ఇది కంట తడిపెట్ట వలసిన సమయం కాదు ఎప్పటికైనా ఇదంతా నీదే కదా! అసలు నేను ఇంత ఆస్తి సంపాదించి నదే నీ కోసం అందుకే నీకు ఇచ్చేశాను" అక్కున చేర్చుకుని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు విశ్వనాథంగారు

ఆ దృశ్యం చూసిన రఘు కళ్ళు చెమర్చాయి

"ఒరే విస్సూ! అమ్మాయిని ఏదో పరాయి ఇంటికి పంపిస్తున్నట్లు ఏమిట్రా అది?" విశ్వనాథంగారిభుజం తట్టారు వీరరాఘవులుగారు

"ఇది బాధ కాదురా సంతోషం" అన్నారు విశ్వనాథంగారు పెళ్ళి అలంకరణతో మిసమిస లాడుతున్న కూతుర్ని, అల్లుణ్ణి తనివితీరా చూస్తూ

[అయిపోయింది]

సంక్రాంతి ఆచార

మకర సంక్రాంతి పర్వదినం తెలుగువారికి అత్యంత ప్రియమైన సుదినం. ఉత్తర భారతంలోకన్నా దక్షిణ భారతంలో ఈ పండగల వాడుకల వేడుకలు యెక్కువ. రైతులు అంతకు పూర్వం శ్రమించిన పంటలన్నీ యిళ్ళకు చేరి వారికపరిమితానందాన్ని కూరుస్తున్న కారణాన తెలుగునాట ఈ పండగను 'పంటల పండుగ' అని వ్యవహరిస్తారు. ప్రతి సంవత్సరం జనవరి 14వ తేదీ తప్పకుండా, సూర్యుడు మకర రాశిలో చేరిన యీ శుభ దినాన యీ పండగ వస్తుంది. తేదీ ప్రకారం యేటా జరుపుకునే పండగలో సంక్రాంతికి అగ్రేసరమైన స్థానం వున్నది. ఆబాల గోపాలానికి వినోదోల్లాసాలను కూర్చటంలో దీనికిదే సాటి. పితృదేవతలకు తర్పణము విడుచుటచే దీనిని 'పెద్ద పండుగ' అనికూడా అంటారు.

భారతదేశం సువిశాలమైన దేశం. అనేక ప్రాంతాలతో, జాతులతో అలరారే ప్రాంతం. అందుచేత సంక్రాంతి పండగనాటి ఆచార్య వ్యవహారాల మౌలిక లక్ష్యం ఒకటే యైనప్పటికీ నిర్వహణ విధానంలో వ్యత్యాసాలు వుంటాయి. ఏది యేమైనా 'దారులు వేరయినా గమ్యమొక్కటే' అన్న భావంలో సంక్రాంతి పండగ ఐహికాధ్యాత్మిక ప్రయోజనాలకూడలిగా వున్నది. దక్షిణ ప్రాంతంగా చెప్పబడే ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో ఈ పండగనాటి ఆచార వ్యవహారాలలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. తమిళనాడు దీన్ని "పొంగల్" అన్న పేరుతో పిలుస్తారు. క్రొత్త బియ్యం, బెల్లంతో పొంగలి చేసి యింటింటికి పంచిపెడతారు. బొమ్మల కొలువుల పేరంటాళ్ళ నేర్పరచి, పెద్ద ముత్తయిదువలను గృహిణులు సన్మానిస్తారు. కొన్ని ప్రాంతాలలో కన్యలను గూడ పూజించే ఆచారం వున్నది. దీనికి భిన్నంగా తెలుగుదేశంలో పేరంటాలలో పిల్లలకు భోగిపళ్ళు పోసి వారికి మంగళహారతులిచ్చి, ఆశీర్వదిస్తారు. పిల్లలు దైవ స్వరూపులని తెలుగువారి భావం.

తెలుగుదేశంలోనే అంతర్భాగంగా వుండి రాయలసీమగా పరిగణించబడే ప్రాంతాలలో జరిగే సంక్రాంతి వేడుకలకు కోస్తా ప్రాంతాలలో జరిపే వేడుకలకు కొంత భిన్నత వుంటుంది. కోస్తా ప్రాంతంలో కనుపించే భోగిమంటలు యిక్కడ కనబడవు. సంక్రాంతి

సంక్రాంతి శోభ — ఫొటో : దుర్గ – బాబు.




B మురళీకృష్ణారెడ్డి సమర్పించు
కృష్ణా ఆర్ట్ క్రియేషన్స్
తాండవ కృష్ణుడు
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
పి.చంద్రశేఖరరెడ్డి B.A.,
నిర్మాత బి.గోపాలరెడ్డి
కథ నిర్వహణ ఓ.ఆర్.చెన్నారెడ్డి
నిర్మాణత కె.ఆర్.ఆనంద్
సంగీతం చక్రవర్తి, ఫొటోగ్రఫీ వి.యస్.ఆర్.స్వామి మాటలు పరుచూరి బ్రదర్స్ ఆర్ట్ అంకిరెడ్డి కళ అచలం

జయాపజయాలు తామరాకు మీద నీటి బిందువులు మాత్రమే!

— శోభన్‌బాబు



రాజారాం మెహతా నగరంలో ప్రశాంతమైన బంగళా మేకప్‌కు ముందు విజిటర్స్‌తో కొన్ని నిమిషాలు గడపడం శోభన్‌బాబు దిన చర్యల్లో ఒకటి ఆగంతులను ఆప్యాయంగా పలకరించడం ఆయన సుగుణాల్లో ఒకటి

★ "మీ పుట్టిన రోజున మీకేకాక అందరికి పండుగే," అన్నాను ముందుగా శుభాకాంక్ష లందజేస్తూ

ఆయనమందహాసంతో "అన్ని ఋతువుల్లోకి శీతాకాలం అంటే నా కెంతో ఇష్టం నా ఒంటికి కూడా ఆ శీతోష్ణస్థితి బాగా సరిపోతుంది ఆ మూడు మాసాల్లో ఉన్నంత ఉల్లాసంగా మిగిలిన మాసల్లో నాకు ఉండనే ఉండదు నాకు అన్నివిధాల ఇష్టమైన ఈ ఋతువులోనే నా జన్మదినమైన సంక్రాంతి కూడా ఇమడడం అదృష్టం అంతకు మించిన ప్రత్యేకతను ఆపాదించను," అన్నారు

ఆ తర్వాత వివిధ విషయాలమీద మా సంభాషణ కొనసాగింది

★ కొత్త సంవత్సరంలో కొత్త నిర్ణయం

"మరి కొంత విశ్రాంతిగా వృత్తిని కొనసాగించాలని అంతే!

★ నటించిన చిత్రం విజయం సాధించినప్పుడు

"పదేళ్ళ క్రితం వరకు జయాపజయాలకు సంబంధించిన అలజడి నాలోనూ ఉండేది ఇప్పుడు జయానికి చలించేదిలేదు అపజయానికి ఉలిక్కిపడేది అంతకంటే లేదు తనను తాను తెలుసుకునే స్థితిలోకి ఇప్పుడిప్పుడే ప్రవేశం పొందగుగుతున్న నాకు జయాపజయాలు తామరాకుమీద నీటి బిందువులు మాత్రమే ఒకటో రెండో చిత్రాలు ఫెయిల్ అయినంత మాత్రాన స్థిరపడిన నటుడికి కొంప మునిగేదే ముండదు అనవసరంగా కొంతమంది నటీనటులు కంగారు పడతారు వాళ్ళమీద వాళ్ళకు నమ్మకం తక్కువైనా అయ్యుండాలి, లేదా— వాళ్ళ ఆశలకు అంతైనా లేకుండా ఉండాలి ఉదాహరణకు శ్రీ దిలీప్‌కుమార్‌ను చూడండి నాగేశ్వరరావుగారిని చూడండి రామారావుగారిని చూడండి నలభై ఏళ్ళుగా ఎన్నో విజయాలు చూశారు, అంతకు మించిన అపజయాలూ చూశారు ఇంకా అలాగే ఉన్నారు, చెక్కు చెదరలేదు వాళ్ళు నిజమైన హీరోలు చెప్పకోకూడదుగాని, మనదీ అదే సాంప్రదాయం మరో పదిహేనేళ్ళు నాకూ ఈ దంపుడు తప్పేట్టు లేదు

★ నటనా వైదుష్యాల్ని ప్రదర్శించడానికి అనువైన మంచి పాత్ర లభించినప్పుడు

"మంచి పాత్రలు ఎవరి దృష్టిలో? మనం తీస్తున్న చిత్రాలు సామాన్య మానవుని కోసం అతన్ని దృష్టిలో పెట్టుకుని సృష్టించిన మంచి పాత్రయ్యుండాలి నూటికి కోటికి ఎప్పుడో ఎక్కడో— మల్లెపూవులెన్ని మసలుతున్న పొదరిళ్ళలో?"



శోభన్‌బాబు 'పుణ్యంకొద్దీ పురుషుడు'

★ కొన్ని పాత్రల విషయంలో ఒక్కోసారి రాజీపడక తప్పదేమో!

"జీవితమే ఒక పెద్ద సంధానం సంధి ప్రయోగం సంధి చేసుకోలేకపోతే మనుగడేలేదు ఇక ఆఫ్టరాల్ నట జీవితం ఎంత? బుద్బుద ప్రాయం మరీ మాట్లాడితే బురద బురద ప్రాయం

★ ధరించే పాత్రల గురించి ఇంటివద్ద కూడా ఏదైనా కృషి

"పాత్రను గురించిన ఆలోచన ఆ పాత్ర దుస్తులు ధరించిన తర్వాతనే దుస్తులు తీసిన తర్వాత ఆ పాత్రను స్టూడియోలోనే వదిలేస్తాను ఇంటికి తీసుకెళ్లను ఇంటి దగ్గర డబుల్ రోల్స్—భార్యకు భర్తగా, బిడ్డలకు తండ్రిగా!"

★ ఒకే మూసలో తయారయినట్లుండే కొన్ని చిత్రాలలోని మీ పాత్రలపై వ్యాఖ్య?

"నిజమే కాని, ఎవరు మాత్రం ఏం చేయగలరు? ప్రజల్లో నూటికి ఎనభైమందికి పైగా మేమెప్పుడూ ఒకేలా ఉండి, ఒకేలా నటిస్తేనే ఇష్టపడతారు కాస్త మీసం పెంచితే కూడా వాళ్ళు సహించలేక పోతున్నారు వాళ్ళంతే మనమింతే!"

'బావా మరదళ్ళు' శోభన్‌బాబు, సుహాసిని



★ ఒకే నాయికతో పలు చిత్రాలలో నటించడం పట్ల

"నాకు నచ్చితే ఏదైనా అంతే నచ్చిన కథానాయిక విషయమూ అంతే!"

★ కొన్ని చిత్రాలలో వయసు మీరిన పాత్రలు ధరిస్తున్నప్పుడు అనుభూతులు

"నిజానికి నేను ముసలి పాత్రలు వేసిన చిత్రాలే ఎక్కువ శాతం విజయవంతమయ్యాయి ఒకే మూసలో పోసి తయారవుతున్న యువ నాయక పాత్రలకంటే, పస ఉన్న ముసలి పాత్రల పోషణలోనే తృప్తి ఉంది. ఉదా "తాసిల్దారుగారి అమ్మాయి, వంశగౌరవం, కోడళ్ళొస్తున్నారు జాగ్రత్త, తోడు–నీడ, ప్రతీకారం" చిత్రాలు పెరుగుతున్న వయసుకు భయపడి జారుకునే మనస్తత్వం కాదు నాది ప్రకృతిని మనసారా ఆహ్వానించి నిండుగా బ్రతకడమే నా జీవిత లక్ష్యం

★ ఇంతకీ, కలలు నిజమవుతాయంటారా?


"కావు అసలు నటుడ్ని అవుతానని కలలో కూడా అనుకోలేదు కలలు అలల్లాంటివి ఊగికే చెదిరిపోయే వాటిని నమ్ముకుని బ్రతకడం అవివేకం పిరికితనం

★ జీవితంలో ఏదైనా తీరనిలోటు లాంటిది

"అవును గత ఇరవై మూడేళ్ళుగా నా పర్సనల్ ప్రైవసీని కోల్పోయాను– నేను పబ్లిక్ ఫిగర్ అవడం వల్ల ఇది మామూలు లోటు కాదు, పెద్ద లోటు "

ఇంతలో వారి పర్సనల్ మేకప్ ఆర్టిస్టు అప్పారావు మేకప్ రూం నుంచి తొంగి చూడడం గమనించాను "మీరిక నటుడుగా మారడానికి వేళయినట్లుంది," అని సెలవు తీసుకుని, బయలుదేరాను

—ఇంటర్ వ్యూ : జి వి జి.



'కోటేశ్వరుడు'లో గుమ్మడి, అక్కినేని, సుజాత

సినిమా విశేషాలు



—జి.వి.జి.

తాతినేని ప్రసాద్ దర్శకత్వంలో మోహన్ బాబు ద్విపాత్రాభినయం

"ఫిబ్రవరి 4న పాటల రికార్డింగ్ ముహూర్తం అదే నెల 15 నుంచి మార్చి 15 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు తాతినేని ప్రసాద్ ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో కె ఎల్ ఎస్ ఎస్ రామచంద్రరాజు నిర్మించే ఎ ఆర్ ఆర్ పిక్చర్స్ చిత్రంలో మోహన్ బాబు, సుజాత, భానుప్రియ ఆదిగాగల వారు పాల్గొంటారు వేటూరి గీతాలు, రాజా–కోటి సంగీతం, నాయని మహేశ్వరరావు కూర్పుతో కె వెంకట్రామరాజు కథకుడు, సమర్పకుడు

'ఇద్దరు దొంగలు'లో రాజ్యలక్ష్మి, నూతన్ ప్రసాద్, కృష్ణ, శోభన్ బాబు



మద్రాసులో

శ్రీ ఎన్.టి.ఆర్. చూసిన సినిమా!

మన ముఖ్యమంత్రి నవంబర్ 14న మద్రాసుకు విచ్చేసినప్పుడు ఒక ఆంగ్ల చిత్రాన్ని చూడాలని కుతూహల పడ్డారు ఆనాడే 'కాదంబరి' ప్రీవ్యూ థియేటర్లో ఆ చిత్రాన్ని దర్శించి, వెంటనే హైదరాబాద్‌కు పయనమయ్యారు ఆ చిత్రం పేరు "గ్రిల్"

విజయ బాపినీడు దర్శకత్వంలో ఎ. సారథి చిత్రం

"సుమన్ హీరో," అన్నారు నాగార్జున ప్రొడక్షన్స్ అధినేత ఎ సారథి ఈయన "గోపాలరావుగారి అమ్మాయి, పక్కింటి అమ్మాయి, ముగ్గురమ్మాయిలమొగుడు" అనంతరం త్వరలో ప్రారంభించే చిత్రానికి విజయ బాపినీడు దర్శకుడు

సంక్రాంతి



"మా ప్రాంతాల్లో సంక్రాంతికి 'బతకమ్మ పండుగ' అని కూడా అంటూంటారు. మామూలుగా పేడ ముద్దల మీద గుమ్మడి పువ్వులు పెడితే, మా ప్రాంతాల్లో, బంకమట్టి ముద్దల మీద రకరకాల పువ్వులు పెట్టడం ఆచారం. స్నేహితురాండ్రతో గొబ్బిళ్ళు పాడుతూ వాటి చుట్టూ ప్రదక్షిణలు చేసేవాళ్లం. ఆ సాయంత్రం గాలిపటాలు ఎగరేసేవాళ్ళం. ఎంతకాలమైందో ఆ వేడుకలు చూసి! ప్రతి సంక్రాంతికీ మా ఊరికి వెళ్లి ఆ సరదాల్లో పాల్గొనాలనుకుంటూంటాను. ఎప్పుడు వీలవుతుందో ఏమో మరి!"


— మాధవి



"సంక్రాంతి ముగ్గులు పెట్టిన ఓ అమ్మాయి పెద్దయ్యాక కలెక్టర్ అయిందట. అందుకని మా అమ్మమ్మ నా బాల్యంలో ప్రతి సంక్రాతికీ నాచేత ఎన్నో ముగ్గులు పెట్టించి, వాటి మధ్య అరటాకులో పొంగలిని పెట్టించేది చివరికి నేను సినిమా స్టార్ని అయిపోయాను."

— సుహాసిని

"భోగి పండక్కి చుట్టుపక్కల వాళ్ళిళ్ళ పెరట్లోంచి పాత సామానులు చల్లగా కాజేసి, వాటినంతా వేకువఝామునే ఒక చోట చేర్చి, చలిమంటలు కాసుకునే రోజుల్లో ... అంటే, నేను 'రంగులరాట్నం' చిత్రంతో సినిమారంగ ప్రవేశం చేసి 'సాగర సంగమం' లో మీ అభిమానాన్ని అందుకున్నప్పటికి ఎన్నో ఏళ్ల క్రితం జరిగిన సంఘటన ... ఒకసారి ఎన్నో చాపలు, తాటాకులు, బుట్టలు, కొయ్య సామానులు ప్రోగుచేశాం. వాటిని మోసు కెళ్తుంటే, దారిలో ఓ రౌడీ దాపరించాడు. బాగా తాగి ఉన్నాడేమో — వాటినంతా అక్కడే పడేసి మమ్మల్ని వెళ్లిపొమ్మని కత్తితో బెదిరించాడు. అప్పుడు మేమంతా కుర్రాళ్ళం కదండీ! భయపడి, వాడు చెప్పినట్లే చేశాం. బిక్కు



బిక్కుమంటూ దూరంగా వెళ్లి కూర్చున్నాం. మేం పడేసిన వాటినంతా తగులబెట్టి ఆ రౌడీ చలికి హాయిని అనుభవిస్తుంటే మా ఒళ్లు మండిపోతోంది. ఓ వంక చలికి వొణికిపోతూనే ఉన్నాం. ఇంతలో మసక చీకటిలో ఎవరో కుర్రాళ్లు ఓ పెద్ద నిచ్చెనను ఆపసోపాలు పడుతూ, మోసుకెళ్తున్నారు. "బాబ్బాబూ! మీకెంతైనా పుణ్యముంటుంది. ఆ నిచ్చెనను ఇక్కడే తగలెట్టెయ్యండి. చలికి చస్తున్నాం," అని కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలి, ఆ నిచ్చెనను ముక్కలు ముక్కలుగాచేసి తగలెట్టాం. అరగంటసేపు హాయిగా చలి బాధను మరిచాం. ఆ తర్వాత నేను మా ఇంటికి వెళ్లి, పెరట్లో చూసేసరికి డాబా పక్కన ఉండవలసిన నిచ్చెన కనిపించలేదు. 'అయ్యో! మా నిచ్చెనను నేనే భోగిమంటల్లో వేశానా!' అని బాధపడ్డాను. ఈ విషయం మా పెద్దలకు తెలిస్తే, డొక్క చీరేస్తారు. అంచేత, గప్‌చిప్‌గా ఉండిపోయా. అది జరిగి ఇప్పటికి ఎన్ని సంక్రాంతులు దొర్లిపోయాయో!"

— పొట్టి ప్రసాద్

నూతన వత్సరారంభంలో మరో చైతన్యవంతమైన మాదాల చిత్రం "జనం — మనం"

బలహీన వర్గాలపై దురన్యాయాలను గర్హిస్తూ విప్లవ చిత్రాలతో ధ్వజమెత్తిన నవతరం సంస్థ చిత్రాలలోని పాటలను గత ఎన్నికల్లో కొన్ని రాజకీయ పార్టీలు వినిపించి, శ్రోతలను ఆకట్టుకున్నాయి మళ్ళీ అలాంటి సంచలనాత్మక గీతాల రికార్డింగ్‌ను నవతరం పిక్చర్స్ జనం — మనం" చిత్రం కోసం జనవరి మొదటి తారీఖున మొదలెడుతున్నట్లు కథకుడు నిర్మాణ సారథి మాదాల రంగారావు తెలియజేశారు చక్రవర్తి సంగీతం, చౌదుల సుబ్బారావు కూర్పు, ఎం నాగేశ్వరరావు నిర్వహణతో మోహన్‌దాస్ స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను వహిస్తారు

కె. ఎస్ రెడ్డి దర్శకత్వంలో "పాతాళభైరవి"

'జనవరి నుంచి మార్చి వరకు మూడు షెడ్యూల్స్‌లో పూర్తిగా ఔట్‌డోర్‌లోనే షూటింగ్ జరుగుతుంది,'' అన్నారు కె ఎస్ రెడ్డి ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో గుండా సత్యనారాయణ సమర్పించే మనోజ్ ఆర్ట్ క్రియేషన్స్ 'పాతాళభైరవి'' చిత్రానికి ఎస్ ఎన్ ఆర్ ఆంజనేయులు నిర్మాత విజయరాజ్ కథ చంద్రశేఖర్ సంగీతం, కె ఎస్ మణి ఛాయ, కొండపనేని రామలింగేశ్వరరావు శిల్పం, నాయని మహేశ్వరరావు కూర్పు, ఎస్ ఎ రంగారావు సహకార దర్శకత్వంతో నిర్మాణ సారధ్యం వహించే జయప్రసాద్ "జనవరి మొదటి వారంలో పాటలు రికార్డవుతాయి,'' అని తెలిపారు

కొత్త దర్శకుని పరిచయం చేసే కొత్త సంస్థ విజయభేరీ మూవీస్

'మా దర్శకుడు రాజశేఖరరెడ్డికి దర్శకత్వ శాఖలో పన్నెండేళ్ళ అనుభవం ఉంది,' అన్నారు నిర్మాత టి విజయభాస్కరరెడ్డి ఈయన తొలి చిత్రానికి డిసెంబర్ 9న తొలిగీతం రికార్డ్ చేయబడింది శివకృష్ణ, సుమలత, రంగనాథ్, దీప, నూతన్‌ప్రసాద్, డాక్టర్ శివప్రసాద్, రాజ్‌వర్మ, అన్నపూర్ణ వగైరా నటవర్గం పరుచూరి సోదరులు కథ, మాటలను సమకూర్చారు చంద్రశేఖర్ సంగీతం, ఎ లక్ష్మణ్ ఛాయ, రంగారావు శిల్పం, అంకిరెడ్డి కూర్పుతో ఈ చిత్రాన్ని సమర్పించే ఆర్ సత్యనారాయణ రాజు 'జనవరి 1 నుంచి 13, ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు రెండు షెడ్యూల్స్‌లోనే షూటింగ్ ముగుస్తుంది,'' అన్నారు



'డిస్కో కింగ్'లో అనుపమ

కృష్ణ హీరోగా సత్యచిత్ర చిత్రం

''మార్చి, ఏప్రిల్, మే నెలల్లో 20–30 తారీఖుల మధ్య మూడు షెడ్యూల్స్‌తో షూటింగ్ ముగుస్తుంది,'' అన్నారు పర్వతనేని సాంబశివరావు ఈయన దర్శకత్వంలో సత్యనారాయణ, సూర్యనారాయణ నిర్మించే చిత్రంలో కృష్ణ సరసన నవనటి ఊర్వశి నాయిక సత్యనారాయణ, రావుగోపాలరావు, గుమ్మడి ఇతర ముఖ్య భూమికలు పోషిస్తారు కథ, మాటలను పరుచూరి సోదరులు, సంగీతాన్ని కె వి మహదేవన్ సమకూరుస్తారు

యార్లగడ్డ రాజ్యలక్ష్మి వెంకన్న చౌదరి కళాపీఠం అవార్డులు

వివిధ రంగాలలో ప్రతిభావంతమయిన సేవ చేస్తున్న పదిమంది ప్రముఖ వ్యక్తులకు ప్రతి సంవత్సరం శ్రీ యార్లగడ్డ రాజ్యలక్ష్మి వెంకన్న చౌదరి కళాపీఠం ఇస్తున్న అవార్డులు ఈ సంవత్సరం కూడా ప్రకటించింది ఆ పదిమంది ప్రముఖ వ్యక్తుల పేర్లు ఇవి

నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ రాజా రామమోహనరావు, పార్లమెంటు మెంబరు శ్రీ ఆర్ రామకృష్ణన్, ప్రముఖ జర్నలిస్ట్ డాక్టర్ ఏ ఎస్ రామన్, ప్రముఖ నటుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, కళాప్రపూర్ణ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పి ఎల్ సంజీవరెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత, సహజకవి శ్రీ ఎం ఎస్ రెడ్డి, కల్పాక్కం అటమిక్ విద్యుత్ కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ మైనేని హరిప్రసాద్, పెరంబూరు రైల్వే హాస్పిటల్‌కు చెందిన గుండె చికిత్సా నిపుణులు డాక్టర్ చెరియన్, అడయార్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి శాంత, తిరుచ్చికి చెందిన ప్రముఖ క్లారినెట్ విద్వాంసులు శ్రీ ఎ కె సి నటరాజన్

వీటితోపాటు ప్రతి సంవత్సరం ఇచ్చే మహానటి సావిత్రి మెమోరియల్ అవార్డు ఈ సంవత్సరం మహానటి, నట విశారద శారదకు లభించింది



''మా డైరెక్టరుగారు ఏ సీను తీసినా గొప్ప వెరైటీగా వుంటుంది!''

రాజాచంద్ర దర్శకత్వంలో ఎస్. గోపాలరెడ్డి కొత్త చిత్రం "పెళ్ళయ్యాక చూడు"

''నా మొదటి చిత్రం 'మనిషికో చరిత్ర' రెండవ చిత్రం 'ముక్కుపుడక' పక్కా కుటుంబ కథా చిత్రాలు మూడవ చిత్రం క్రయిమ్ ఎలిమెంట్ ఉన్న 'అపరాధి' డిసెంబర్‌లోనే విడుదల చేస్తున్నాను జనవరి 10న ప్రారంభించే 'పెళ్ళయ్యాక చూడు' తిరిగి కుటుంబ కథా చిత్రమే,'' అన్నారు భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ అధినేత ఎస్ గోపాలరెడ్డి ఈ కొత్త చిత్రంలో సుమన్, భానుప్రియ నాయకా నాయికలు రాజాచంద్ర దర్శకుడు

'గూండా'లో రాధ, చిరంజీవి, చక్రపాణి అన్నపూర్ణ, సత్యనారాయణ, వరలక్ష్మి



హీరో హరిప్రసాద్ నిర్మించే చిత్రం

''స్త్రీ కథాంశ చిత్రం,'' అన్నారు ''శివరంజని'' చిత్రంద్వారా దాసరిచే పరిచయం గావింపబడిన హరిప్రసాద్ ఈయన గత ఏడాది జయదేవి అనే తమిళ నిర్మాత, నటిని వివాహం చేసుకున్న విషయం పాఠకులకు విదితమే ''కథను ఎన్నుకోవడంలో, దాన్ని తెరకు అనువదించడంలో, సంగీత నృత్యాలలో చక్కని ప్రవేశమున్న మా ఆవిడనే దర్శకత్వం వహించమని ప్రోత్సహించాను,'' అన్నారు హరిప్రసాద్ ఈయనతోపాటు మోహన్ మరో కథానాయకుడు సరిత నాయిక తులసి ఆర్ట్స్ బానర్‌లో డిసెంబర్ 15 నుంచి షూటింగ్ జరుగుతోంది

ఆంధ్రసచిత్రవారపత్రిక

1983 ఫిలిం బ్యాలట్ పత్రం

1 ఉత్తమ చిత్రం

2 ఉత్తమ నటుడు

3 ఉత్తమ నటి

4 ఉత్తమ దర్శకుడు

5 ఉత్తమ సంగీత దర్శకుడు

6 ఉత్తమ సహాయ నటుడు

7 ఉత్తమ సహాయ నటి

8 ఉత్తమ హాస్యనటుడు

9 ఉత్తమ హాస్యనటి

ముగింపు తేదీ
4-2-'84

సినిమా

ఎ. ఎన్. ఆర్. తో వి. బి. రాజేంద్రప్రసాద్ చిత్రం "ఎస్. పి. భయంకర్"

"నాగేశ్వరరావుగారిది చాలా గంభీరమైన, ఉదాత్తమైన, విలక్షణమైన, విశిష్టమైన పాత్ర ఇదివరకు ఆయన పోషించిన పాత్రలన్నీ ఒక ఎత్తు, ఎస్ పి భయంకర్ పాత్ర ఒక ఎత్తు," అన్నారు జగపతి ఆర్ట్ పిక్చర్స్ అధినేత వి బి రాజేంద్రప్రసాద్ తమిళంలో విడుదలైన "వెళ్ళ రోజా" చిత్రం ఆబాలగోపాలాన్నీ విశేషంగా ఆకర్షిస్తోంది అందులో శివాజీగణేశన్ ఆయన కొడుకు ప్రభు పోటీపడి నటించారు దాని ఆధారంగా తయారయ్యే ఈ తెలుగు చిత్రంలో ఎ ఎన్ ఆర్, కృష్ణంరాజు, సురేష్, గొల్లపూడి మారుతీరావు, పి ఎల్ నారాయణ, విజయశాంతి, సిల్క్‌స్మిత ఆదిగాగల వారుంటారు జనవరి 21 నుండి ఫిబ్రవరి 4 వరకు విశాఖపట్నంలో, ఆ తర్వాత హైద్రాబాద్‌లో ఫిబ్రవరి 14 నుండి 29, మార్చి 16 నుండి 26 వరకు జరిగే మూడు షెడ్యూల్స్‌తో షూటింగు ముగుస్తుంది ఆత్రేయ మాటలు, పాటలు రాశారు కె వి, మహదేవన్ సంగీత దర్శకుడు నవకాంత్ ఛాయాగ్రాహకుడు నృత్య దర్శకత్వాన్ని ప్రకాష్, స్టంట్ దర్శకత్వాన్ని మాధవన్, కూర్పును అక్కినేని సంజీవి నిర్వహిస్తారు ★

డిసెంబర్‌లో ఐదు చిత్రాల శతదినోత్సవాలు !

★ ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో మిద్దె రామారావు నిర్మించిన "రామరాజ్యంలో భీమరాజు" శతదినోత్సవం డిసెంబర్ 1న జరిగింది

★ డిసెంబర్ 9న రాజాచంద్ర దర్శకత్వంలో దగ్గుపాటి భాస్కరరావు నిర్మించిన "పండంటి కాపురానికి 12 సూత్రాలు" శతదినోత్సవం జరిగింది

★ నెల్లూరులో డిసెంబర్ 11న కె రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన గోపీ మూవీస్ "శక్తి" వంద రోజుల వైభవం జరిగింది

★ జంధ్యాల దర్శకత్వంలో శశిభూషణ్ నిర్మించిన "మూడు ముళ్ళు" నూర్రోజుల వేడుకలు డిసెంబర్ 19న జరిగాయి

★ బి భాస్కరరావు దర్శకత్వం నెరపిన భ్రమరాంబికా ఫిలిమ్స్ "ధర్మాత్ముడు" శతదినోత్సవం డిసెంబర్ 29న జరిగింది

'జడ గంటలు'లో సురేష్, అన్నపూర్ణ విజయశాంతి



కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతో అంటించిన కవరు జతచేయాలి కాపీ కార్టూన్‌లు పంపరాదు

– సం॥



సీరియల్: గోరంత దీపం

— వింధ్యవాసిని

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ — 6 : 'గోరంత దీపం' రాయలసీమ వార్తా వారపత్రిక ఎడిటర్ విశ్వమూర్తి, ఎం డి పరశురావ్ ప్రాణస్నేహితులు విశ్వమూర్తి కూతురు రమణ అదే ఆఫీసులో పనిచేస్తోంది పరశురావ్ కూతురు కరుణకు ట్యూషన్ చెబుతున్న హరిప్రసాద్ కరుణ సహాయంతో ఆ ప్రెస్‌లోనే ఉద్యోగం సంపాయిస్తాడు మంచి తెలివితేటలు, చొరవ గల హరిప్రసాద్‌కు తన పెద్దకూతురు అరుణను ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించుకొంటాడు పరశురావ్ గతంలో — గుండూరావ్ ప్రెస్‌లో పని చేస్తుంటాడు విశ్వం ఇంట్లో వాళ్లకు తెలియకుండా తమ కులం కాని మీనాక్షిని చేసుకొని ఆ వూర్లో కాపురం పెడతాడు తన స్నేహితుడు పరశురావ్‌ని కూడా తీసుకొచ్చి ఆ ప్రెస్‌లోనే చేర్పించి, తన ఇంట్లోనే ఉంచుకొంటాడు పరశురావ్‌కి చదువు లేకపోయినా వ్యాపారంపై ఆశక్తి ఎక్కువ అందువల్లే క్షణం తీరికలేకుండా ఏవో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుంటాడు గుండూరావ్ కూతురు కామేశ్వరిని పెళ్లి చేసుకొంటాడు పరుశురావ్ తన భార్య మీనాక్షి కాన్పు కష్టం అయి చనిపోగా విశ్వం బెంగుళూరులో వున్న వొక ఆంగ్ల పత్రికలో రిపోర్టర్‌గా చేరతాడు 'గోరంత దీపం' అనే వారపత్రికను పరశురావ్, విశ్వం కలసి నెలకొల్పుతారు హరిప్రసాద్, రమణ ప్రేమించుకుంటారు హరి తన పుస్తకం పబ్లిసిటీ వర్క్‌మీద హైదరాబాదు వెళుతూంటే కరుణ వీడ్కోలు చెప్పను స్టేషన్‌కు వస్తుంది

హరికి గుర్తు తెలిసినంతలో తల్లి రాజ్యలక్ష్మి చాలా అందంగా వుండేది తండ్రి మాత్రం వేరే తన ఈడుపిల్లల తండ్రుల్లా కాక వయసు మీరినట్లు కనిపించేవాడు అతను అప్పుడప్పుడూ వచ్చి తమిద్దరినీ చూసిపోయేవాడు చాలా రోజుల దాకా అతను, అంటే దేవరాజు మిగతావాళ్ల నాన్నల్లాగా తమతో ఎందుకు ఉండడో అర్థం అయేది కాదు వచ్చినప్పుడయినా తనని ఎక్కువగా దగ్గరికి తీయటం అసలు లేదు ఏదో ఒక మాట పలుకరించటమే, అంతే

ఒకరోజు ఓ ముసలాయన తమ ఇంటికి వొచ్చాడు తర్వాత తెలిసింది ఆయన తన తల్లికి తండ్రి అని రాజ్యలక్ష్మి ఆయన్ని పరామర్శించబోతే, కోపంతో ఎగిరిపడ్డాడు ఆయన

''నీకిదేం పోయేకాలమే, ముండమోసిన దానివి మూల కూచోకుండా, ఇలా ఎవరితోనో లేచి వచ్చి మా పరువు తీశావ్ మేము నీకేం తక్కువ చేశామని మా ఉసురు పోసుకుంటున్నావ్ ?''

అందుకు రాజ్యలక్ష్మి ఘాటుగానే సమాధానం చెప్పింది

''నాకేం తక్కువ చేశారో నాకంటే మీకే బాగా తెలుసు కడుపున పుట్టిన కూతుర్నే, డబ్బుకాశపడి రోగిష్టివాడికి కట్టబెట్టింది చాలక, ఆ మనిషి కాస్తా గుటుక్కుమంటే, జైల్లో ఖైదీ కన్నా హీనంగా, నీ కొట్లో పశువు లాగా చూసిన నీకు నేనేం చెప్పితే అర్థమవుతుంది ? ఎందుకిట్లా చేశాను అని అడుగుతున్నావు గద— స్వేచ్ఛగా గాలి పీల్చుకుందామని బయట పడ్డాను నా బ్రతుకు బ్రతుకుతున్నాను ''

''అవునవును నీ బ్రతుకు నువ్ భలే బాగా బ్రతుకుతున్నావు చూస్తూనే వున్నాంగా ? నలభయ్యేళ్ల రెండోపెళ్లి వాణ్ణి కట్టుకుని, ఎంత హాయిగా బ్రతుకుతున్నావో కనిపిస్తూనే వుంది'' ఎకసక్కెంగా అన్నాడాయన నిజానికి పక్కనే వుండి ఈ మాటలన్నీ వింటున్న హరికి అర్థం అయింది తక్కువే కానీ ఆయన తన తల్లిని అవమానంగా మాట్లాడుతున్నాడని మాత్రం తెలిసింది

''నీ కొంపలో కంటే బాగానే ఉన్నాలే మా ఆయన వచ్చేలోగా బయల్దేరు అనక ఏమయినా గొడవ జరిగితే నన్ను తిట్టుకుని లాభంలేదు,'' అని తరిమేసిందాయన్ని

అమ్మకు అంత కోపం రావటం, ఆవిడ అంత పరుషంగా ఎవరితోనూ మాట్లాడటం, అతనెప్పుడగా చూడలేదు ''ఎవరమ్మా ఆయన ?'' అంటూ మెల్లిగా అమ్మ పక్కన చేరాడు హరి

ఆవేళ శనివారం రాత్రి తండ్రి వస్తాడని తెలుసు హరికి మామూలుగా ప్రతీవారమూ ఆయన తెచ్చే స్వీట్స్ కోసం కాచుకుని కూర్చున్నాడు దేవరాజు ఇల్లు చేరగానే పూవుల పొట్లం రాజ్యలక్ష్మికీ, స్వీట్సు హరికి ఇచ్చేసాడు ''ఏరా, రోజూ స్కూలుకి వెళుతున్నావా ?'' అని పలకరించి, తనగదిలోకి వెళ్ళిపోయాడు

అంతే అదొక్కమాటే ఆయన తనతోటి మాట్లాడటం మళ్ళీ వెళ్ళేవరకూ, తనంటూ ఒక మనిషి ఉన్నట్లు కూడా ఆయనకి గుర్తుండదు

కొడుక్కు అన్నం పెట్టేసి చాపవేసి పడుకోబెట్టేసింది రాజ్యలక్ష్మి నాన్న ఒస్తే అమ్మకెన్నో పనులు, ఆయన స్నానానికి నీళ్ళుతోడాలి, అన్నం వడ్డించాలి, దగ్గర కూచుని మాట్లాడాలి, ఇలా ఎన్నో — ఏ ఒక్క పని ఆలస్యం అయినా, ఆయనకి విసుగు తెప్పించినా కేకలేస్తాడని తెలుసు అందుకే అమ్మకోసం నిద్ర నటించి, ఆమె అటు వెళ్ళగానే, కళ్ళు తెరచి, ''నాన్నకి నేనంటే ఇష్టం లేదా ? ఎందుకు నాతో మాట్లాడరు ?'' అని ఆలోచిస్తూ ఉండిపోయాడు చాలాసేపు

అంతేకాదు, తమ ఇంటికి ఇరుగు పొరుగు ఇళ్ళున్నదే దూర దూరంగా వున్నాయి ఆ ఇళ్ళవాళ్ళయినా తమలో తాము సఖ్యంగా వుంటారు కానీ, రాజ్యంతో ఎవరూ కల్పించుకుని మాట్లాడరు ఈ తేడా ఎందుకోకూడా అతనికేమీ అర్థం అయేదికాదు

మెల్లిగా వయసు పెరుగుతున్నకొలదీ పరిస్థితి కొద్దిగా అర్థం అవుతోంది హరికి క్లాసులో తోటి కుర్రాడు మురళి అనేవాడు ఒక రోజు, 'మా నాన్న హరి వాళ్ళమ్మని ఉంచుకున్నాడ్రా'' అని అందరికీ చెబుతున్నాడు

'ఉంచుకోవటం' అంటే ఏమిటో హరికి తెలీదు కానీ కొందరు అర్థం ఆయిన అబ్బాయిలు నవ్వి తనని ఛీత్కారంగా చూడటంతో అదేదో అవమానకరమయిన విషయం కావచ్చుని అర్థం చేసుకున్నాడు ముఖ్యంగా తన తండ్రి 'మురళికీ తండ్రే' అని తెలియటం షాకింగ్‌గా వుంది

ఇంటికి వెళ్ళగానే అమ్మని అడిగేశాడు ''అమ్మా, నాన్న శని, ఆదివారాలు మాత్రమే మనతో ఉంటారేం ? మిగతా రోజులన్నీ ఎక్కడికి వెళతారు ?'' అని కొడుక్కింత హఠాత్తుగా ఈ సందేహం ఎందుకొచ్చిందో అర్థం కాలేదు రాజ్యలక్ష్మికి

''అవన్నీ నీకెందుకు బాబూ ?'' అని తప్పించుకోబోయింది

''మన నాన్ననీ, మా క్లాసులో మురళీ వాళ్ల నాన్న అంటున్నాడు అది కాదమ్మా మరీ ఉంచుకోవటం అంటే ఏమిటి ?'' తను దాచాలనుకున్నా నిజం దాగదని తెలిసిపోయింది ఆమెకి

''అదికాదురా బాబూ ! అక్కడ ఇంకో

అమ్మ అన్నయ్యలు ఉంటారు ఆమె నీకు పెద్దమ్మ అవుతుంది మరి వాళ్ళదగ్గరికూడా వెళ్ళి రావాలికదా నాన్న ?'' అని అతన్నే ఒప్పించ బోయింది

మెల్లిగా తెలుసుకున్నాడు హరి, మరో ఇంట్లో వాళ్ళ నాన్నకి ముగ్గురు పిల్లలున్నారని వాళ్ళలో చివరివాడే మురళి అప్పుడే మురళికీ తనకీ ఉన్న తేడా గమనించాడు వాడు వేసుకునే బట్టలు, చెప్పులు, సంచీ, పుస్తకాలో అన్నీ తన కంటే వేరుగా ఉంటాయి వాడు రోజుకో జత వేస్తాడు మొత్తం పది జతల బట్టలయినా ఉంటాయి అని లెక్కించుకున్నాడు పెన్సిళ్ళూ, పుస్తకాలు రోజూ పారేసుకుంటూ, కొత్తవి తెచ్చుకుంటూ వుంటాడు తనేమో ఎంతో జాగ్రత్తగా వుంటాడు ఏ ఒక్క వస్తువుపోయినా, నాన్న వచ్చేవరకూ వేచివుండాలి, అమ్మదగ్గిర డబ్బుండదు

అతని చిన్నమనసుని పూర్తిగా కదిలించేసిన చిన్న సంఘటన ఒకటి అతడికిప్పటికీ గుర్తు వుంది క్లాసులో పరీక్షల్లో ఫస్ట్ వచ్చాడు, హరి ఆ వారం వాళ్ళ నాన్న వచ్చినప్పుడు, చెప్పాడా విషయం గర్వంగా ''భేష్, ఎప్పుడూ అలాగే ఫస్ట్ రావాలి మరి నీకేదయినా బహుమానం తెస్తాను ఏం కావాలో చెప్పు రేపు బెంగుళూరు వెళుతున్నా'' అన్నాడు

సంతోషంతో ఉబ్బిపోయాడు హరి తనకి అమ్మ కొనిపెట్టే కలాలు, సిరా బుడ్డీలతో విసుగెత్తిపోయింది మంచి పేనా కావాలని ఎన్నాళ్ళుగానో కోరిక ఉంది ఆ మాటే అన్నా డాయనతో ''సరిగ్గా, మురళీ ఇదే అడిగాడు, ఇద్దరికీ తెస్తాలే'' అన్నాడాయన దాంతోనే కొంత అసంతృప్తి కలిగింది హరికి ఫస్ట్ వచ్చిన తనకీ ఏమీ కాలేని వాడికీ ఒకే బహుమతేనా ? అనిపించింది పోనీ, నేను కోరుకున్నది నాకొస్తే చాలు అని సరిపెట్టుకున్నాడు తప్పనిసరి అయినప్పుడు సరిపెట్టుకోవటం అన్నది దానంతటదే అలవాటు అవుతుంది, అన్నిట్లోనూ

మళ్ళీ వారం నాన్న రాకకోసం రోజులు లెక్కబెడుతున్నాడు హరి కానీ ఆయన వచ్చినా బహుమతి విషయం మాత్రం మాట్లాడలేదు హరికి తానే అడిగేందుకు సిగ్గుగా వుంది ఆయనే ఏ క్షణంలోనో చొక్కాజేబులోంచి, తీసి ''ఇదో నీ పేనా'' అంటారని చూసాడు హరి అతను చూస్తూవుండగానే రెండురోజులు అయిపోయినాయి, దేవరాజు వెళ్ళిపోయాడు

ఆయనటు వెళ్ళేక, ''చూడమ్మా ! నాన్న నాకు పేనా తెచ్చి పెడతానని తీసుకురానేలేదు!'' అని అమ్మతో చెప్పి, ఏడ్చేశాడు

''తప్పు నాయనా ! ఇలాంటి వాటికంతా ఏడవచ్చా ఆయనకెన్నో పనులు, మర్చి పోయుంటారు ఈసారొచ్చినప్పుడు నేను చెపుతానులే, సరేనా ?'' అని సముదాయించింది

మరుసటి రోజు స్కూలుకి వెళ్ళాడు మురళిచేతిలో కొత్తపేనా కన్పించింది ''మా నాన్న నా కోసం బెంగుళూరు నించీ తెచ్చారు'' అని గొప్పగా చూపెడుతున్నాడా పొగాకు రంగు, బంగారు కాప్ పేనాని హరికి ఒళ్ళంతా ముళ్ళు గుచ్చినట్లయింది

ఇల్లు చేరగానే, అమ్మదగ్గరకి వెళ్ళి గట్టిగా ఏడ్చేశాడు ''ఎందుకు హరీ, ఏమయింది ?'' అని ఆమె ఎంతగానో బ్రతిమాలేక గానీ హరి మాట్లాడలేదు ''మరే, నాన్న నాకు పేనా తేవటం మరచి పోయుంటారన్నావే నువ్వు ? ఆ మురళీగాడికి మరవకుండా తెచ్చిచ్చాడే అసలాయన మానాన్నేనా ?''

''తప్పు బాబూ, అలా అనకూడదు నీకు తెలీదురా ఆయన దేవుడు కనకే మన మిద్దరం వీధిలో పడకుండా ఇంత మాత్రంగా ఉన్నాము '' అని తనతో బాటుగా ఏడుస్తూ అంటున్న మాటలు అర్థం కాలేదు హరికి ఆయన తన తండ్రే అంటుంది మరి తనకేమీ కానట్లు ప్రవర్తిస్తాడేం ? ఆయనకి ఆస్తీ, వ్యాపారమూ వున్నాయి, బాగా సంపాదిస్తారని అనుకుంటారు అనుకోవడమేమిటి మురళిగాడి మాటలు, వాడి జోరు చూస్తేనే తెలుస్తుంది మరి తమ పరిస్థితి మాత్రం ఇలా ఎందుకుండాలి? ఆయనిచ్చిపోయే డబ్బు ఒకోసారి వారం అంతా సరిపడక, గంజి కాసి ఇచ్చేస్తుంది అమ్మ మరాయన్ని దేముడంటుందేం ?- అనిపించేది

అమ్మ తన్నెప్పుడూ కోపగించదు తను ఆమెకి కష్టం కలిగించే ప్రశ్నలేవీ అడగడు అందుకే మనసులో ఎన్ని ఆలోచనలున్నా, ఎన్ని



గోరంత దీపం

సందేహాలేర్పడినా, అవన్నీ తనలోనే దాచుకునే వాడు

19

దీపావళి పండుగ వచ్చింది పండుగకి వారం ముందునించే, వూళ్ళో అంతా టపాకాయల సందడి జోరుగా వుంది ఆ వారమంతా దేవరాజు రాజ్యలక్ష్మి ఇంటి వయిపురానేలేదు ఇంటి చుట్టూ పిల్లలందరూ, పటాసులు కాల్చుకుంటూ వుంటే, హరికి దిగులుగా వుంది చీకటి పడ్డాక ఒక్కడే గడపలో, చంపలకి చేతులు చేర్చి కూచుని చూస్తూ వుండేవాడు ఇవాళో రేపో, నాన్నొస్తారు, పటాసులు తెస్తారని కొడుక్కి సర్దిచెపుతోంది రాజ్యం దీపావళి వచ్చిందీ, వెళ్ళింది ఆయన రానేలేదు పండుగ రోజంతా కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు హరి తండ్రి మీద చెప్పలేనంత కోపంగా వుంది ఏమయినా సరే ఈమాటు ఇటువయిపు రాగానే నిలదీసి అడిగే యాలని వుంది అతనికి

మూడవరోజు రాత్రికి దేవరాజు వచ్చేడు ఎప్పటిలా స్వీట్ల పాకెట్ అందిస్తే తీసుకోలేదు హరి "నాకవేం వొద్దు పోయిన వారమంతా ఎందుకు రాలేదు ?"

హరి అంత ధైర్యంగా తన్ని ప్రశ్నించటం దేవరాజుకి ఆశ్చర్యంగానూ వుంది, చిరాకునూ కలిగిస్తోంది పోనీ ఏదో కుర్రాడు గదా అని

"ఏదీ పండుగ కదరా ? పనులతో తీరలేదు" నవ్వుతూ అన్నాడు

"ఏం మీ పనులన్నీ ఆ ఇంట్లోనేనా ? ఇక్కడేం వుండవా ? మాకు మాత్రం పండుగ లేదా ?" హరి గొంతు బొంగురు పోతోంది

"అవురా? ఏం జోరుగా అడిగేస్తున్నాడు? ఏమే, కొడుక్కి కొత్తగా పాఠాలేవో నేర్పుతున్నట్లుందే మన్దగ్గిరిలాంటివి కుదరదని తెలీదూ?"

అప్పటికే కొడుకు అడుగుతున్న తీరుకి ఆశ్చర్యపోతూ, ఏం జరుగుతుందో అని భయపడుతూ చూస్తున్న రాజ్యం ఆ మాటలతో బిక్కచచ్చి పోయింది కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుంది "బాబూ!" అంటూ కొడుకును ఆపాలని చూస్తోంది

"ఎందుకడక్కూడదు నువ్వూరుకోమ్మా, నీకు తెలీదు మనం మాత్రం ఆయనకి భార్యాబిడ్డలం కాదూ ? ఎందుకింత హీనంగా చూస్తారు ? ఏం పాపం చేశామని ?"

దేవరాజు కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి మనిషి ఆవేశం పట్టలేక ఊగిపోతున్నాడు "వీడు వేలెడంత వెధవ, నన్ను నిలబెట్టి అడుగుతాడా ? ఇదంతా నా నిర్వాకం కాదూ ? ఉండు వీడి పని చెబుతాను" అంటూ ఆ చెంపా, ఈ చెంపా వాయించి, వంగోబెట్టి వీపుమీద నడ్డి విరిగేలా గుద్దుతున్నాడు రాజ్యం భయంతో వణికి

పోతోంది కొడుక్కి దెబ్బలు తగలనీయకుండా అడ్డుపడబోతే, ఒక్క విసురుతో వెళ్ళి గోడ కరుచుకునేలా చేశాడు అతను

''ఛ! దరిద్రపు సంత ఎర్రగా బుర్రగా ఉందని, వెధవముండయితేనేం అని చేరదీసి నందుకు నాకు మంచి శాస్తి అయింది ఇంతకీ నాకు బుద్ధిలేదు నా పిల్లల ఉసురుకొట్టి ఇట్టాంటి వాళ్లకి ఎంత చేసినా, ఏం కృతజ్ఞత ఉంటుందీ వీళ్లకి ఎప్పుడూ ఎలా పీక్కు తిందామా అనే ఆశే'' గట్టిగా కేకలుపెడుతూ, అలసినట్లుగా వగరుస్తూ, పైపంచ దులిపి వేసుకుని, పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్లిపోయాడు దేవరాజు అదే ఆఖరు మళ్ళీ ఇటువయిపు రానేలేదు

మరుసటి రోజంతా తల్లీ కొడుకూ జబ్బు పడిన వాళ్ళలా పడకల్లోనే ఉండిపోయారు వంట ఒండినదీ లేదు భోజనం చేసిందీ లేదు

అసలే ఈ మధ్యలో కొన్ని రోజులుగా దేవరాజుకి తనమీద మోజు తగ్గిపోతున్నదని తెలుసు రాజ్యలక్ష్మికి అందుకే ఈ దెబ్బతో ఆ మనిషి ఇక తిరిగి రాడని ఊహించ గలిగింది ఆ ఊహతో మరింత నీరసం వచ్చేసిందామెకి

''ఎంత పని చేశావురా నాయనా? ఆయనింక రానేరాడేమో ఇట్టు'' అన్నది కొడుకుతో

''రాకుంటే పోనీయమ్మా వచ్చి ఎవర్నుద్ధరిస్తున్నారని''

''మన జీవనం జరిగేదెలాగురా తండ్రీ మనకి తిండెవరు పెడతారు?''

ఆ వయసులో హరికి అదో పెద్ద సమస్యగా అన్పించలేదు స్కూలు మానేశాడు అవసరమయితే ఎక్కడయినా కూలో నాలో చేయటానికయినా తయారుగానే ఉన్నాడు కానీ ఇంట్లో కొన్ని రోజులకి సరిపడా వెచ్చాలు కొన్నయినా ఉండటంవల్ల గుడ్డిలో మెల్లగా కాలం గడిచిపోతోంది వాళ్ళకి

తన తల్లికి పెళ్ళయి భర్తపోతే, మళ్ళీ ఇంకొకాయనతో వచ్చేసిందని బయట ఎవరో అనుకుంటుంటే తెలుసుకున్నాడు ఆ మాట నిజమేనని, దేవరాజుతో ఘర్షణ పడ్డ రోజు తెలిసింది అసలు జరిగిందేమిటో చెప్పమని అమ్మని అడగాలని ఉన్నా మాట రావటం లేదు అసలే కుమిలిపోతున్న ఆమెని మళ్ళీ పాత కథ అంతా బయటికి తీసి బాధ పెట్టడం ఇష్టంలేదు

ఏమీ తోచక సాయంత్రాలు ఊరి బయటికి ఎంతో దూరం నడిచి వెళ్ళి తిరిగి వస్తుంటాడు హరి ఒక రోజలాగే చీకటి పడేటప్పుడు ఇల్లు చేరాడు వెనకాల పెరట్లో తల్లి, పెద్ద మీసాలు, నల్లగా తుమ్మమొద్దులా, మోటుగా ఉన్న ఒక మనిషితో మాట్లాడుతో వుండటం కన్పించింది

''నువ్వింకా, మా అయ్యగారొస్తారని నమ్మి ఇక్కడనే వున్నావేమో! ఆయనింక ఇటురాడు నీమీద మోజు తీరింది అయినా ఆయనకిదేం ఖర్మ కో అంటే కోటిమంది కన్నెపిల్లల్ని కొనేయగలడు, కావలసివస్తే తక్షణం ఈ ఊరొదిలే దారి చూడు ఆఖరికి తల్లీకొడుకు ప్రాణాలతో అయినా బయట పడతారు,'' అని బెదిరించి అటునించీ అటే వెళ్ళిపోయాడు

ఆ మనిషి భీముడని, మురళి వాళ్ళింట్లో పాలేరు పని చేస్తుంటాడని తెలుసు అతనో ఖూనీకోరనీ, మనుషుల తలల్ని తరిగేయటం సులభంగా చేసేస్తుంటాడనీ చెప్పుకుంటారు

అతను అటు వెళ్ళగానే, కాళ్ళలో సత్తువ లేని దానిలా అలాగే తులసికోటని అనుకుని కూలబడిపోయి, మోకాళ్ళలో తల దూర్చేసుకుంది రాజ్యలక్ష్మి హరి చిన్న మనసు, తల్లి దుఃఖాన్ని చూసి తట్టుకోలేకుండా వుంది ''ఏందుకేడుస్తావమ్మా పద ఈ రోజే వెళ్ళిపోదాం, ఈ పాడు ఊరు వదిలేసి,'' అని ధైర్యం చెప్పాడు ఆమెకి రాజ్యలక్ష్మికికూడా అదే మంచిదనిపించింది


వాళ్ళ ఇంటికి అటువయిపుగా ఉన్న ఒక ఇంట్లో ఉన్నది ఓ వృద్ధ దంపతుల జంట ఆయన ఏదో ఉద్యోగం చేసి రిటయిరయినాడట ఆయనదగ్గిర కొంచెం చేరిక హరిప్రసాద్‌కి ఆయనే వీళ్ళకి తగిన సలహా ఇచ్చేడు నందవరంలో ఉన్న ఒక అనాధ శరణాలయం అడ్రసు ఇచ్చి, మేనేజరుకొక ఉత్తరం రాసి ఇచ్చాడు మేనేజరు ఆయనకి బాగా తెలిసినవాడట వీళ్ళు వెళ్ళి తన పేరు చెబితే ఏదో ఒకదారి చూపిస్తాడని ఆయన నమ్మకం తనే దగ్గరుండి తల్లీ కొడుకుల్ని బస్సెక్కించి పంపించాడు


* * *


శరణాలయం ఆయాగా పని దొరికింది రాజ్యలక్ష్మికి మేనేజర్ గంగాధరం సలహామీద, హరిప్రసాద్ పేరు ఎవరూలేని అనాధగా రిజిస్టర్‌లో నమోదు చేయించింది ఆ విధంగా అతని భోజనం, బట్టలు, చదువుకి అయే ఖర్చులన్నీ శరణాలయంవారే భరిస్తారు తను తల్లినని చెప్పుకొన్నా వాళ్ళు తనకిచ్చే జీతం ముప్పయి రూపాయలతో కొడుక్కేం కొనగలదు? అందుకే అనాధ అని వ్రాయించాల్సి వచ్చినందుకెంత బాధగా ఉన్నా అణిచేసుకుంది


శరణాలయం జీవితం, పంజరంలోంచి బయటపడ్డంత హాయిగా ఉంది హరికి ఒక్కడుగా అమ్మతో ఉండటం కంటే, ఇలా పిల్లలందరితో కలిసి ఉండటం, తినటం, తన ఈడు వాళ్ళతో కలిసి తిరగటం కబుర్లు చెప్పుకోవటం అతనికి బాగా నచ్చింది

దేవునికొండలో అమ్మా, తానూ ఉండగా, యాంత్రికంగా గడిచిపోతూ ఉన్న కాలం–ఇప్పుడు ఎలా గడిచి పోతున్నదీ కూడా తెలియనంత వేగంగా సాగిపోతోంది ఉదయం లేచి అందరూ ముఖాలు కడిగి స్నానాలు చేసుకుని ప్రార్థన మందిరం చేరతారు ప్రార్థన అయిన తర్వాత కొందరు పిల్లలు వంటగదిలో సహాయపడితే కొందరు గదులు, ప్రాంగణం అంతా శుభ్రం చేస్తారు ఇలా ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక పని ఉండనే ఉంటుంది ఎనిమిది గంటలకి తలాకొక జొన్న రొట్టె ఇస్తారు తర్వాతే పనీ చేయనక్కరలేదు కాస్సేపు పుస్తకాలు ముందేసుకుని చదువుకుని, స్కూలు టయిం కాగానే వెళ్ళి పోవటమే మధ్యాహ్నం వచ్చి భోంచేసి వెళతారు సాయంత్రం రాగానే, తలాకొక్క కప్పు టీ దొరుకుతుంది









అందరూ కలిసి తోట పని చేస్తారు, మధ్య మధ్యలో ఆటలు, పాటలు ఏడు కొట్టగానే భోజనం, మళ్ళీ రెండు గంటలసేపు చదువు ఆయినాక వరసగా పడుకుని నిద్రకుపక్రమించటం భోజనానికి ఒక కూరగాయల పులుసో, పచ్చడో చేసి, జొన్న సంకటి ఉడకబెడతారు వారాని కొకసారి ఆదివారం రోజూ, పండుగలకీ మాత్రం బియ్యం అన్నం చేసి, మరొక తాలింపుకూర చేస్తారు హరికి తన ఈడువాళ్ళు నలుగురితో చేరి ఏది తింటున్నా అమృతంలాగే వుంది

ఊర్లో స్కూల్లో, తనకంటే బాగా బట్టలు వేసుకునే వాళ్ళనీ, ఇంటి దగ్గర్నుంచి పైసలు తెచ్చుకుని కొనుక్కుతినే వాళ్ళనీ, అమ్మానాన్నల్నీ అక్కచెల్లెళ్ళు, అన్నాతమ్ముళ్ళనీ గూర్చి గొప్పగా కబుర్లు చెప్పుకునే వాళ్ళనీ చూసి, వాళ్ళతో తనని పోల్చుకుని బాధపడటం తప్పనిసరి అయేది ఇప్పుడా సమస్య లేదు తన చుట్టూ ఉన్న వాళ్ళంతా తనలాంటి వారే పేదా గొప్పా అనే తేడాలు లేవు ఎవ్వరికీ తల్లితండ్రులు లేరు ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలి అన్నమయినా, సంకటయినా ఒకే వరసలో కూర్చుని సమానంగా తినాలి

హరి స్కూలు ఫైనలు మంచిమార్కులతో పాసయినాడు దానికిపైన చదువుకోవాలంటే శరణాలయం బాధ్యత వహించదు తమ దారి తాము చూసుకోవాలి ఎవరయినా

రాజ్యలక్ష్మికి శరణాలయం వారిచ్చే జీతం ఎక్కువ కాకపోయినా, భోజనం అక్కడే దొరకటం చేత, స్వంత ఖర్చులేమీలేక బాగానే డబ్బు మిగుల్చుకుంది అందుకనే ధైర్యం చేసి, కర్నూలు కాలేజీలో చేర్పించింది, కొడుకుని ఒంటరిగా బ్రతకటంలో ఉన్న కష్టనష్టా లేమిటో మెల్లగా తెలిసి వచ్చాయి హరికి

హాస్టల్లో చదివించే శక్తిలేదు రాజ్యానికి మేనేజర్ గంగాధరంగారికి తెలిసిన ఓ గృహస్థుడి

గోరంత దీపం

ఇంట్లో, చిన్నకొట్టులాంటి గది అద్దెకి దొరికింది అందులో ఓ చాప, దుప్పటి, రెండు జతల బట్టలు, నాలుగు చిన్న అల్యూమినియం గిన్నెలు, స్టవ్ ఇచ్చి, కొడుకుని దిగవిడిచి వెళ్ళింది అబ్బాయిని కాస్త కనిపెట్టుకొమ్మని ఇంటివారికే చెప్పిపెట్టింది

తెల్లారే లేచి వంట చేసుకుని వెళితే రాత్రి వరకూ అదే తీసి పెట్టుకుని తినేవాడు అమ్మ పంపే డబ్బుకి తోడు తానూ ఏమయినా సంపాదించుకుంటే బాగుణ్ణు అనుకుని వెతికాడు రోజూ సాయంత్రం ఓ రెండుగంటలు ఒక బట్టలకొట్లో లెక్కలు రాస్తే ఏభయి రూపాయలు ఇస్తామన్నారు మొత్తంమీద ఏ పూటా పస్తుండే అవసరం లేకుండా రోజులు గడిచిపోతున్నాయి

20

రాజ్యలక్ష్మి ఏదో పేరు తెలిని జ్వరంతో నెలరోజులు మంచంలో తీసుకుని తీసుకుని, ప్రాణాలు విడిచేసింది నా కొడుకెలా బతుకుతాడో అన్న దిగులుతోనే చివరి శ్వాస విడిచింది హరికి ఆఖరి చూపయినా దక్కింది కాదు కావలసిన కార్యం అయిన తరువాత కర్నూలు బయలుదేరాడు వెళ్ళేముందు, ''మీ అమ్మ నీ కియ్య మన్నది'' అని ఓ ఉత్తరం ఇచ్చారు గంగాధరం గారు పదిలంగా దాచిపెట్టుకుని తన గది చేరాక తీసి చదువుకున్నాడు

రాజ్యం తానెలాంటి పరిస్థితిలో పుట్టిల్లు వదిలి దేవరాజు వెంట వచ్చేసిందీ వివరంగా వ్రాసి పెట్టింది అందులో హరికున్న చాలా సందేహాలు తీరిపోయాయి దాంతో చివరగా, ''కర్నూల్లోనే 'పరశురాం' అని ఒక పెద్దమనిషి వున్నాడు ఆయన నన్ను చిన్నప్పుడెంతగానో అభిమానించిన అన్నగారు ఆయనకి నా గురించి వివరాలేమీ తెలీవు ఆయనేదో పెద్ద వ్యాపారం చేస్తాడని తెలుసు నాకు నేను పోయిన తరాత నీకు ఏ కష్టము వచ్చిన ఆయన్ని వెతుక్కుంటూ వెళ్ళు నా పెట్టెలో ఉన్న పాత ఫోటో చూపించి, రాజ్యం కొడుకునని చెప్పు ఇందుకు నువేం భయపడనక్కరలేదు ఆయన చాలా మంచివారు నీకు తప్పకుండా సహాయం చేస్తారు'' అని రాసింది,

హరికిది కొత్తగా వుంది తనకూ బంధువు లంటూ వున్నారన్న మాట అనుకున్నాడు వెంటనే వెళ్ళి మామయ్యని కలుసుకుందామా అన్నంత ఉత్సాహం వచ్చేసింది

కొన్ని రోజులు అవస్థపడితే, పరశురాం అండ్ కం ప్రొప్రయిటరే తన మామయ్య అని తెలుసుకోవటం ఏమీ కష్టం కాలేదు హరికి ఆయన కంపెనీ ఆఫీసు, నివసించే ఇల్లు రెండూ బయటినుంచే చూసి వచ్చేశాడు వెళ్ళి ఆయన కనిపించాలంటే ఏదో బెదురు

ఆయనకి అన్నగా చెల్లిమీద ఎప్పుడో ప్రేమ ఉండవచ్చు ఇన్నేళ్ళకి అమ్మ ఇంట్లోంచివచ్చేశాక ఇంకా ఆమె మీద, ఆమె కొడుకు అని తనమీద ఆయనకి అభిమానం ఎందుకుంటుంది? తనున్న హీనపరిస్థితిలో, ఏడెందుకు తగిలాడురా పీడ, అన్నట్లు ఆయన ప్రవర్తిస్తే! అమ్మో! తను భరించలేడు ఒద్దు ఇన్నాళ్ళు అవసరం లేని చుట్టాలు ఈ రోజెందుకు? నా బాధ నేను పడతాను అని మనసు గట్టి చేసుకున్నాడు

అమ్మ దగ్గిర మిగిలిన అంతో ఇంతో డబ్బు తను తెచ్చుకున్నది మెల్లిగా కరిగిపోయింది ఇప్పుడు బట్టల కొట్లో ఇచ్చే యాభయి తప్ప మరో మార్గం లేదు అది ఎందుకూ చాలటం లేదు ఒకోవారం వారం అంతా ఒకపూట భోజనం, అప్పుడప్పుడు బొత్తిగా ఉపవాసం, లేదా ఓ బ్రెడ్డుముక్క, బన్ను రొట్టెలతో రోజులు ఈడుస్తున్నాడు ఇంటి యజమాని అన్నీ గమనిస్తున్నాడు ఆయనకి సహాయం చేయాలని ఉన్నా పెద్ద కలిగిన వాడు కాదు

అన్నట్లు ప్రవర్తించే హరి పడుతోన్న కష్టం చూడలేక, ఊరికే సాయం చేస్తే ఆ అబ్బాయికి ఇష్టం వుండదేమో అని, తన పిల్లలు ముగ్గురికీ ట్యూషను చెప్పమని అడిగాడు

అందుకు ఫీజుగా ఏమివ్వమంటావు అని అడిగితే, వారానికి మూడు రోజులు అన్నం పెడితే చాలని అడిగేశాడు హరి సిగ్గు విడిచి

ఇంటర్మీడియట్ స్టేట్ ఫస్ట్‌గా పాసయాడు హరి ఆ విధంగా మెరిట్ స్కాలర్‌షిప్ సంపాదించుకున్నాడు దాని ప్రకారం, అతని చదువుకీ, హాస్టల్లో ఉంటే ఆ ఖర్చునీ ప్రభుత్వం భరిస్తుంది

అనంతపురం కాలేజీలో డిగ్రీ కోర్సులో చేరాడు హరి అతను హాస్టల్లో చేరిన నెల రోజుల తర్వాత అతని గదిలో మరొక అతను వచ్చి చేరాడు ఆ అబ్బాయే కె హెచ్ వి రావు పూర్తి పేరయితే హయవదనరావు కానీ, అలా చెప్పుకోవటం నామోషీ అయి, చిన్నగా కత్తిరించేసుకున్నాడు అందరూ 'రావు' అనే పిలిచేవాళ్లు అతన్ని

రావు కాలేజీకీ, హాస్టల్‌కీ కొత్త కాదు ఒకోసంవత్సరం రెండేసి సార్లు చదువుతూ ప్రస్తుతం డిగ్రీ మూడవ సంవత్సరంలో ఉన్నాడు విద్యార్థి రాజకీయాల్లో చాలా ప్రాముఖ్యత ఉంది అతనికి

కొందరు సీనియర్ విద్యార్థులు ముందే హెచ్చరించారు హరిని, రావుతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి వుంటుందని కానీ తనకి తన చదువు తప్ప మరో విషయం పట్టదు అందు చేత వాళ్ల మాటలకి అతనేం భయపడలేదు

గదిలో తను చేరేటప్పటికే, అక్కడున్న హరిని చూసి, అమాయకంగా కన్పిస్తున్నాడే కుర్రాడు అని, తనకేమయినా ఉపయోగిస్తాడేమో అనుకుని, తనెప్పుడు బయటికి వెళ్లినా హరిని కూడా రమ్మని ఆహ్వానించేవాడు ఒక గదిలో ఉన్న వాళ్లం, కాస్తయినా స్నేహంగా ఉండాలి కదా అని అప్పుడప్పుడు వెళ్లినా, చాలాసార్లు చదువుకోవాలని చెప్పి తప్పించుకుంటున్నాడు

"ఏమిటోయ్ ? ఎప్పుడూ తెగ చదివేస్తుంటావ్ ? పరీక్షకి ముందు నెల రోజులు బట్టీ పెడితే పోయేదానికి, మేమంతా చదవటంలేదూ ?" అని రావు గేలి చేసినా, హరికి బాధలేదు

"నీకేమయ్యా స్వామీ ! ఎన్నేళ్లు చదువుకున్నా నెలనెలా డబ్బు అందించేందుకు మీ నాన్నగారున్నారు నాకు మార్కులు తగ్గినా యంటే స్కాలర్‌షిప్ ఎగిరిపోతుంది కాలేజీ, చదువు వదిలేసి పరిగెత్తాలిసిందే" అని చెప్పేసేవాడు నవ్వుతూనే

రావుతో ఎంత స్నేహంగా వున్నా, తన కెంత అవసరం వచ్చినా, అతడి దగ్గిర మాత్రం సహాయం పుచ్చుకోవటం లేదు హరి కొన్ని నెలల స్నేహంతో రావు తత్వం ఏమిటో బాగా తెలిసి పోయింది సహాయం అంటూ పొందితే, అంతకు రెండింతలు, అతను తనని ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తాడు తనరూమ్‌మేటుగా ఇద్దరిమధ్యా ఉన్న సమానభావం పోతుంది తను రావుముందు తలవంచి, అతడు చెప్పినట్లు చేయాలి

కాలేజీ స్టూడెంట్ యూనియన్ లీడర్‌లో ఒకడు కాదు రావు కానీ అంతకంటే ముఖ్యమయిన రైట్‌హాండ్ మాన్‌గా ఉంటాడు, ఎన్నికల సమయంలో అతను ఏ ఏడు ఏ అభ్యర్థి ఎక్షౌన చేరతాడో ఎవరికీ తెలీదు కానీ పోటీ చేసే ప్రతీ ఒక్కరు రావుని తమవయివు తిప్పుకోవాలని ప్రయత్నిస్తారు రావుచేత డబ్బు పడిందంటే అతను చేయలేని పని ఉండదు ఊరేగింపులు జరపటం, గుంపు పోగుచేసి నినాదాలు చేయించటం, సభలు ఏర్పాటు చేయటం, అనసరమయినప్పుడు అవతలివాణ్ణీ, వాడి మనుషులనీ గూండాలని పెట్టి తన్నించటం — ఇవన్నీ కొట్టిన పిండి రావుకి


ఆయా పనులు చేయించేందుకు, రావుకి వందల్లో డబ్బు ఇస్తారని చెప్పుకుంటారు అందరూ అంత డబ్బేంచేస్తాడా అని ఆశ్చర్యం వేసేది హరికి కానీ ఆ సమయంలో అతను కుట్టించే కొత్త బట్టలకీ, రోజూ గదికి తెచ్చుకునే డ్రింక్ సీసాలకీ, హోటల్లో తినే బిర్యానీలకి ఎన్ని వందలయినా చాలవని కొన్ని రోజుల్లోనే అర్థమయిపోయింది అప్పుడప్పుడు రావు అతని అనుచరులు చేసుకునే మందు పార్టీలతో గది సంత మార్కెట్‌లా తయారయేది ఆ రాత్రులు హరి పుస్తకం పట్టుకుని ఏ వరండా లయిటు వెలుగులోనో చదువుకునేవాడు లేదా గదిలోనే దుప్పటి ముసుగు తన్నేసి నిద్రపోయి, తెల్లవారు ఝామున మూడింటికి లేచి కూర్చునేవాడు అప్పటికి పార్టీ అయిపోయి, రావు, ఒకరిద్దరు స్నేహితులు అక్కడేపడి నిద్దర్లు పోతుంటారు వాళ్ళు పారేసిన సీసాలు, సిగరెట్ పీకలు, చెత్తా అంతా శుభ్రం చేసుకుని చదువుకి ఉపక్రమిస్తాడు హరి

ఏ తొమ్మిది గంటలకో హరి కాలేజీకి బయల్దేరిన టయిములో నిద్రలేచి, గదంతా శుభ్రంగా పెట్టిన రూమ్‌మేటుమీద ప్రేమ కురిపిస్తాడు రావు "సారీ బ్రదర్ ? రాత్రి పాపం నీకు చాలా డిస్టర్బెన్స్ అయింది కదూ ? ఇన్నాళ్ళుగా చూస్తున్నావుకద పోనీ మాతో జాయిన్ అవవోయ్ అంటే వద్దని మడి కట్టుకుంటావు మొత్తానికి భలే గట్టివాడివి" అని

ఇది ఎప్పుడూ చెప్పే డైలాగే ! హరి ఏమీ చెప్పకుండా నవ్వేసి వెళ్ళిపోతాడు

(ఇంకా వుంది)

పూ మొగ్గల ముగ్గు —పి విజయభారతి



బ్రతుకు ధర్మం

మాడుగుల కృష్ణకుమారి



ఎనవున్స్‌మెంటు వినగానే హడావుడిగా ప్లాట్ ఫారం మీదికి వచ్చాడు మాధవయ్య రైలు స్టేషనులోకి ఎంటరవటం చూసి తన చొక్కా మీద చినుగు కన్పడకుండా జాగ్రత్తగా మరో సారి కండువా సర్దుకుని, చేతి సంచీ తడుముకుని వస్తున్న ట్రయిన్‌కేసే ఆత్రంగా చూస్తున్నాడు రైలు ఆగగానే ఆయన దృష్టి తనక్కావల్సిన వ్యక్తికోసం కంపార్టుమెంటుల వెంబడి పరుగు తీసింది

"ఉరేయి మాధవా? ఇక్కడ" అన్నకేక విని "నా పిచ్చికానీ, వాడు థర్డు క్లాసులో ఎందుకు వుంటాడు" అనుకుని వేగంగా ఫస్టు క్లాసువైపు నడిచాడు

చిరకాలంగా కల్సుకన్న మిత్రులిరువురు పది నిమిషాలపాటు తన్మయావస్థలో మునిగిపోయారు మాటల మధ్య "నేను వచ్చే నెలలో రిటైర్ అవబోతున్నానురా" అని భారంగా చెప్పే మాధవయ్య మాటలకు ఘొల్లున నవ్వాడు రంగనాథం

"ఇంకా ఎందుకురా ఈజంజాటం? హాయిగా ఉండక నేను చూడు బొంబాయిలో సెటిల్ అయ్యానా, హైదరాబాద్ వచ్చితనదగ్గరవుండమని మావాడు ఒకటే గోల అనుకో నామటుకు నాకు అదిష్టంలేదు మనకు ఓపిక వున్నప్పుడు మన కాళ్ళ మీద నిలబడాలికానీ ఎదుటివాళ్ళమీద ఆధారపడకూడదురా నా ప్రిన్సిపుల్ ఇది నువ్వు రిటైర్ అవుతున్నావు అంటే నీలో శక్తి నశించింది అనికాదు, రూల్ ప్రకారం వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తారు అయినా పెరిగే వయసుతో ఎంతకాలం శ్రమపడతావు చెప్పు అసలు విషయం మర్చిపోయాను ఈ చేతి కర్ర నీకోసం కొన్నాను" అని మాధవయ్యకి ప్రజంట్ చేశాడు

కృష్ణుని దగ్గరకు అటుకులు పట్టుకు వెళ్ళిన కుచేలునిలా ముడుచుకుపోతూ సంచిలోని అరటిపళ్ళుతీసి రంగనాథానికి ఇచ్చాడు

"ఓరి ! నీకెంత గుర్తురా నాకు ముగ్గిన అరటిపళ్ళు ఇష్టమని" ఆప్యాయంగా తింటున్న మిత్రుడికేసి ప్రేమగా చూస్తుండిపోయాడు మాధవయ్య

ఇక్కడ దిగి మా ఇంట్లో ఓ పూట వుండి వెళ్ళమని అందామన్పించినా తన ఆర్థిక స్థితి గుర్తుకువచ్చి ఆగిపొయ్యాడు

"నేను అసలు మీ ఇంట్లో వుండేవాడిని, కాని టైములేదు వైజాగ్ వెళ్ళి అమ్మాయిని చూసి మళ్ళీ వెంటనే వెళ్ళిపోవాలి నువ్వు మరోలా అనుకోవద్దు స్టేషన్‌కు వచ్చినందుకు చాలా సంతోషమురా రిటైర్‌మెంటు గురించి నువ్వేమీ దిగులుపడవద్దు ఏ మాత్రం అవసరం వచ్చినా నాకు లెటర్ వ్రాయి" చెపుతూ కదులుతున్న రైలు ఎక్కేశాడు రంగనాథం

స్నేహితుడు కన్పించేటంతవరకు చెయ్యి వూపుతూనే వున్నాడు మాధవయ్య ఇంటికి తిరిగివస్తున్న ఆయన మనసులో ఆలోచనలు ఈగల్లాగా ముసురుకుంటున్నాయి

చిన్నప్పటి నుంచి ఒక్కలా వున్నాడు రంగనాథం స్నేహంలో అయితే ఇద్దరు కలిశారు కానీ ఆస్థి, అంతస్తు, చదువులో ఇద్దరివి ఉత్తర, దక్షిణ ధృవాలే స్కూల్‌ఫైనల్ ముగించి పైకి చదివే స్తోమత లేక, తనీ మాస్టరీ గిరిలో పడ్డాడు వాడు పై చదువులు చదివి విదేశాలకు వెళ్ళి బొంబాయిలో పెద్ద ఉద్యోగం సంపాదించాడు వాడి అదృష్టంతో పాటు ఉన్న ఆస్థి, అంతస్తు మరింత రెట్టింపు అయినాయి సమవయస్కులైనా ఇద్దరికి ఎంత తేడా? బాధ్యతల బరువుతో తను అప్పుడే ముసలివాడయ్యాడు ఖరీదయిన బట్టలతో రంగనాథం మరింత అందంగా, ఆరోగ్యంగా వున్నాడు తన

స్నేహితుడంత అదృష్టవంతుడు బహుశా ఎవ్వరూ ఉండరేమో! దేనికి చీకు చింతా లేని జీవితం వాడిది

ఆలోచనలతోనే ఇల్లు దగ్గరకు చేరాడు

"అన్నయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది నాన్నా" అంటూ కవరు చేతికిచ్చింది కూతురు పూర్ణ

పూజ్యులయిన నాన్నగార్కి,

మీ కుమారుడు సత్యం నమస్కరించి వ్రాయినది మీరు రాసిన ఉత్తరంచేరి సంగతులు తెల్పినవి మీ కోడలి ఆరోగ్యము ఏమాత్రం బాగుండలేదు మళ్లీ నెల తప్పింది ముగ్గురు అమ్మాయిల తర్వాత, ఈసారైనా మీకు మనవడ్ని అందించాలని మా కోరిక మీరు రిటైర్ అవుతున్నారని తెల్పి నేను చాలా బాధపడ్డాను ముఖ్యంగా మీకు రాసేది మీరు ఎక్స్‌టెన్షనల్ సర్వీసుకై ఎందుకు ప్రయత్నించకూడదు? లోగడ మీరు రాసినట్లుగా మీరందరు నాదగ్గరకు రావటాన్కి నాకే అభ్యంతరము లేదు కానీ ఈ సిటీలో నాకొచ్చే జీతంతో జరగటం చాలా కష్టతరం ఆ విషయం మీకు తెల్సును కొన్నాళ్లపాటు మీరు అక్కడే వుంటే ఉభయులకు శ్రేయస్కరం వీలు వెంబడి నేను డబ్బు పంపటానికి ప్రయత్నిస్తాను మీరు మరోలా అనుకోవద్దని మనవి అమ్మను, చెల్లాయిని అడిగానని చెప్పండి మీ కోడలు తన నమస్కారములు, పిల్లలు తాతయ్యకు, నాయనమ్మకు ముద్దులు చెప్పమన్నారు

పి ఎస్ ఎక్స్‌టెన్షనల్ సర్వీస్ విషయం మాత్రం ఎట్టిపరిస్థితిలో మర్చిపోవద్దు— గట్టిగా ప్రయత్నించండి

ఇట్లు,
మీ కుమారుడు, సత్యం

ఉత్తరం పూర్తి చేసిన మాధవయ్య నిస్త్రాణగా వాలుకుర్చీలోకి జారిపొయ్యాడు

"అబ్బాయి ఏంరాశారండీ? మీరు రిటైర్ అవగానే తన దగ్గరకు వచ్చేయమన్నాడా?" అని ఎంతో ఆతృతగా అడుగుతున్న భార్య మాటలకు సమాధానంగా

"అమ్మా పూర్ణా! మీ అమ్మకి ఉత్తరం చదివి విన్పించు తల్లీ" అని తిరిగి కళ్లు మూసుకుండిపోయాడు'

ఒక్కసారిగా వీచిన గాలికి చేతిలోని కవరు ఎగిరిపోయింది చేతలోని ఉత్తరంలాగే చేతికందిన కొడుకు కూడా ఎగిరిపొయ్యాడు నిర్లిప్తంగా నవ్వుకున్నాడాయన కానీ ఆ నవ్వు వెనుక నలిగిపోతున్న మనసు బాధ ఆయనలోని మనసుకే తెలుసు మూసుకున్న కళ్ళ వెనుక ఉత్తరంలోని మాటలే పదే పదే మనసులో తిరుగుతున్నాయి

ఎంత బాగా రాశాడు సత్యం 'రిటైర్ అయిన మిమ్మల్ని పోషించటం చాలా కష్టం' అని ఒక్క ముక్కలో చెప్పాడు తను మళ్ళీ ఎక్స్‌టెన్షనల్ సర్వీసుకు గట్టిగా ప్రయత్నించమని సలహా ఇచ్చాడు తనిప్పుడు చేస్తున్నది ఆదే సర్వీసన్న విషయం వాడికి గుర్తులేక పోవటం, ఆశ్చర్యమేమరి తల్లిదండ్రులనే అదనపు భారాన్ని భరించటాన్కి ఇష్టపడని వాడి మనసు, మరి వాడి కుటుంబంలో మరో బిడ్డని ఆహ్వానించటాన్కి ఎలా ఒప్పిందో? అసలు తను సత్యానికి ఉత్తరం రాయటం ఎంత వరకు సమంజసం అని ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకున్నాడు

నిద్రాహారాలు లేకుండా, అనుక్షణం శ్రమించి ఎన్నో కష్టాలకు ఓర్చి అందమయిన తోటను తయారుచేసిన మాలి ఆ తోటలోని చెట్టు నీడన విశ్రాంతి కోరటం అత్యాస కాదే? నువ్వు నా ఛాయలకే రావటానికి వీల్లేదు, అని ఆ తోట నిరాదరణ చూపిస్తే ఆ మాలి గుండె తట్టుకోకలదా? అలాగే వుంది తన పరిస్థితి కూడా ఇప్పుడ

రెక్కలు వచ్చిన పక్షి గూటి నుంచి వెళ్ళే ముందు, తనకు రెక్కలు రావటాన్కి కారకులైన

వారిని మర్చిపోవటం అన్యాయం కాదు ఆ పక్షుల బాధ ఏమోకానీ మనసున్న మనిషిగా తన బాధ మాత్రం వర్ణనాతీతం

ఒక్కసారిగా ఆయన మనసు ఎదురు తిరిగింది

ఎందుకు తనలో తను ఇంతగా మధనపడి పోతున్నాడు? వృత్తిరీత్యా రిటైర్ అవుతున్నాడు కానీ, జీవితంలోంచి రిటైర్ అవటంలేదు కదా జీవితం గడిచి జీవనం గడవటాన్కి ఏదో ఒకటి చెయ్యక తప్పదు బాధ్యతలు పూర్తికాని తనలాటి వాడు జీవితాంతం శ్రమించక తప్పదేమో రంగనాధం అన్నట్లుగా తనలో శక్తి ఇంకా ఇంకి పోలేదుగా

''మనకు ఓపిక ఉన్నప్పుడు మన కాళ్ళమీద నిలబడాలికానీ ఎదుటివాడిమీద ఆధారడకూడదు'' అన్న మిత్రుడి మాటలే పదేపదే మనసులో మెదిలాయి ఒక్కసారి మాధవయ్యలో ఏదో నూతనోత్సాహం పొంగి పోర్లింది కుర్చి పక్కనే ఉన్న చేతికర్రను ఆప్యాయంగా తడిమాడు జీవిత సత్యాన్ని తన మిత్రుడెంత చక్కగా చెప్పాడు? లేచి నిలబడ్డాడు చేతికర్ర ఆసరాతో ఠీవిగా అటు ఇటు అడుగులు వేశాడు చేతికి ఎంతో ఆసరాగా అన్పించింది చేతికి అందివచ్చిన

బ్రతుకు ధర్మం

కొడుకు కాదు పొమ్మన్నా చేతికర్ర మాత్రం మంచి శక్తి నిచ్చింది

ప్రపంచధర్మంగా వివాహం చేసుకుని, ప్రకృతిధర్మంగా బిడ్డలను కని వాళ్ళని పెంచి పెద్దవాళ్ళను చేసి, ప్రయోజకులుగా చెయ్యటం జన్మనిచ్చిన తల్లితండ్రులుగా తమ కర్తవ్యం వాళ్ళ ఉన్నతికి ఆనందించటమే తమ ధర్మం అంతే కానీ వాళ్ళనుంచి తిరిగి ఏదీ ఆశించకూడదని ఈ కలియుగం చెపుతోంది

రిటైర్ అయిన మరుక్షణంనుంచి వేరే ఎక్కడన్నా పన్లో చేరాలి ఏ కష్టం అయినా చేసి తనపై ఆధారపడ్డ వాళ్ళను బ్రతికించుకోవాలి—

క్రితం రోజు ఎవరో ప్రైవేటు చెప్పటాన్ని రమ్మన్న విషయం గుర్తుకువచ్చి చేతికర్రను ఊగించుకుంటూ, కొత్త ఆశతో, నూతన ఉత్సాహంతో ఠీవిగా అడుగులు వేస్తున్న ఆయన చెవులకు—

''ఎండవేళ భోజనమయినా చెయ్యకుండా మళ్ళీ ఎక్కడికండీ?'' అనే భార్య మాటలు ఏ మాత్రం వినబడనట్లుగా ముందుకు కదిలి పోతున్నాడు స్థిర నిశ్చయానికి వచ్చిన వ్యక్తిలా మాధవయ్య ★

అతివృద్ధుడు!

జపానుకు చెందిన షిగిచియో ఇజుమి ఎక్కువ కాలం జీవించటంలో కొత్త రికార్డును సాధించాడు 1865, జూన్ 29న జన్మించిన ఇజుమి వయస్సు ప్రస్తుతం 118 సంవత్సరాల నాలుగు నెలలు గిన్నిస్ బుక్ ఇతడిని ప్రపంచంలోనే అతివృద్ధుడిగా 1980లోనే గుర్తించింది ఆయన టోకునోషిమా నగరంలో కొడుకు, కోడలు, మనవడుతో కలిసి జీవిస్తున్నాడు ఆయన సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉన్నట్లు డాక్టర్లు తెలియచేశారు అయితే, జలుబు చేయకుండా మాత్రం ఆయన జాగ్రత్తగా ఉండాలి ఆయన ఫొటోను నవంబరు నెలలో విడుదలయిన గిన్నిస్ బుక్ కవర్ పేజీపై వేశారు

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో రెండవ బహుమతి రు. 150/- పొందిన వ్యాసం

మనస్తత్వ చిత్రీకరణ సహజంగా, సజీవంగా ఉంది!

దీపావళి కథలపోటీలో బహుమతి పొందిన ఆరు కథలలో నాకు బాగా నచ్చిన కథ "దొడ్డ మనసు" కారణం – యీ కథలో పాత్రలు, వారి మనస్తత్వాలు చిత్రీకరణ ఎంతో సహజంగా, సజీవంగా వుంది ముఖ్యంగా ఆడవాళ్ల మనస్తత్వాలు ఎంతో నైపుణ్యంతో చిత్రించారు తమకు ఎంతవున్నా, పుట్టింటివాళ్లు పెట్టలేదనే అసంతృప్తితో బాధపడే ఆడవాళ్ల అందరికీ యీ కథ కనువిప్పు. తనకు లేకపోయినా, తనకు లభించినదానిని, ఆడపడుచుకు యిచ్చి ఆనందించిన గౌరి మనస్తత్వం నిజంగా ప్రశంసనీయం "దొడ్డ మనసు"ను కలిగివుండటం అనేది అంతస్తులపై ఆధారపడి వుండదు–పేదవారైనా దొడ్డమనసు కలిగివుంటారు అనే నిజాన్ని స్పష్టం చేసిన యీ కథకు ప్రథమస్థానం యివ్వటం సమంజసం

తండ్రీ కొడుకులమధ్య అనుబంధాన్ని గురించి అసమానంగా చిత్రించిన "మమతల వంతెన" కథకు ద్వితీయ స్థానం యిస్తున్నాను హృదయాలను ద్రవింపచేయగల కరుణ, ఆర్ద్రత కథలో నిండివుంది పేదరికంలో మ్రగ్గుతున్నా కొడుకు క్షేమంకోసం ఆరాటపడే అమానుల్లా, తండ్రికి సాయం చేయాలని తపనపడే తనయుడు రహీం పాత్రల చిత్రణ ఎంతో ఉన్నతంగా వుంది

మూడవ స్థానం "రేపటి తండ్రి" కథ పొందుతుంది తల్లిదండ్రుల ఎడల కుమారుల బాధ్యతలను గుర్తుచేసే ఈ కథ ఎందరో యువకులకు కనువిప్పు కాగలదు ఈనాడు తను తండ్రి కాగానే, తన తండ్రిని గురించి మర్చిపోయే తనయులు యీ కథ చదివితే పరివర్తన చెందగలరు ఒక గొప్ప సామాజిక సత్యాన్ని చాటి చెప్పిన యీ కథ మూడో స్థానంలో నిలబడుతుంది

"గోరంత దీపం" కథ చక్కని నీతిఎంతమైన కథ రచనా శిల్పం ప్రత్యేకించి పేర్కొనదగిన అంశం పాఠకులలో ఉత్కంఠను, ఉద్వేగాన్ని కలిగించి అందరికీ ఆమోదయోగ్యమైన ముగింపును కలిగించారు ఆపదలోవున్న వారి జీవితాలలో చీకటి తొలగించటానికి ప్రతి ఒక్కరూ కాస్తో కూస్తో సాయపడాలని ప్రబోధించే మంచి యితివృత్తం యిది ఈ కథకు నాలుగో స్థానం యిస్తున్నాను

"మనుషులు" కథలో ముఖ్యంగా మనస్తత్వాల పరిశీలన లోతుగా చేయటం జరిగింది ప్రతాపరావు, పంకజం పాత్రలు సగటు మనుషుల మనస్తత్వాలకు, బలహీనతలకు ప్రతిరూపాలుగా చిత్రించటం జరిగింది కథ ముగింపు చాలా అర్థవంతంగా వుంది

"వారసత్వం" కథకు చివరి స్థానం యిస్తున్నాను కథలో ప్రత్యేకించి చెప్పినది ఏమీ లేకపోయినా, తండ్రులు ఎప్పుడూ తమ స్వంత సుఖాలకంటే బిడ్డల సంతోషాలకే ప్రాధాన్యత నిస్తారనే జీవన సత్యానికి రూపకల్పన చేసారు

– కుమారి ఏ. సి. నీరజ

రచయిత్రి పరిచయం


"ఈ సంక్రాంతికి యిలాంటి సంక్రాంతులు పాతిక కళ్లజూసిన వయసు పేరుకి చివర బి ఏ డిగ్రీ తగిలించుకోవాలని తాపత్రయం మిగిలిపోయిన రెండు సబ్జక్టులు ఆ అవకాశం యివ్వటంలేదు! వాటితోనే ప్రస్తుత కాలక్షేపం ఇంకా తల్లిదండ్రుల "గుండెలమీద కుంపటి"నే కాబట్టి వరకట్నాల మార్కెట్టులో తల్లిదండ్రుల అన్వేషణను గుడ్లప్పగించి చూస్తున్నాను నా కాళ్లమీద నేనే నిలబడాలనే చిన్న తాపత్రయం ఓ ప్రైవేటు కంపెనీలో టైపిస్ట్ వుద్యోగం సంపాదించి పెట్టింది తీరిక సమయాలలో పత్రికలు, సినిమాలు కాలక్షేపం ఎన్నో ఏళ్ళుగా చదవడం అలవాటున్నా, వ్రాయడం మాత్రం యిదే ప్రథమం "మొట్టమొదటి రచనకే బహుమతి కొట్టేశాన" అని గొప్పలు చెప్పుకునే అవకాశం ఇచ్చిన మీకుకృతజ్ఞతలు ఫోటో ప్రచురణ యిష్టంలేదు – ఆసక్తి లేదు మన్నించగలరు"

—ఎ సి నీరజ

క్రాంతి-సంక్రాంతి

అక్షరాల చితుకులు పేర్చి
మాటలని పోగేసి
పిరికితనం మంచు కరిగించేందుకు
పాటని మంటలా
రగిలించేందుకు
గుండె కిటికీలోంచి
బైటకి చూశాను –
దేశం చెట్టు రాల్చిన ఎన్నెన్నో
ఎండుటాకులు
కులం – మతం
రాజకీయం – ఎన్నెన్నో
ఎండుపుల్లలు
గుట్టలు గుట్టలుగా –
తరతరాల మౌఢ్యం చితుకులు
వీచే గాలికి ఎగురుతూ –
నా తరం చైతన్యం రగిలితే
ఆ మంటలో
తగలబడుతున్న
మౌఢ్యాన్ని చూసినప్పుడే –
నా కళ్లకి సంక్రాంతి
నా దేశానికి నవ్యక్రాంతి!!!

– రామసూరి



దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మూడవబహుమతి రు. 100/- పొందినవ్యాసం

వర్గ విభేదాలకి అతీతమైన మానవత్వం!

"ఎంత మంచి వాళ్ళకీ ఒక్కోసారి బుద్ధి వక్రిస్తుంది! తొందరగా తప్పుదిద్దుకోవడమే మనిషన్నవాడి కర్తవ్యం" అన్న వాక్యాలతో ముగిసిన "మనుషులు" అనే కథ బహుమతి నందుకున్న ఆరు కథల్లో ఉత్తమంగా నేను భావిస్తున్నాను తప్పు దిద్దుకోవటమే మనిషన్నవాడి కర్తవ్యం అనే సందేశం ప్రతాపరావు, పంకజం పాత్రలద్వారా కథలో నిరూపితమైంది కాని పశ్చాత్తాపం పడటం కంటే తనపట్ల తప్పు చేసిన అవతలి మనిషిని క్షమించి సర్దుకోవడమే అంతకంటే గొప్ప మానవత్వపు విలువ! ఆ విషయం కూడా ఈ కథలో చక్కగా నిరూపణ అయింది దొంగతనంచేసిన పంకజాన్ని క్షమించడంలో ప్రతాపరావు ఔన్నత్యం తెలుస్తున్నది వర్గ విభేదాలకు అతీతమైన మానవత్వాన్ని చిన్న సంఘటనలో చిత్రించిన ఈ కథకే ప్రథమ స్థానం

మాట పాతిక పెట్టి ఇష్టపడి కొనుక్కున్న చీరని పనిమనిషి గౌరికి ఇవ్వడం సుజాత దొడ్డ మనసుని తెలియజేస్తున్నదని మొదట సూచించిన రచయిత, చివరకు గౌరి ఆ చీరను దాని ఆడబిడ్డకు ఇచ్చి పొందిన ఆనందంలో గౌరి మనసే తనకంటే దొడ్డమనసని సుజాత గ్రహించినట్లు కథను ముగించారు ఇది చాలా బాగుంది ఎందుకంటే సుజాత చేసిన పనిలో, తన అన్న తనపట్ల చూపవలసిన అభిమానం చూపలేదన్న అసంతృప్తి తాలూకు రియాక్షన్, ఇతరులను సంతోష పెట్టగల మనసూ డబ్బూ తనకున్నాయన్న కించిత్ గర్వం కలిసే ఉన్నాయి అంతకంటే పేద గౌరి చీర నిచ్చివేయడంలో, స్వచ్ఛమైన ఆనందం, నిర్మలమైన ప్రేమాభిమానాలూ వ్యక్తమయ్యాయి ఇది రెండో మంచి కథ

తండ్రీ కొడుకుల మధ్యగల అనుబంధాన్ని కాలమూ, ఫాషన్లూ మారడం, కొడుకూ కోడలూ వేరు కాపురం పెట్టడం వంటి కాలం తెచ్చే మార్పులకు అతీతంగా చిత్రించిన కథ 'మమతల వంతెన' ఈ కథ హైదరాబాదు పాతబస్తీలో నివసించే ఒక ముస్లిం కుటుంబ పరంగా వాస్తవికతతో వ్రాయబడినది దీనికి మూడో స్థానం

'గోరంత దీపం' కథలో శివయ్య జాలిపడి చేసుకున్న జయ అతని జీవితంలో, ఏకుమేకై, అన్ని నిర్ణయాలు తనవిగా చేస్తూ అధికారాన్ని సంపాదించింది దానితో శివయ్యకి ఒక మంచిపని చెయ్యాలన్నా బెరుకుగా ఉంటోంది ఆ కారణంగానే దిక్కులేని ప్రభావతికి ఆశ్రయమిచ్చేమాట ఏంచెయ్యాలో తెలియని సందిగ్ధంలో శివయ్య పడ్డాడు జయమ్మే ఆ నిర్ణయం తీసుకుని 'గోరంత దీపం'గా కొండంత వెలుగునిచ్చిందని రచయిత అభిప్రాయం కాని అణచివేయబడి నలిగిపోయిన శివయ్య వ్యక్తిత్వం సంగతేమిటి? అందుకే ఈ కథ అంతగా నచ్చలేదు!

కొడుక్కి తండ్రిమీద వుండేది గౌరవం ఆయన ముసలితనంలో అదే చికాకుగా మారవచ్చు కాని మనవడికి తాతమీద ఉండేది ఆప్యాయత ఈ ఆప్యాయతే పెద్దయ్యాక తన పిల్లలమీద చూపిస్తాడని 'రేపటి తండ్రి' కథలో సందేశం ఇది కొంత కృత్రిమంగా ఉంది ఈ కథకు ఐదో స్థానం

కట్నం చాల్లేదని అత్తగారి బాధతో తిరిగి వచ్చిన కూతురూ, కోరిన ఉద్యోగం దొరకలేదని డిగ్రీ చదివి నిరాశపడే ఒక కొడుకూ, విప్లవం తెస్తానని పోలీసుల చేతుల్లోకి జీవిత మర్పించిన మరో కొడుకూ— పేపర్లలో వచ్చే వార్తల్నే కథగా రూపొందించిన 'వారసత్వం' రచనలో విశేషమేమీ కన్పించదు

— "అరుణ"

ముగ్గులూ—గొబ్బిళ్ళూ — ఫొటో ఎస్. తిరుమలరావు



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి.యు.ఎమ్. – కాశీబుగ్గ

ప్రేమకు విలువ తెలిసేది ఎప్పుడు ?

★ మోసగింప పడినప్పుడు !

తెలిసి తెలిసి తప్పులు చేసేవారికి శిక్ష ఏమిటి ?

★ అది వారి అలవాటైతే – శిక్షేమిటి ?!

పి.వి.వి.ఎవ్. – కొండపల్లి

మేం వేరు కులాల వాళ్లం పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నాం ఈ సమాజం ఏమంటుంది ?

★ మీ పెళ్లిలో ఏ మాత్రం పొరపాటు జరిగినా – చెప్పుతుంది – కాని మీ పెళ్లితో దానికేం సంబంధంలేదు !!

ఎం.వి.ఆర్. – పెదవింద్రకొలను

రామలక్ష్మిగారూ! జైహింద్ అంటే అర్ధం ఏమిటి !

★ హిందూదేశమా ! నీకు జయమగుగాక! అని అర్ధం

ఎం.ఎం.జె. – రామచంద్రపురం

జాతస్య మరణం ధృవం అని తెలిసికూడా చావు అంటే మనిషి భయపడతాడెందుకు ?

★ ప్రాణం వుందికదా ? అందుకు అది పోయేదాకానే భయం

డి ఆర్. – బళ్ళారి

హరిశ్చంద్రుడిలాగా సత్యాన్ని పాలించాలంటే సాధ్యం కావడంలేదు

★ కలియుగంలో సత్యానికి – కాస్త ఎమెండమెంటు వుంది అది మరిచిపోతే ఎలా ?

అదృష్టంమీద ఆధారపడే వారినేమనాలి ?

★ ఆత్మ విశ్వాసం లేనివాళ్ళు – అనండి

డి. జి. – మద్రాసు

ఆరాధనలో ఆనందం వెతుక్కుంటారు కొందరు, ప్రేమలో దైవాన్ని దాచుకుంటారు కొందరు, మూగగా ఆలోచనల మధ్య అనుభూతుల మల్లెలు పూయించుకుంటారు కొందరు ఈ మూడు మనస్తత్వాల మధ్య జీవితాన్ని కలల మధ్య ఊహించుకొనే వ్యక్తి కథకు ముగింపు దొరకడం సాధ్యమా ?

★ సాధారణంగా పిచ్చాసుపత్రిలో ముగుస్తుందీలాంటి వ్యక్తి కథ

ఎ. ఆర్. కె. – తాల్చేరు

మీ దృష్టిలో ఏ వివాహాలు ఎక్కువగా విజయవంతం అవుతున్నాయి – పెద్దలు చేసినవా ? ప్రేమవా ?

★ భార్యని మనిషిగా గుర్తించుకున్నంత కాలం ఏ వివాహమైనా – కొనసాగుతుంది

రమేష్ – ఉరవకొండ

స్వార్ధమే ఊపిరిగా బ్రతికే నాయకుల మధ్య ప్రజలు ఏ విధంగా వుంటారు ?

★ ఏముంది – ఎన్నికలో ఓటర్లలాగా వుంటారు

డి. పి. – కడప

ప్రేమ కులాంతర వివాహాలను సమర్ధిస్తూ పత్రికలో డబ్బాకొడ్తారే మీ అమ్మాయిని నేను ప్రేమిస్తున్నా మరి పెళ్లి చేస్తారా! చెయ్యలేరు? ఎందువల్ల – మీ కులానికి

★ పొరపాటు పిచ్చితండ్రీ – చాలా ముఖ్యమైన విషయం మరిచిపోయారు – నా కూతురు నిన్ను ప్రేమించ వద్దా ?!

పత్రికను స్త్రీలేకాదు చదివేది మీ ఆడ బుద్ధి పోనిచ్చుకొన్నారు కాదు ?

★ ఆడవారిని సమర్ధిస్తే – ఒళ్లుమండి చదివేది మీరేనని తెలుసు – నాకు !

వి. ఎవ్. ఆర్. – అనకాపల్లి

మన దేశంలో రాజకీయాలలో హీరోలు తరచు రావడానికి కారణం ఏమిటి ?

★ సినిమా – రాజకీయాలు రెండూ ''మాబ్''తో సంబంధం వున్నవి కనుక

ఎం. డి. ఎస్. – బైపల్లి

ధర్మరాజు పరిపాలనలోనే అందరిని సమానం చేస్తే ఎవరి పనులు వాళ్ళు చేయలేదు– ఇప్పుడు నటరత్న అందరినీ ఆర్ధిక సమానం చేస్తానంటున్నారు ఎంతవరకు ఫలిస్తుంది ?

ఫలించేదయితే – యీ సమానత్వం – ఇదివరికే ఫలించేది ఇది ఆకాశానికి వేసే నిచ్చెన అందని మానిపండు

వాసుదేవ్ – కొత్తగూడెం

మరువలేని మరపురాని పరిచయం ఏది ?

★ జీవిత సంధ్యాసమయంలోగాని–చెప్పలేం

ముక్తికి మార్గం ఏమిటి ?

★ మంచి ప్రవర్తన

అవారా – ఖర్గపూర్

నాకు బ్రతకాలని లేదు కాస్త పాయిజన్ యిస్తారా ?

★ వేరే యివ్వాలి కూడానా–మీ వూరు నుంచి వస్తూంటుందిగా–అప్పుడప్పుడు కవిత్వం! అది ఆస్వాదించండి చాలు !!

బి. వి. ఆర్. ఎమ్. – హైదరాబాదు


ఆరుద్రగారికి ఆదుర్దా ఎక్కువ అని విన్నాను నిజమేనా !

★ నిజమే మానవత్వం వున్న మనీషి ఆయన అందుకే – ఆత్రుత, ఆదుర్దా ఎక్కువ

పి. సి. హెచ్. బి. – నరసాపురం

త్రాగుడులో మాతో పోటీపడి ఆడవాళ్ళు నెగ్గగలరా ?

★ సిగ్గులేని పన్ను చేయడానికి పోటీ పడక్కరలేదు ★



సంక్రాంతి లక్ష్మి

వాగభైరవ కోటేశ్వరరావు

'పాలి పాలి పాలిగల్గ వాలములో రేల
  కుప్పనూర్చెడి కాపు గొంతు వినగ,
'కోలు కోలు సామి కొమ్మలిద్దరు జోడు'
  కోలాటముల పాట కొసరి వినగ,
'హరిలో హరిరంగ హరిహరి' యనెడు నా
  తాని రాగాల విధానమెంచ,
'కొక్కొరోకో'లలో కుదిరిన అలనాటి
  పలనాటి పౌరుష ప్రభలు గాంచ,

  కదలి యేతెంచె సంక్రాతి కాంత నేడు
  నా సఖీ రమ్మ ! నీ రాజనాల నిచ్చి
  పిలువుమా ! మనడెందాలు పీటజేసి,
  వేసి, పూజింతుమీ మంచివేళ యిద్ది –

నా నేల స్వచ్ఛందనము నంత మే నెల్ల
  చీరెగా జుట్టిన చిగురుబోణి,
నాచేల పచ్చందనము నంత మోమున
  పసుపుగా బూసిన పర్వరాణి,
నాగాలిలో పురానాదాలు సిగయందు
  నిలువుగా సవరించు నీలవేణి
నా పూలలో నిల్చు నవ్యగంధాలు మై
  పూత బూసిన యట్టి పూవుబోణి

  ఏలగా వచ్చె నా తెల్గు నేలనెల్ల,
  చెలియరో ! ఆమె మెత్తని చిత్తమందు,
  సకల శుభముల నందించు సాధు భావ
  సముదయమ్మున్న దందుకొందమిటు రమ్మ !

అభ్యర్థన !

'జన'

ఏడాది కోసారి యింటింటికొచ్చి
ఇంటిల్లిపాదినీ అలరించు లచ్చి
పాడిపంటల తల్లి – సంకురాతిరి లచ్చి !
అందుకో మాయమ్మ మంగళారతులు

ముద్దబంతిపూల తోరణాలు గట్టి
ఇళ్ల లోగిళ్లలో ముగ్గులెన్నో బెట్టి
ముగ్గు ముగ్గుల నడుమ గొబ్బిళ్ళు పెట్టి
గొబ్బిపూలా దండ చేతుల్లో పట్టి
స్వాగతం పలికేటి మా తెలుగు పడుచుల
శతకోటి దీవెనల నందింపవే వచ్చి !

రేయనక పవలనక, చలియనక గిలియనక
చెమటోడ్చి పనిచేయు కూలి రైతన్నల
కూడు గుడ్డలు లేక, ఉండగూడును లేక
అలమటించే బడుగు పేదన్నల
కలల పంటవు నీవు, కమనీయ వరమీవు
కరుణించి కాపాడు సిరి సంపదల నిచ్చి !


పోలీసు డైరీ

దురాగతం !

అనంతపురానికి చెందిన బుక్కచర్ల గ్రామంలో 20 ఏళ్ళ జయేలీబీ అనే ఆమె అపురూప సౌందర్యవతట ఆమె మీద కామ దాహంతో ఆ వూరు ధనికులు నారాయణరెడ్డి, నల్లపరెడ్డి, శంకరరెడ్డి, నాగిరెడ్డి, మరికొందరు వెంకటరాముడు అనే వో భృత్యుని ద్వారా తమ కోర్కె ఆమెకు తెలియజేసి ఆశ చూపారట దాని కామె తుప్పున వుమ్మిందట చీత్కారంతో ఆ అవమానం భరించలేని యీ దుర్మార్గులు 1982 అక్టోబరు గాంధిజయంతి నాడు ఆమెను నడిరోడ్డులో పట్టుకుని బట్టలూడదీసి, నగ్నంగా చేసి, ఆమె మర్మావయవం మీద, స్తనాల మీదా చెప్పులతో కొట్టి, ఆమెను వెంటాడి, బహిరంగంగా మానభంగం చేసి, అంతతో వూర్కోక, ఆమె నోట్లో పురుగుల మందు పోశారుట తత్ఫలితంగా ఆమె ఆసుపత్రిలో స్పృహలేని స్థితిలోనే ప్రాణాలు కోల్పోయిందట

అందం తెచ్చిన ఆపద !

ధర్మపురికి చెందిన పాపాలపట్టి గ్రామంలో 35 ఏళ్ళ పెరియసామి, అతని తమ్ముడు 25 ఏళ్ళ రాజగోపాలు ఆస్థి తగాదాలలో విడిపోయి, విడివిడిగా వుంటున్నారట పెరియసామి భార్య ముత్తువేడి చాలా అందంగా వుంటుందట కలసి వుండే రోజులలోనే రాజగోపాలామెను చూపులతో తినేవాడట విడిపోయాక సుముహూర్తానికి వేచి వున్న రాజగోపాల్ ఒకనాడు తన అన్న ధర్మపురికి వెళ్ళాడని పసిగట్టి, అతని యింటికి వెళ్ళి వదిన గారిని బలాత్కారింపబోయాడట ఆమె ఎలాగో పెనుగులాడి, తప్పించుకుని, వూర్నించి వచ్చిన భర్తతో ఆ రాత్రి యీ విషయం చెప్పిందట



అంతావిని సరిలే పడుకో అని తానూ పడుకున్న పెరియసామి రాత్రి రెండు గంటలకు లేచి మాంసం నరికే కత్తితో తన తమ్మునింటికివెళ్ళి, నిద్రపోతూన్న అతనిమీదపడి, ఒకేవేటుతో ఆతని పీక నరికి, తల వేరుచేసి, నేరుగా పోలీసులకు తానుగా లొంగిపోయాడట

అధికారంలేని ఆరాధనకి దేశ బహిష్కారం !

ఆబూదుబాయిలోని వో రెస్టారెంటులో ఒక ధనిక మహాశయుడు నింపాదిగా కూర్చుని వెనకపక్క టేబులు వద్ద కూర్చుని వున్న వో పుత్తడి బొమ్మకేసి రెప్పార్పకుండా చూసిన నేరానికాతన్ని అరెస్టు చేసి 12 రోజులు జైల్లో వుంచి, ఆనక మా దేశం నుంచి పో అని విమాన మెక్కించేసిందటా ఆ ఆబూదుబాయి ప్రభుత్వం, నేను చెడు వుద్దేశ్యంతో చూళ్ళేదు బాబోయ్, ఆ అమ్మాయి అందంగా వుండడం వల్ల ఓ ఆరాధనతో చుశాను అన్నా కూడా ఆ పిల్లని ఆరాధనతో చూడ్డానికి నీ కెవరు అధికార మిచ్చారోయ్ వో చవలాయ్ అన్నారట ఈ రేటున నగరంలో చాలా మంది జైళ్లల్లోనే వుండాల్సుంటుంది కదా !— మన దేశమే బెటరేమో !

వింత కేసు !


నార్త్‌గోవా తాలూకాకు చెందిన సలేవి గ్రామంలో వాహోయనక్కోపం వచ్చి, వీర హనుమాన్ను తలుచుకు ఎగిరి, సాచి, తన భార్యనో లెంపకాయ కొట్టేసరికి ఆమె విరుచుకు పడిపోయిందట భార్యను హత్యా చేసిన నేరానికి తన నరెస్టుచేసి, ఉరికంబానికి ఎక్కిస్తారని భయపడ ఆ భర్త తన భార్య శవాన్ని గొయ్యి తవ్వి, అందులో పాతిపెట్టూ్తండటం చూసిన ఓ పని మనిషి అల్లరిగా అరిచి, చుట్టుపక్కల వారిని పిలిచిందట వారొచ్చి మట్టిలాగి, ఆమె శరీరాన్ని బయటికి లాగితే ఆ అమ్మాయి చావలేదట కదులుతోందట వూపిరి కూడా బలంగా పీల్చుకుంటోందట ఆమెను పనాజి ఆసుపత్రి మొన్న డిసెంబరు రెండో తేదీన విడుదల చేసిందట ఆరోగ్యం చక్కబరిచి పోలీసులు మాత్రం ఆ భర్త నరెస్టు చేయలేదట, ఎందుకంటే—ఏ కేసు మీద అరెస్టు చేయాలో తెలీటం లేదు ఆయన భార్య హాయిగా వుంది కదా, పైగా భర్తతోనే వుంది కదా అన్నారట— అదీ పాయింటే !

డాక్టర్ల నిర్లక్ష్య వైఖరి !

దక్షిణ బొంబాయికి చెందిన సెయింట్ జార్జి ఆసుపత్రికి మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతూన్న వో రోగి వెళ్ళి వైద్య సహాయాన్నర్థిస్తే అక్కడి వైద్య నిపుణులాతన్ని "కమాన్" అని అని ఆహ్వానించి, కేసునమోదు చేసి, ఆసుపత్రి ఆపరేషను థియేటరులోనికి తీసుకువెళ్ళి, అతి నైపుణ్యంగా రక్కునాతని కంటికి ఆపరేషను చేసి "నవ్ నువ్ ఓకే" అన్నారట కొయ్యబారి వొంటికన్నుతో చూస్తున్న ఆ పేషెంటుతో ఈ వార్త అబద్ధం కాదనీ వచ్చి నిర్ఘుమని రాష్ట్ర శాసనసభలో వైద్య విద్య సహాయమంత్రి భాయ్ సామంత్ విశదం చేశారట



★ హైదరాబాదులో ఒక ఆటోని వో లారీ ఢీకొనడంతో ఆటో డ్రైవరు ఖాసిం అనే అతన్ని ఉస్మానియా ఆసుపత్రిలో చేరుస్తే అక్కడి డాక్టర్లాతనికి వో ఎముక విరిగిందని అనుమానించి, ఎక్స్‌రే తీసి, ఏమీ లేదని చెప్పి మందిచ్చి పంపేశారట పొద్దున్న ఆరింటికి ఇంటికి చేరిన ఖాసిం కడుపు నొప్పితో మెలితిరిగి పోతూండగా ఆతని భార్య ఆతన్ని మళ్ళీ అదే ఆసుపత్రికి చేర్పిందట ఆతన్ని పరీక్షించిన డాక్టర్లాతను చనిపోయాడని ప్రకటించారట ఆ ఏక్సిడెంటులో ఆతని రక్తనాళాలలో వొనాళం చిట్లి రక్తం జీర్ణకోశంలోకి ప్రవహించడంతో యీ మరణం సంభవించిందట ఈ విషయం ఉస్మానియా వైద్య బృందం సకాలంలో ఓపిగ్గా కనిపెట్టి వైద్యం చేస్తే ఆ ఖాసిం బ్రతికివుండి వుండేవాడట



డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఎల్. పి. ఎస్. — ధర్మవరం

ఆప్టిక్ అట్రోఫీ అంటే ఏమిటి? ఈ రుగ్మత ఎందుకు వస్తుంది ఇది రాకుండా ముందు జాగ్రత్త ఏమైనా ఉందా?

★ కంటి లోపలి పొర అయిన రెటీనా నుంచి మెదడుకు వెళ్ళే నరాన్ని ఆప్టిక్ నర్వ్ అని అంటారు ఈ నరాల భాగాలు రోగగ్రస్తమయి ఉండటాన్ని ఆప్టిక్ అట్రోఫీ అని అంటారు ఇవి రావటానికి డయాబెటిస్, బ్లడ్‌ప్రెషర్, సిఫిలిస్ అనే చాలా కారణాలున్నాయి

ఇవి రాకుండా ముందు జాగ్రత్తలంటూ ప్రత్యేకంగా ఏవీ లేవు

భోగి! సంక్రాంతి — కనుము!!

ఇది పంటల పండుగ!
చలిమంటల పండుగ
పలు వంటల పండుగ —
కృషీవలులకు
ఖుషీనిచ్చెడి
గోమాతల పండుగ
తెలుగువారి
జామాతల పండుగ!
రగ్గులు, గొంగళ్లతో
ముగ్గులు, ముంగిళ్లతో
పసందైన పొంగళ్లతో
క్రొత్త జంటల
క్రొత్త ఉడుపులతో
పెట్టుపోతల
మూతిముడుపులతో
జియ్యర్ల పాటలతో
బసవన్న ఆటలతో
కళకళలాడే
కనువిందగు పండుగ
కనులు తెఱచుకొనుము
శుభాకాంక్ష కనుము!

— నల్లాన్ చక్రవర్తుల శేషాచార్య

కె. ఎ. — హైదరాబాద్

నేను రోజూ ఉదయం అరగంటసేపు వ్యాయామం చేస్తాను రోజూ నాలుగు కోడి గ్రుడ్లు తింటున్నాను వచ్చేవారం నుండి రోజుకు అరడజను కోడి గ్రుడ్లు తిందామనుకుంటున్నాను మధ్యాహ్నం నాలుగు చపాతీలు తింటున్నాను నేను చేస్తున్న ఈ పనులన్నీ శరీరానికి వేడిని కలిగిస్తాయని ఎండాకాలం ఈ పనులన్నీ చేయకూడదని నా మిత్రులు అంటున్నారు ఎండాకాలంలో వ్యాయామం చేయుట, రోజుకు నాలుగు చపాతీలు, ఆరు కోడి గ్రుడ్లు తినుట శరీరానికి వేడి చేస్తాయా?

★ వేడి అనేది అలోపతీ శాస్త్రంలోలేదు రోజుకి ఆరు కోడి గ్రుడ్లు తినటం ఆహార పరంగా ఎక్కువేననిపిస్తున్నది

టి. ఎస్. — చెయ్యేరు

మా చెల్లెలి వయస్సు 7 సం॥ పెదాలకి అటుప్రక్క ఇటుప్రక్క పుళ్ళు పడినవి ఏమి చేసినా తగ్గటం లేదు ఇలా ఎందుకు వస్తుంది?

★ అంగులర్ స్టొమటైటిస్ అనే ఈ రోగం, రిబోఫ్లేవిన్ అనబడే బి-కాంప్లెక్స్ విటమిన్ లోపం వల్ల వస్తుంది లోనికి బి-కాంప్లెక్స్ మాత్రలు వాడి, పైపూతగా జెన్షియన్ వయొలెట్ వాడండి ఆకుకూరలు ఎక్కువగా వాడటం మంచిది

వి.బి హెచ్. — కొమ్మపాడు

నా వయస్సు 17 సం॥లు 3 సంలుగా చెవులో నుంచి చీము కారుతున్నది మందులు వాడాను కానీ తగ్గినట్లే తగ్గి మళ్ళా వస్తున్నది

★ ఇ ఎన్ టి వైద్యులను సంప్రతించి, ఆ చీముని లేబరేటరీలో పరిశోధింపచేసి తర్వాత చికిత్స చేయించవలసి ఉంటుంది చెవుభాగం ఎక్స్‌రే తీయటంకూడా చాలా అవసరం ఏ పరీక్షలూ చేయకుండా తాత్కాలికంగా మందులు వాడటంవల్ల తాత్కాలికంగా మాత్రమే ఉపశమనం కలుగుతుంది

అవీ... ఇవీ... అన్నీ...

జగద్గురు శ్రీ శంకరాచార్యులవారి సందేశం

కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు జీవితంలో ప్రతి యొక్కరూ అనుదినమూ అనుసరించ వలసిన ఒక సప్తసూత్ర అనుష్ఠాన ప్రణాళికను తమ సందేశంలో ఈ క్రింది విధంగా తెలియ జేశారు

(1) ఉదయం పాద, ముఖ ప్రక్షాళనం

(2) తూర్పు ముఖంగా ఆశీనులు కావడం

(3) ఒక ఉద్ధరిణెతో జలాన్ని తీసుకోవడం

(4) పవిత్ర గంగను స్మరిస్తూ, ఆ జలాన్ని శిరస్సుపై ప్రోక్షణ చేసుకోవడం

(5) ఉదయ సూర్యునికి నమస్కరించడం

(6) 108 సార్లు రామనామ జపం చేయడం

(7) సూర్యాస్తమయంలో కూడా పై విధంగానే చేసి, సూర్యునికి ఎదురుగా పడమటివైపు తిరిగి, నమస్కరిస్తూ 108 సార్లు రామనామం లేక శివనామం జపించడం

ఈ అనుష్ఠానాన్ని మొదట తమ సమీపం లోని ఒక దేవాలయ ప్రాంగణంలో ప్రారంభించి, తర్వాత తమ తమ ఇళ్లల్లో జీవితాంతం ఆచరించి భగవదనుగ్రహపాత్రులు కావాలని శ్రీ శంకరాచార్యులవారి సందేశం

ఈ అనుష్ఠానాన్ని ప్రారంభించి ఆచరించే వారు తమ పూర్తి చిరునామాతో కాంచీపురం లోని శ్రీ కంచి కామకోటి పీఠం మానేజరు గారికి తెలియజేస్తే, మఠంలోని కామాక్షి అమ్మవారి నిత్య పూజాదివేళలో వారి పేర ఒక పుష్పాన్ని అమ్మవారికి సమర్పించి, వారి చిరునామాకు ప్రసాదం కూడా పంపడం జరుగుతుందని, కామకోటి పీఠాధిపతులు ఒక ప్రకటనలో తెలియజేస్తున్నారు

ఘంటసాల దశమ వర్ధంతి

జంషెడ్‌పూర్ ఆంధ్రులు గత నాలుగు సంవత్సరాలుగా ఫిబ్రవరి 11వ తేదీన స్వర్గీయ ఘంటసాల వర్ధంతి ఆంధ్ర సంఘం, గమరియా, ఆంధ్రనాటక సాహిత్య సంఘం, సాక్షి ద్వారా పాటల పోటీలు జరుపుతున్నారు 1984లో జరగబోవు "ఘంటసాల దశమ వర్ధంతి" [11-2-84] సందర్భముగా పాటల పోటీలు జంషెడ్‌పూర్ ఆంధ్రులకే పరిమితము గాక, ఆంధ్ర ఆంధ్రేతర రాష్ట్రములలోనున్న తెలుగు వారి అందరకూ వీలుగా పాటల పోటీలు జంషెడ్‌పూర్‌లో జరుప నిర్ణయించారు ఆ సందర్భముగా "సంగీత సంగమం" అనే క్రొత్త కార్యవర్గము ద్వారా ఘంటసాల దశమ వర్ధంతి పోటీలు భారీ ఎత్తున జరుప నిశ్చయించాము ప్రముఖ సినీప్లేబ్యాక్ కళాకారులతో ఒక రోజు సంగీత కార్యక్రమము ఏర్పాటు చేయుచున్నారు పాటల పోటీలలో పాల్గొనే ఔత్సాహికులు నిబంధనావళి, దరఖాస్తు, మొదలయిన వివరములకు 50 పైసల స్టాంపుతో స్వంత చిరునామాతో కూడిన 9"×4" కవరు జతపరిచి ఆర్గనైజింగు సెక్రటరీ, సంగీత సంగము, కేర్ ఆఫ్ ఎ డి ఎల్ సొసైటీ,సాక్షి జంషెడ్‌పూర్ – 831 001, బీహారు అన్న చిరునామాకి పంపవలసిందిగా సంస్థ కార్యదర్శి కోరుతున్నారు

ఘంటసాల పేర అవార్డులు

కీర్తిశేషులు శ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు పేర ప్రతి ఏటా ప్రముఖ సంగీతజ్ఞునకు, గాయనీ గాయకులకు, స్వరకర్తలకు అవార్డులను బహూకరించే సత్సంప్రదాయాని నెలకొల్పి, ఈ రంగంలో తెలుగువారు తమిళ సోదరులకు మించివున్నారని చెప్పవలసినదిగా స్థానిక సాంస్కృతిక సంస్థ తెలుగు కళావాహిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించినది

అమరగాయకుడు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా తెలుగు కళావాహినివారు యిక్కడ సమావేశమై ఈమేరకు ఏకగ్రీవంగా తీర్మానించి తీర్మాన ప్రతిని రాష్ట్రప్రభుత్వానికి పంపారు

అధ్యక్షులు శ్రీ చిట్టిబాబు తమ అధ్యక్షోపన్యాసంలో స్థానికంగా వున్న యువతరం కళాకారులను ముఖ్యంగా గాయనీగాయకులకు స్వరకర్తలను గుర్తించి ప్రోత్సహించవలసినదిగా కళాభిమానులకు విజ్ఞప్తి చేశారు

సర్వశ్రీ కోనేరు వెంకట సుబ్బారావు, మల్లాది రామకృష్ణ, సాధనాల సత్యనారాయణ, ముదిగొండ శ్రీనివాసరావు, యం నాగవీరభద్ర రావు ప్రభృతులు ప్రసంగిస్తూ తెలుగు కళావాహిని కృషిని ప్రశంసించారు

(—ఒవి)

బెంగుళూరులో ఇటీవల జరిగిన తెలుగు నాటకోత్సవాలలో డా మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి సేకరించిన 'నటరత్నాలు' ఫొటోల ప్రదర్శనని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడెమీవారు నిర్వహించారు శ్రీమతి బి జయమ్మ ప్రదర్శనకి ప్రారంభోత్సవం చేశారు శ్రీయుతులు సుంకర కనకారావు, డా బి కృష్ణంరాజా, ధూళిపాళ, మిక్కిలినేని గార్లని చిత్రంలో చూడవచ్చు



హైదరాబాద్ నోట్‌బుక్

డాక్టర్ వేలూరి రాధాకృష్ణ

"నిరంతర కళాసేవే నా లక్ష్యం స్వర్గాన వున్న మా తండ్రి రామమూర్తిగారు మా పెదతండ్రి శివరామశాస్త్రిగారు నాకు ఆదర్శం వారి అడుగుజాడలలో నడచుకోడమే నా కర్తవ్యం" అన్నారు ఇటీవల కలుసుకున్నప్పుడు ప్రఖ్యాత కళాకారులు, మిత్రులు శ్రీ వేలూరి రాధాకృష్ణ వంశానికి తగిన మాట వేలూరి వారందరూ ఆకార సదృశప్రజ్ఞలు, ప్రజ్ఞా సదృశాగములు, ఆగమ సదృశ క్రియాశీలులు ప్రాతఃస్మరణీయులు వేలూరి శివరామశాస్త్రిగారిని తలచుకొన్నప్పుడు పులి గడిగిన ముత్తెంవంటి ఆయన రూప గుణ పాండిత్య ప్రజాసేవలు సాక్షాత్కరించి మనసు ఆనంద తుందిలమవుతుంది ఆ వంశం వారంతా అలాటివారే ఏదో ఒక సాధన, ఏదో ఒక తపస్సు, ఏదో ఒక మానవ సేవ అలాంటప్పుడు రామమూర్తిగారివంటి కళాకారుల తనయుడు రాధాకృష్ణ మాటలు వేరుగా ఎలా వుంటాయి? ఆయన పుట్టింది కృష్ణాజిల్లా చిరివాడలో 1930లో ఆ వూరు పేరుకు చిరివాడేగాని నిజానికి సకల విద్యలకు నెరవాడ, పేర్వాడ తండ్రి వేలూరి రామమూర్తిగారు సుప్రసిద్ధ కళాచార్యులు ప్రమోద్‌కుమార్ చటర్జీ అంతేవాసులు తన కుమారుడు కూడ గొప్ప కళాకారుడు కావాలనుకున్నారు, శిక్షణ ఇచ్చారు రాధాకృష్ణ పిదప మద్రాసు లలిత కళాశాలలో దేవి ప్రసాద్‌రాయ్‌చౌదరీవద్ద, కళాభ్యాసం చేసి డిప్లొమా పొందారు తర్వాత శాంతినికేతన్‌లో శ్రీ నందలాల్‌బోస్‌వద్ద ప్రత్యేక శిక్షణ పొందారు కొన్నేళ్ళు ఆంధ్రపత్రికలో కళాకారులుగా పనిచేశారు అనంతరం చిత్ర కళోపాధ్యాయ వృత్తి అవలంబించారు, ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని పచ్‌మరీలో కళోపన్యాసకులుగా వున్నారు శ్రీ రాధాకృష్ణ లలితకళా రంగంలో చేపట్టని ప్రక్రియ లేదు, చేపట్టి దిట్టతనం చూపనిదీ లేదు ఎన్నో జల వర్ణచిత్రాలు, తైల వర్ణచిత్రాలు, రేఖాచిత్రాలు, లినోకట్స్, గ్రాఫిక్‌లు – ఇలా ఆయన తూలిక అతులంగా, అనంతా కళామూర్తులు సృజించింది దానికి ప్రాచీనార్వాచీన భేదమేమీలేదు, ఇజాల జోలి అసలే లేదు, దానిది నైజమైన (తనదే అయిన) రీతి, నిజమైన గతి ప్రజా జీవితం ముఖ్యంగా తెలుగు ప్రజల జీవితం రమణీయంగా చిత్రించే ఆ తూలికను ప్రజలు ఆదరించి ఆత్మీయం చేసుకొనడంలో అబ్బురమేమీ లేదు పూజకోసం, బాటసారులు, క్షేత్రయ్య, అప్రత్యక్ష శిష్యుడు, నాట్య కౌశలం మున్నగు చిత్రాలు మన రాష్ట్ర, మనదేశ సహృదయులకేకాక, అమెరికా, స్విట్జర్‌లాండ్, ఫిలిప్పీన్స్ మొదలైన విదేశాల కళాహృదయులనూ ఆకర్షించాయి పెక్కు చిత్రాలు మధ్యప్రదేశ్ గవర్నరు రాజభవనాన్ని, విదేశాలలో ప్రముఖుల ప్రాసాదాలను అలంకరించాయి ఆయన పెక్కు వ్యష్టి, సమష్టి కళాప్రదర్శనలు జరిపారు, పెక్కు ప్రశంసలు, బహుమతులూ పొందారు కవి విమర్శకుడు ఎలా అరుదో, కళాకారుడు, రచయిత, కళావిమర్శకుడు కావడమూ అరుదు తమ సుందర చిత్రాలలాంటిచక్కని శైలిలో రచన చేసి, మౌలిక కళా విమర్శ చేసే ఇద్దరిలో శ్రీ రాధాకృష్ణ ఒకరని నా వైయక్తికాభిప్రాయం ఆంధ్రాంగ్లాలలో ఆయన కళారీతులను గురించి, ముఖ్యంగా తెలుగు కళావైదగ్ధ్యాన్ని గురించి పెక్కు వ్యాసాలు వ్రాశారు, కళాకారుల జీవితాలు నిష్పక్షపాతంగా చిత్రించారు కళోదంతం అనేది కళపై వ్రాసిన ఉత్తమ గ్రంథం నేషనల్ బుక్‌ట్రస్ట్ కోసం 'కాశ్మీర్' అనే పుస్తకాన్ని అనువదించారు ఆంధ్రుల కళావైభవాన్ని నిఖిల భారతావనికి చాటడం ఆయన ఉద్దేశం ప్రవాసంలో వున్నా తెలుగుతనం కాపాడుకుంటూ కళను పదిమందికి పంచిపెడుతున్న పాళకుడు ఆయన ఆయనను ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడెమీ ఆదరించకపోయినా, మధ్యప్రదేశ్ లలితకళా అకాడెమీ కార్యవర్గ సభ్యత్వంతో గౌరవించింది "నేను 1965 లో భోపాల్‌రాగానే ఆదర్శ సాంస్కృతిక పరిషత్తును ప్రతిష్ఠించాను మధ్యప్రదేశ్ ప్రభుత్వపు నామోదుపొంది రిజిష్టరయిన సంస్థ ఇది గుర్తింపునకు రాలేని ప్రతిభావంతులయిన కళాకారులను, వారి శిల్పచిత్రాలను ప్రదర్శించి తగు ప్రోత్సాహం చేయడం దీని లక్ష్యం ఇక్కడ ఒక అఖిలభారతీయ కళా ప్రదర్శనను నడిపాను 19 వార్షిక కళా ప్రదర్శనలను నడిపాను రెండు కళా సదస్సులను ఏర్పాటు చేశాను అరడజను మంది ప్రముఖ కళాకారులను సన్మానించాను అదికాక ఏకవ్యక్తీయ (వ్యష్టి) ప్రదర్శనలనేకాన్ని ఏర్పాటు చేయించాను భారత ప్రభుత్వం ఈ సంస్థను గుర్తించింది దీనికి కేంద్ర లలితకళా అకాడెమీకి, ఇక్కడి మధ్యప్రదేశ్ లలితకళా అకాడెమీకి సంబంధం ఉంది ఇటీవలే రిధిమ్ ఆర్ట్స సొసైటీ పేరున ఒక ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ తెరచి వర్ధమాన కళాకారులను తయారిస్తున్నాను" అన్నారు ఆయన ప్రవాసంలో వున్నందున తెలుగువారు తనను మరచిపోయారనే ఆవేదన ఆయనకు కొంత ఉంది అలాటి ఆవేదన అనవసరమని నా అభిప్రాయం తెలుగువారు ఏ ప్రాంతాన్ని మెట్టినా కీర్తిని గుట్టలుగా పోశారు స్థానికుల హృదయాలు చూరగొన్నారు దీనికి చరిత్ర సాక్షి అన్యప్రాంతాలలో పేరు ప్రతిష్ఠలు సంపాదించిన తెలుగువారిని స్వరాష్ట్రంలోనివారు 'వారు మా వారే' అంటూ తర్వాత కౌగిలించుకోడం అందరికీ తెలిసిందే కనుక శ్రీ రాధాకృష్ణ ఆసేతుశీతనగ భారతావని తనదనే భావనతో కళాసేవ ఎప్పటిలాగే కొనసాగింతురుగాక! తెలుగువారు గుర్తించనంతమాత్రాన ఏం పోయింది! ప్రచారం, పై మెరుగులూ ఆశించక కళకే అంకితులైన శ్రీ రాధాకృష్ణ కీర్తి దిగ్దిగంతాలకు ఇతోధికంగా విస్తరించుగాక!

వేలూరి రాధాకృష్ణ



ఉపశ్రుతి :

ఏమిటి సార్, ఉత్తరం చివర తక్షక అని వ్రాశారే పేరా? – అనడిగారు నన్ను ఒకరు ఒక ఉత్తరం చూపి శేషుడు, వాసుకి, అనంతుడు అనే పేర్లు పెట్టుకోడం ఆచారం కాని, తక్షకుని పేరు పెట్టుకోడం వినలేదే? – అన్నాను అది పేరుకాదండీ తప్పులుంటే క్షమించ కలరు అనే మాటకు సంక్షేపీకరణం – అన్నారు మా మాటలు వింటున్న శ్రీ సంపత్కుమార చక్రవర్తి అనే లోకజ్ఞులు

– తిరుమల రామచంద్ర ★

Printed and Published by S Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street Gandhinagar Vijayawada-3 Editor S Radhakrishna



ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
PREM
Prem
REFRESHING SOAP
గులాబి మఱియు ఆకుపచ్చ
రంగులలో లభించును
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads M-1783